ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 17.12.2025 | సంపుటి :12 సంచిక : 148 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



సింగరేణి ఇన్‌ఛార్జి

## సీఎండీగా కృష్ణభాస్కర్

ప్రస్తుత ఇన్‌ఛార్జి సీఎండీ బలరాం డిప్యూటేషన్ గడువు ముగియడంతో ప్రభుత్వం నిర్ణయం

ఐడీపీఎల్ భూముల వివాదంపై

## విచారణకు ఆదేశం

## ఇంటర్ పరీక్షలో స్వల్ప మార్పు

మార్చి 3 నాటి పరీక్ష 4కు వాయిదా

## జనవరి 3 నుంచి 'టెట్'

కోల్‌కతా మెస్సి ఈవెంట్ గందరగోళం..

## క్రీడాశాఖ మంత్రి రాజీనామా


వివరాలు 2వ పేజీలో..

తెలంగాణ అభివృద్ధికి

# సహకరించండి


## హైదరాబాద్‌కు ఐఐఎంను మంజూరు చేయండి

- అవసరమైన 200 ఎకరాల భూమి ఇస్తాం
- ట్రాన్సిట్ క్యాంపస్‌లో వెంటనే తరగతులు ప్రారంభం
- 9 కేంద్రీయ, 16 నవోదయ విద్యాలయాలను మంజూరు చేయండి
- తెలంగాణలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు సహకరించండి
- ఆ పాఠశాలలకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించండి
- కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, నిర్మలా సీతారామన్‌లకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- ముఖ్యమంత్రి వినతిపై సానకూలంగా స్పందించిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



న్యూఢిల్లీ,డిసెంబర్ 16(జనంసాక్షి): హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎంను మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాల్లో 1 కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎంలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల మిగతా 2లో..

- తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను సోనియాకు అందజేసిన సీఎం రేవంత్
- ముఖ్యమంత్రి దూరదృష్టిని అభినందించిన కాంగ్రెస్ అధినేత్రి



పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు

# ఏపీ కుట్ర

- పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ప్రభుత్వం
- బచావత్ ట్రైబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా జలాలు తరలించే ప్రయత్నమని వాదన



న్యూఢిల్లీ(జనంసాక్షి):పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించిం ది. పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించే యత్నం చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొంది. బచావత్ ట్రైబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా జలాలు తరలించే యత్నమని పిటిషన్‌లో తెలిపారు. ప్రాజెక్టుపై తదుపరి ముందుకు వెళ్లకుండా అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.అసలేం జరిగిందంటే.. ఏపీ చేపడుతున్న పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు వెళ్లా లని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడో నిర్ణయించుంది. ఈ క్రమంలో ప్రాజెక్టుకు సంబంధించిన ఆధారాలను సిద్ధం చేసుకుంది. ఇంతకు ముందు పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఏపీ ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు రూపొందించి కేంద్ర జలశక్తిశాఖకు పంపించింది. దీనిపై కృష్ణా, గోదావరి బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అభ్యంతరం తెలిపాయి. అలాగే పలు గోదావరి పరీవాహక రాష్ట్రాలు కూడా అనేక సందేహాలను లేవనెత్తాయి. ఈ పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రిని, సీడబ్ల్యూసీని కూడా కలిసి తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. మరోవైపు ఏపీ ఈ లింక్ ప్రాజెక్టు డీపీఆర్‌కు టెండర్లు పిలిచిన విషయం విదితమే. చివరికి ఈ లింక్ టెండర్లను ఏపీ ప్రభుత్వం రద్దు చేసింది. పీబీ లింక్ ప్రాజెక్టులో మార్పు చేసి బనకచర్ల బదులు నల్లమలసాగర్‌కు నీటిని తరలించేందుకు కొత్త లింక్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. ఈ లింక్‌లో భాగంగా గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీలను బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల సాగర్‌కు తరలించనుంది. తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం, ట్రైబ్యునల్‌అవార్డులు ఇతర నిబంధనలన్నింటినీ మిగతా 2లో..

## నేడు పంచాయతీ తుది తీర్పు

- ఆఖరు విడతకు సర్వం సిద్ధం..
- 3,752 పంచాయతీల్లో పోలింగ్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం 182 మండలాల్లోని 3,752 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. మూడో విడతలో మొత్తం 4,159 మిగతా 2లో..

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో

## 16 మంది మావోయిస్టులు అరెస్ట్

బీజాపూర్‌లో 34 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఆదిలాబాద్(జనంసాక్షి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మావోయిస్టులు ఆశ్రయం పొందాలని చూడటం అలజడి రేకెత్తించింది. కుమురం భీం జిల్లా సిర్పూర్(యు) మండలం బాజ్జీపేట పంచాయతీ పరిధిలోని పెద్దదోబ గూడెంలో ఓ ఇంట్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసు యంత్రాంగం పసిగట్టింది. కుమురం భీం ఏఎస్పీ చిత్తరంజన్ నేతృత్వంలో ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుంది. ఎదురుకాల్పులకు తావులేకుండానే 16 మందిని అదుపులోకి తీసుకుంది. వారి నుంచి ఒక ఏకే-47, మరో రెండు ఇన్సాస్ ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. పోలీసులు అరెస్టు చేసిన మిగతా 2లో..

27 ఏళ్ల క్రితమే హైదరాబాద్ వదిలి

# వెళ్లిపోయాడు

## సిడ్నీ దాడి ఉగ్రదాడి నిందితుడి వ్యవహారంపై డిజీపీ ప్రకటన



హైదరాబాద్(జనంసాక్షి):ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఇటీవల చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనకు సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బోండీ బీచ్‌లో కాల్పులు జరిపిన నిందితుల్లో ఒకడైన సాజిద్ అక్రమ్ (50) వద్ద భారత పాస్‌పోర్ట్ ఉన్నట్లు ఆస్ట్రేలియా అధికారులు గుర్తించారు. అతడు హైదరాబాద్ నుంచి పాస్‌పోర్టు పొందినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణ డీజీపీ కార్యాలయం దీనిపై ప్రకటన మిగతా 2లో..



# మహాత్మా గాంధీని అవమానపరుస్తారా?

## ఎంజీనరేగా రద్దుపై పార్లమెంటులో దూమారం

- సభ ముందుకు ' వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవికా హామీ మిషన్'చట్టం
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్
- భగ్గుమన్న విపక్ష సభ్యులు... పోడియం వద్ద నిరసన
- మహాత్మా గాంధీ ఆదర్శాలను అవమానించడమే
- పాత చట్టం రద్దుతో పేదలకు పెద్ద దెబ్బ
- ఉద్యోగాలు ఇవ్వకుండా..ఉపాధి కూడా ఎత్తేస్తారా?
- ధ్వజమెత్తిన రాహుల్ గాంధీ
- ప్రభుత్వ తీరును ఏకి పారేసిన ఎంపీ ప్రియాంక
- గాంధీ పేరు మార్చడంపై మండిపడ్డ శశిథరూర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా విపక్ష సభ్యుల వాకౌట్
- 17 దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం ఎంజీ నరేగా రద్దుపై పార్లమెంటులో తీవ్ర గందరగోళం చెలరేగింది. నరేగా రద్దును నిరసిస్తూ విపక్ష సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ఇది గాంధీని అవమానించడమేనని అన్నారు. నరేగా స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రామ్ జీ) బిల్లు- 2025'ను కేంద్ర మంత్రి శివ రాజ్ సింగ్ చౌహన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్





ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఇది ఎంజీ నరేగా చట్టాన్ని మిగతా 2లో..

గాంధీ పేరును తొలగించేందుకు

## కేంద్రం కుట్ర

- దీనిపై దేశవ్యాప్త ఆందోళనలకు దిగుతాం
- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

2లో..



# ప్రధానితో భేటి వివరాలు లీక్‌చేశారు

## చెప్పినవారు ఎవరో చెబితే చర్యలు తీసుకుంటాం : కిషన్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి): ప్రధాని మోదీతో తెలంగాణ భాజపా ఎంపీలతో జరిగిన సమావేశంలోని అంశాలు లీక్ కావడంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటింగ్‌లో జరిగిన విషయాలు బయటకు చెప్పొద్దని ప్రధాని అన్నారని, అయినా ఆ విషయాలు బయటకు వచ్చాయని అసహనం వ్యక్తంచేశారు. ఆ అంశాలు బయటకు చెప్పినవారు ఎవరో చెబితే చర్యలు తీసుకుంటామన్నారు. "సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని చెప్పారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. దక్షిణ భారత్ నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉప రాష్ట్రపతులు మిగతా 2లో..

# దాడులకు ప్రతిదాడులు తప్పవు

## కాంగ్రెస్ దౌర్జన్యాలపై పోలీసులు మౌనం వహిస్తే చూస్తూ ఊరుకోం

గ్రామాల్లో అధికార పార్టీ రౌడీయిజం చేస్తోంది • కామారెడ్డి జిల్లా బాధితులకు కెటిఆర్ పరామర్శ



హైదరాబాద్(జనంసాక్షి):గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదన్నారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకపోతే తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా సోమార్‌పేట్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, అతని భార్య గంజి భారతిని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు ఇష్టమొచ్చినట్టు దాడులకు తెగబడుతుంటే.. పోలీసులు నిశ్చేష్టులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే తాము కూడా తిరగబడాల్సి వస్తుందన్నారు. ఇక దాడికి ప్రతిదాడే సమాధానం అనుకుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న అత్యంత దారుణంగా ఉందన్నారు. డీజీపీ స్థాయి నుంచి కిందిస్థాయి పోలీస్ అధికారుల వరకు అందరికీ గుర్తు చేస్తున్నా.. మీకు జీతాలు ఇస్తున్నది ప్రజల సొమ్ముతోనే. రేవంత్ ఇంట్లో సొమ్ముతోనే, కాంగ్రెస్ సొమ్ముతోనే కాదు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి మిగతా 2లో..

# పగబట్టిన పొగమంచు


- దారి సరిగా కనబడక ఢిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్ రహదారిపై ఢీకొన్న పలు వాహనాలు
- మంటలు చెలరేగి 13 మంది మృతి.. 75 మందికి గాయాలు

లక్నో(జనంసాక్షి):ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. దిల్లీ- ఆగ్రా ఎక్స్‌ప్రెస్ రహదారిపై పొగమంచు కారణంగా ఏడు బస్సులు, మూడు కార్లు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. దీంతో భారీగా మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 13కు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. మరో 75 మంది గాయపడినట్లు తెలిపారు. యమునా ఎక్స్‌ప్రెస్ వే మార్గంలోని ఆగ్రా- నోయిడా క్యారేజ్ వేపై ఈ ప్రమాదం జరిగింది.దట్టమైన పొగమంచు వల్ల వాహనాలు ఒకదాన్నొకటి ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో భారీగా మంటలు చెలరేగాయని.. బస్సులు, కార్లు నిమిషాల్లోనే దగ్ధమయ్యాయన్నారు. స్థానికుల సమాచారంతో మిగతా 2లో..

జోర్డాన్- భారత్ పాత సంబంధాలను

# పునరుద్ధరించుకోవాలి

## ఆ దేశ పర్యటనలో ప్రధాని మోదీ సూచన



అమ్మాన్(జనంసాక్షి):ప్రపంచానికి కొత్త వృద్ధి ఇంజిన్, సరఫరా గొలుసు అవసరం ఉందని ఈ డిమాండ్‌ను తీర్చడంలో భారత్, జోర్డాన్‌లు కలిసి కీలక పాత్ర పోషించగలవని ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని మూడో దేశాల పర్యటనలో భాగంగా జోర్డాన్‌లో పర్యటిస్తున్న మోదీ అమ్మాన్‌లో జరిగిన భారత్- జోర్డాన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాని జోర్డాన్‌కు భారత్ మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉందని గుర్తు చేశారు.జోర్డాన్‌తో దీర్ఘకాలిక సంబంధాన్ని నిర్మించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఒకప్పుడు గుజరాత్ నుంచి పెట్రా మీదుగా ఐరోపాకు వాణిజ్యం జరిగేదని ప్రధాని గుర్తు చేసుకున్నారు. ఇరుదేశాల భవిష్యత్ శ్రేయస్సు కోసం పాత సంబంధాలను పునరుద్ధరించుకోవాలని మోదీ సూచించారు.'భారత వృద్ధి రేటు 8 శాతానికి పైగా ఉంది. ఉత్పాదకత, సుపరిపాలన, ఆవిష్కరణల ఆధారిత విధానాల ఫలితంగా ఇది సాధ్యమైంది. జోర్డాన్ నుంచి వచ్చే వ్యాపారులు, పెట్టుబడిదారులకు కొత్త అవకాశాల ద్వారాలు తెరుచుకుంటున్నాయి. భారత్ వేగవంతమైన వృద్ధిలో మీరు భాగస్వామి కావచ్చు. మీ పెట్టుబడులపై గొప్ప రాబడి కూడా వస్తుంది. ఇవాళ ప్రపంచానికి ఒక కొత్త వృద్ధి చోదకం కావాలి. విశ్వసనీయమైన సరఫరా గొలుసు అవసరం ఉంది. ఈ అవసరాన్ని తీర్చడంలో మిగతా 2లో..

నేషనల్ హెరాల్డ్ కేసు..

# సోనియా, రాహుల్‌కు ఊరట

న్యూఢిల్లీ(జనంసాక్షి):నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి కాస్త ఊరట లభించింది. ఈ కేసులో వీరిద్దరితో పాటు మరో ఐదుగురిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు దిల్లీ హైకోర్టు నిరాకరించింది. మిగతా 9లో..



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
17.12.2025

### పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు

# ఏపీ కుట్ర

ఉల్లంఘిస్తూ, తెలంగాణ అభ్యంతరాలను ఖాతరు చేయకుండా ఏపీ ఈ లింక్? ప్రాజెక్టు చేపడుతోందని అని ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించడం మినహా మరేదారీ లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టులో కేసు దాఖలు, ఆధారాలు తదితర పరిణామాలపై శనివారం దిల్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి న్యాయనిపుణులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించనున్న అభిషేక్ సింఘ్వీతో సమావేశమయ్యారు. ఇప్పుడు సుప్రీంకోర్టులో పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ పిటిషన్‌దాఖలు చేసింది. పోలవరం - నల్లమలసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.58 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. మొదట్లో భావించిన మూడు సెగ్మెంట్లలోనే పనులు చేయనున్నారు. మూడో సెగ్మెంట్?లో గతంలో అనుకున్నట్లు బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల వరకు కాకుండా బొల్లాపల్లి నుంచి నల్లమలసాగర్ జలాశయం వరకే అది పరిమితం కానుంది. ఇందుకు రూ.9 వేల కోట్లు ఖర్చు అవుతాయని లెక్క.. మొదటి, రెండు సెగ్మెంట్లలో ఎలాంటి మార్పు లేదు. తొలి సెగ్మెంట్‌కు (పోలవరం-ప్రకాశం బ్యారేజి) రూ.13 వేల కోట్లు ఖర్చు, రెండో సెగ్మెంట్‌కు (ప్రకాశం బ్యారేజి-బొల్లాపల్లి)లో బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మించి అక్కడికి పోలవరం నీటిని తరలిస్తారు. దీనికి రూ.36 వేల కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఈ ప్రాజెక్టుపై ఆశ్రయించడంపై ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో తెలియాలి. బొల్లాపల్లి జలాశయానికి నీళ్లు తీసుకెళ్లి అక్కడి నుంచి వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న నల్లమలసాగర్ జలాశయానికి గోదావరి నీళ్లు తరలించాలనేది కొత్త ప్రణాళిక. అవసరమైతే ఈ జలాలను సోమశిలకూ మళ్లిస్తారు. ఈ ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం సీరియస్?గా తీసుకుంది. మరి సుప్రీంకోర్టులో ఎలాంటి తీర్పు వస్తుందో వేచి చూడాల్సిందే.

## ప్రధానితో భేటి వివరాలు లీక్‌చేశారు

అయ్యారు. భాజపాలో కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంటుంది" అని కిషన్‌రెడ్డి అన్నారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్రంలో 42 రైల్వేస్టేషన్ల పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై చర్చించామన్నారు. రూ.400 కోట్లతో హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు పొడిగించాల్సిన ఎంఎంటీఎస్ రెండో దశపై మాట్లాడినట్లు తెలిపారు. కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తిచేసి దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆయన్ను కోరినట్లు కిషన్‌రెడ్డి చెప్పారు.ఓట్ చోరీ ర్యాలీలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి ఖండించారు. రాహుల్ అనైతికంగా మాట్లాడుతున్నారన్నారు. ఏ విషయాలు మాట్లాడాలనే దానిపై ఆయనకు అవగాహన లేదని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ ఉండటం దురదృష్టకరమన్నారు.

## దాడులకు ప్రతిదాడులు తప్పవు



చూడటం పద్ధతి కాదని హెచ్చరించారు. భారతి, బాలరాజులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలన్నారు. ఆస్పత్రి పాలైన వారి కుటుంబాని ఆర్థిక సహాయం, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండేండ్లుగా బీఆర్ఎస్ కార్యకర్తకలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడు తున్నారని చెప్పారు. సూర్యాపేట, నల్లగొండలో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడి చేసి మూత్రం తాగించారన్నారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ కార్యకర్త మల్లయ్య యాదవ్‌ను కాంగ్రెస్ గూండాలు హత్య చేశారు, ఇంకో బీసీ సోదరుడి భార్య నామినేషన్ వేస్తే, అతడిని కిడ్నాప్ చేసి కోమటిరెడ్డి అనుచరులు చిత్ర హింసలు పెట్టారన్నారు. ఇన్ని అరాచకాలు జరిగినా పోలీసులు ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ గుర్తుపెట్టుకుంటున్నామని, పోలీసులు డ్యూటీ సరిగ్గా చేయకపోతే తామే డ్యూటీ చేస్తామన్నారు. దాడికి ప్రతిదాడి అనే పరిస్థితే వస్తే తాము కూడా తిరగబడతామన్నారు. కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్ర గాయాల పాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భారతి, బాలరాజ్ కుటుంబానికి, ఇతర కార్యకర్తలకు అయ్యే పూర్తి వైద్య ఖర్చులను పార్టీనే భరిస్తుందని చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని.. దాడికి తెగబడ్డ కాంగ్రెస్ గూండాలను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే డీజీపీ, ఎస్పీ కార్యాలయాల ముట్టడికైనా పిలుపునిస్తామన్నారు.

## మెక్సికోలో కుప్పకూలిన విమానం

### ఏడుగురి మృతి

**మెక్సికోసిటీ(జనంసాక్షి):** మెక్సికోలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ చిన్న ప్రైవేటు విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.మెక్సికో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. టోలుకా విమానాశ్రయానికి ఐదు కిలోమీటర్లు దూరంగా ఉన్న శాన్‌మాటియో అటెన్కోలో ఈ ఘటన జరిగింది. అకాపుల్కో నుంచి బయలుదేరిన ఈ విమానంలో ఎనిమిది మంది ప్రయాణికులు ఉండగా.. ఇద్దరు సిబ్బంది ఉన్నారు. అయితే, ఏడు మృతదేహాలను మాత్రమే గుర్తించినట్లు వెల్లడించారు. సాకర్ మైదానంలో అత్యవసరంగా ల్యాండ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా.. అక్కడ ఉన్న ఓ పరిశ్రమ పైకప్పును ఢీకొట్టింది. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు. దీనిపై దర్యాప్తు జరుగుతుందన్నారు. ఇక, శాన్‌మాటియో అటెన్కో మేయర్ అనా మునిజ్ మిలేనియా మాట్లాడుతూ.. పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు.

## కెనడా పౌరసత్వ నిబంధనల్లో కీలక మార్పులు

**ఒట్టావా(జనంసాక్షి):**పౌరసత్వానికి సంబంధించి కెనడా ప్రభుత్వం నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. కెనడా బయట జన్మించిన కెనడియన్ల పిల్లలకు అక్కడి పౌరసత్వం కల్పించేందుకు వీలు కల్పించింది. తల్లిదండ్రులు కచ్చితంగా మూడేళ్లు కెనడాలో ఉండాలన్న నిబంధన విధించింది. ఈ పౌరసత్వ చట్టంలో తీసుకొచ్చిన మార్పులు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. వీటితో ఎంతో మంది లాస్ట్ కెనడియన్స్‌కు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ సంస్కరణతో అనేకమంది భారతీయ కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని తెలుస్తోంది."2025 డిసెంబర్ 15వ తేదీకి ముందు జన్మించిన లేదా పాత నియమాల వల్ల పౌరసత్వం లభించని పౌరులు కెనడియన్లుగా గుర్తింపునకు నోచుకుంటారు. వీరు పౌరసత్వ రుజువు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు" అని ఇమిగ్రేషన్, రిఫ్యూజీ, సిటిజెన్‌షిప్ కెనడా వెల్లడించింది. నిబంధనల ప్రకారం.. కెనడా వెలు పల జన్మించిన లేదా దత్తత తీసుకున్న పిల్లల తల్లిదండ్రుల్లో కనీసం ఒకరైనా కెనడాలో పుట్టడమో, కన్నుమూయడమో జరిగి ఉండాలి. దీని కారణంగా చాలామంది పౌరసత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. 2023లో అంటారియో న్యాయస్థానం ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పింది. దీనిపై ప్రభుత్వం కూడా అంగీకరించి అప్పీలుకు వెళ్లలేదు.

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి సీఎం వెల్లడించారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతులు కల్పనకు తాము సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటు చేస్తే అది తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల అవకాశాలను మెరుగుపర్చుతుందని సీఎం అన్నారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అవసరం ఉందని సీఎం అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మందాడి అనిల్ కుమార్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌తో ఆయన భేటీ అయ్యారు.





తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు సీఎం అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ కోరారు. యంగ్ ఇండియా స్కూళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను పంపాలని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి సూచించారు. దాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**సీఎం దూరదృష్టిని అభినందిచిన సోనియా గాంధీ :**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని రేవంత్ రెడ్డి కలిశారు. పార్లమెంటుకు వచ్చే ముందు సోనియాతో భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను సోనియాకు అందించిన సీఎం రెండేళ్లుగా అమలవుతున్న పథకాలు, పనులను వివరించారు. సీఎం దూరదృష్టిని సోనియా అభినందించారని సీఎంవో తెలిపింది.

## సింగరేణి ఇన్‌ఛార్జి సీఎండీగా కృష్ణభాస్కర్

**హైదరాబాద్(జనంసాక్షి):** సింగరేణి సంస్థ ఇన్‌ఛార్జి సీఎండీగా ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ నియమితులయ్యారు. ప్రస్తుత ఇన్‌ఛార్జి సీఎండీ బలరాం డిప్యుటేషన్ గడువు ముగియడంతో.. ఆయన స్థానంలో కృష్ణభాస్కర్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. కేంద్ర రెవెన్యూ సర్వీసు నుంచి డిప్యుటేషన్‌పై తెలంగాణకు వచ్చిన బలరాం.. సింగరేణిలో సంచాలకుడిగా, ఇన్‌ఛార్జి సీఎండీగా మొత్తం ఆరేళ్ల పాటు పనిచేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన అధికారులకు డిప్యుటేషన్ గడువు సాధారణంగా ఐదేళ్లే ఉంటుంది. అంతకుమించి.. ఏడాది అదనంగా ఉన్నందున మరో సారి గడువు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరలేదు.

## ఐడీపీఎల్ భూముల వివాదంపై విచారణకు ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని ఐడీపీఎల్ భూములపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కూకట్‌పల్లిలోని సర్వే నంబర్ 376లో రూ.4 వేల కోట్ల విలువైన భూములపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. భూ కబ్జాలపై ఇటీవల ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. కవిత భర్త అనిల్‌పై మాధవరం కృష్ణారావు భూకబ్జా ఆరోపణలు చేశారు. ఈ వివాదం సంచలనంగా మారిన నేపథ్యంలోనే ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

## పగబట్టిన పొగమంచు

అగ్నిమాపక దళాలు, పోలీసు బృందాలు, అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటలు అదుపు చేసి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది.

## 27 ఏళ్ల క్రితమే హైదరాబాద్ వదిలి వెళ్లిపోయాడు

విడుదల చేసింది. సాజిద్ అక్రమ్ హైదరాబాద్ వ్యక్తి అని వెల్లడించింది. ఇక్కడే బీకామ్ చదివిన సాజిద్ 27 ఏళ్ల క్రితం 1998లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియా వెళ్లాడు. యూరోపియన్ యువతి వెనెరా గ్రోసోను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు నవీద్ అక్రమ్, కుమార్తె. వీరిద్దరూ ఆస్ట్రేలియా పౌరులే. సాజిద్ అక్రమ్ ఇప్పటికీ భారత పాస్‌పోర్టునే వినియోగిస్తున్నాడు. అయితే, హైదరాబాద్‌లో అతడికి అతి తక్కువ సంబంధాలు ఉన్నాయని, ఆస్ట్రేలియాకు వలస వెళ్లాక సాజిద్ ఆరుసార్లు భారత్‌కు వచ్చాడని తెలిపింది. కుటుంబ, ఆస్తులకు సంబంధించిన వ్యవహారాల కోసమే ఇక్కడకు వచ్చాడు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు అతడికి ఎలాంటి నేర చరిత్ర లేదు. ఉగ్రవాదులతో సాజిద్‌కు సంబంధాలపై తమకేమీ తెలియదని హైదరాబాద్‌లోని కుటుంబసభ్యులు తెలిపారని తెలంగాణ డీజీపీ కార్యాలయం తమ ప్రకటనలో వెల్లడించింది. యూదులు 'హనుక్కా ఉత్సవం చేసుకుంటుండగా ఈ ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు 24 ఏళ్ల నవీద్ అక్రమ్.. విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సాజిద్ హతమవ్వగా.. నవీద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరికి ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐసిస్)తో సంబంధాలున్నట్లు తెలుస్తోంది.దాడికి ముందు నవంబర్‌లో తండ్రీకొడుకులు ఫిలిప్పీన్స్‌కు వెళ్లి వచ్చారు. అక్కడ ఐఎస్ఐఎస్-సంబంధిత ప్రాంతాల్లో శిక్షణ తీసుకున్నారనే అనుమానాలు ఉన్నాయి. వారి వాహనంలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైస్‌లు, హోమ్‌మేడ్ ఐఎస్ఐఎస్ జెండాలు లభ్యమయ్యాయి. దాడి ఐఎస్ఐఎస్ భావజాలం ప్రేరేపితమని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. ఈ ఘటనపై భారత నిఘా సంస్థలు సాజిద్ కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నాయి. విషయం తెలిసిన హైదరాబాద్‌లోని అతడి బంధువులు షాక్‌కు గురయ్యారు. అయితే, తండ్రి చనిపోయిన సమయంలో భారతదేశానికి సాజిద్ రాలేదని పోలీసులు చెప్తున్నారు.సాజిద్ అక్రమ్ ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలియదని పోలీసులు అంటున్నారు. సాజిద్ అక్రమ్, అతని కుమారుడు నవీద్ ఉగ్రవాదం వైపు వెళ్ళడానికి స్థానిక ప్రభావం లేదని గుర్తించారు. 1998 సమయంలో సాజిద్ అక్రమ్ పై భారతదేశంలో ఎటువంటి కేసులు లేవని పోలీసులు అంటున్నారు.

## జనవరి 3 నుంచి 'టెట్'



**హైదరాబాద్,డిసెంబర్ 16(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ జనవరి -2026 పరీక్షల షెడ్యూల్‌ను సంబంధిత అధికారులు విడుదల చేశారు. ఈ పరీక్షలు జనవరి 3 నుంచి జనవరి 20 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మొత్తం 9 రోజుల్లో 15 సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటంతో ప్రతి రోజూ రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నారు. సెషన్-ఎ పరీక్ష ఉదయం 9.00 గంటల నుంచి 11.30 గంటల వరకు కొనసాగుతుంది. సెషన్-ఎఎ పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు అభ్యర్థులు ముందుగానే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

## ఇంటర్ పరీక్షలో స్వల్ప మార్పు

### మార్చి 3 నాటి పరీక్ష 4కు వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. మార్చి 3న జరగాల్సిన ఇంటర్ సెకండియర్ మ్యాథ్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలను మరుసటి రోజు అంటే మార్చి 4న నిర్వహించనున్నట్లు తెలిపింది. మార్చి 3న హోలీ పండగ ఉండటంతో పరీక్షల తేదీలో మార్పు చేసినట్లు వెల్లడించింది. మిగతా పరీక్షలు యథాతథంగా నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది.

## కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16 మంది మావోయిస్టుల అరెస్ట్

మావోల్లో తొమ్మిది మంది మహిళలు, మరో ఏడుగురు పురుషులు ఉన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ వాసులని తెలుస్తోంది. పట్టుబడిన మావోలతోపాటు షెల్టర్ ఇచ్చిన మరో ముగ్గురు పెద్దదోబ వాసులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. ఛత్తీస్‌గఢ్‌లో పెద్దఎత్తున ఏరివేత నేపథ్యంలో.. షెల్టర్ కోసం కుమురం భీం జిల్లాకు వచ్చిన మావోలు సెల్‌ఫోన్ వినియోగించటంతో నిఘావర్గాల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది.

**బీజాపూర్‌లో 34 మంది మావోయిస్టుల లొంగుబాటు**

చర్ల: చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్, సీఆర్పీఎఫ్ డీఐజీ ఎదుట మంగళవారం 34 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిపై మొత్తం రూ.84 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. మావోయిస్టులు ఇక హింస మార్గాన్ని విడనాడక తప్పదన్నారు.

## కోల్‌కతా మెస్సి ఈవెంట్ గందరగోళం..

### క్రీడాశాఖ మంత్రి రాజీనామా

**కోల్‌కతా(జనంసాక్షి):**అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి పర్యటన వేళ కోల్‌కతా స్టేడియంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బెంగాల్ ప్రభుత్వం దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర క్రీడల మంత్రి అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజీనామా చేశారు. స్టేడియంలో గందరగోళం విషయంలో ఆయనపై తీవ్ర విమర్శలు వస్తుండడంతో.. ఈ ఘటనపై న్యాయబద్ధంగా దర్యాప్తు జరిగేందుకు వీలుగా తాను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి తన రాజీనామా లేఖను పంపినట్లు వెల్లడించారు.ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న విచారణ కమిటీ సూచనల మేరకు బెంగాల్ ప్రభుత్వం డీజీపీ రాజీవ్ కుమార్, బిధాన్‌నగర్ పోలీస్ కమిషనర్ ముఖేష్ కుమార్, యువజన వ్యవహారాలు క్రీడాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేష్ కుమార్ సిన్హాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఘటనలో లోపాలపై 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. బిధాన్‌నగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అనీష్ సర్కార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత పర్యటనలో భాగంగా శనివారం కోల్‌కతా స్టేడియానికి వచ్చిన మెస్సి కొన్ని నిమిషాల్లోనే అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ప్రేక్షకులు ఆగ్రహానికి గురయ్యారు.

# మహాత్మాగాంధీని అవమానపరుస్తారా?

బలహీనపర్చడమేనని దుయ్యబట్టారు. ప్రభుత్వ పథకాల పేర్లను మార్చడం అనేది చాలా ఖర్చుతో కూడుకున్న పని. అయినా కేంద్రం మారుస్తూనే ఉంది. పథకాల పేర్లను మార్చడం అంటే మోదీ ప్రభుత్వానికి ఎందుకంత ఇష్టమో అర్థం కావట్లేదని అన్నారు. ఎంజీ నరేగా చట్టం పేద ప్రజలకు 100 రోజుల ఉపాధి హామీ కల్పిస్తోంది. ఈ కొత్త బిల్లుతో ప్రస్తుత చట్టాన్ని బలహీనపర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బిల్లులో ఒకటో, రెండో కొత్త విషయాలు చేర్చారు. పని దినాలను పెంచారు. అంతేగానీ.. వేతనాన్ని పెంచారా అని ప్రియాంక ప్రశ్నించారు. గతంలో గ్రామ పంచాయతీలు ఈ పథకం కింద పని చేయించేవి. ఇప్పుడు కొత్త బిల్లుతో పంచాయతీలకు ఆ హక్కును దూరం చేస్తున్నారు. ఇక, ఈ బిల్లుతో ఉపాధి హామీ పథకంపై కేంద్రం నియంత్రణను పెంచి, నిధులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరి ఇష్టానుసారంగానో బిల్లులను ఆమోదించుకుంటామంటే కుదరదు. ఈ బిల్లును తక్షణమే కేంద్రం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక అన్నారు. ప్రియాంక మాట్లాడుతుండగా.. ట్రెజరీ బెంచ్‌లో కొందరు 'ఫ్యామిలీ' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ.. మహాత్మా గాంధీ మా కుటుంబానికి చెందిన వ్యక్తి కాదు కానీ, మా కుటుంబసభ్యుడితో సమానం. గాంధీజీని యావత్ దేశం అలాగే భావిస్తోందని కౌంటర్ ఇచ్చారు. అనంతరం టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ మాట్లాడుతూ రాముడి పేరుతో కేంద్రం దోపిడీకి పాల్పడుతోందని దుయ్యబట్టారు. ఉద్దేశపూర్వకంగా గాంధీ పేరును తొలగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, విపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ తిప్పికొట్టారు. మహాత్మాగాంధీ అంటే తమకు ఎంతో గౌరవమని, ఆయన సిద్ధాంతాలను తమ ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వాల కంటే మోదీ సర్కారు ఎంతో కృషి చేసిందని తెలిపారు. పేదల సంక్షేమం, ఉపాధి పెంపు కోసమే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ బిల్లుపై లోక్‌సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. కేంద్రం తీరును నిరసిస్తూ విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. అనంతరం గాంధీజీ ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. ఈ పథకానికి గాంధీ పేరును తొలగించడం అనైతికమని అన్నారు. అంతేగాక, రాముడి పేరును అపవిత్రం చేయొద్దంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సోమవారం కూడా థరూర్ ఈ పేరు మార్పుపై ఎక్స్ వేదికగా స్పందించారు. ఎంజీనరేగా పేరు మార్చి.. కేంద్రం కొత్తగా జీ రామ్ జీ బిల్లు తీసుకురావడంపై జరుగుతున్న వివాదం దురదృష్టకరం. గ్రామ స్వరాజ్ సిద్ధాంతాలు, రామరాజ్య ఆదర్శాలు ఎన్నటికీ ఒకదానితో ఒకటి పోటీపడేవి కాదు. గాంధీజీ దృక్పథానికి అవి రెండు మూల స్తంభాల్లాంటివి. ఇప్పుడు పథకానికి పేరు మార్చడం అంటే ఆయన ఆదర్శాలను విస్మరించినట్లే. ఆయన వారసత్వాన్ని అగౌరపర్చే ప్రయత్నం చేయొద్దని థరూర్ అన్నారు.శశిథరూర్ గత కొంతకాలంగా కాంగ్రెస్ తో విభేదిస్తూ మోదీ ప్రభుత్వంపై బహిరంగంగానే ప్రశంసలు కురిపిస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో సొంత పార్టీ నేతల ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బిల్లు విషయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

**17 కాంగ్రెస్ దేశవ్యాప్త ఆందోళన**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పునకు వ్యతిరేకంగా డిసెంబర్ 17న దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు హక్కుల ఆధారిత సంక్షేమాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని, దానిని కేంద్రం నుండి నియంత్రించే దాతృత్వ సంస్థతో భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. గాంధీజీ వారసత్వంపైన, కార్మికులు, వారి హక్కులైనా బిజెపి కుట్రపూరితంగా దాడి చేస్తోంది. మహాత్మాగాంధీ పేరును, ఆయన విలువలను తుడిచేయడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 17న జిల్లా ప్రధాన కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేసింది.

**మహాత్మా గాంధీ ఆదర్శాలకు అవమానం : ఎంజీ నరేగా రద్దుపై రాహుల్**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురావడానికి బిల్లు ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీవిమర్శించారు. మహాత్మా గాంధీ ఆదర్శాలను అవమానించమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోందని దుయ్యబట్టారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేసిన మోదీ ప్రభుత్వం..ఇప్పుడు గ్రామీణ ప్రజలకు కూడా ఉపాధి లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ఈ ప్రజా వ్యతిరేక బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ర్యాలీగా పార్లమెంటు వరకు వెళ్లి తమ నిరసనను తెలియజేస్తాయన్నారు. "మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులపై ప్రధాని మోదీకి ముందు నుంచి తీవ్రమైన అయిష్టత ఉంది. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే గాంధీ ఆలోచనకు ఎంజీ నరేగా ఓ సజీవ స్వరూపం. ఎన్నో ఏళ్లుగా ఇది లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు జీవనాడిగా ఉంది. కొవిడ్ సమయంలో కూడా ఈ పథకం పేదలకు ఆర్థిక భద్రతను ఇచ్చింది. కాంగ్రెస్ తీసుకువచ్చిన ఎంజీ నరేగా ప్రధాని మోదీని ఎప్పుడూ కలవరపెడుతూనే ఉంది. కాబట్టి దీనిని బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే దీనిని పూర్తిగా తుడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు" అని రాహుల్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

## గాంధీ పేరును తొలగించాలన్న కుట్ర

### - కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం చారిత్రాత్మకమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. ఇలాంటి పథకానికి పేరు మార్చి వికసిత భారత్ - జీ రామ్ జీగా ప్రస్తుతం నామకరణం చేశారని మంగళవారం న్యూఢిల్లీలో ఆయన విమర్శించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించడం ఆర్ఎస్ఎస్ - బీజేపీ ఆలోచనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని బలపర్చకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ నిప్పులు చెరిగారు. కేంద్ర - రాష్ట్ర నిధుల వాటా 40:60గా మార్చడంతో రాష్ట్రాలపై భారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో నిధులు లేకపోతే పథకం అమలు కష్టమయ్యే పరిస్థితి ఉందన్నారు. 125 రోజులు అంటూనే ఉపాధి హామీని అస్పష్టంగా మార్చారంటూ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకానికి దేవుడి పేరు పెట్టి ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ కేంద్రం తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు.

## జోర్డాన్- భారత్ పాత సంబంధాలను పునరుద్ధరించుకోవాలి

భారత్, జోర్డాన్‌లు కలిసి కీలక పాత్ర పోషించగలవు' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

**జోర్డాన్ యువరాజు బీఎండబ్ల్యూలో ప్రధాని మోదీ**

ప్రధాని నరేంద్ర మోదీ.. కింగ్ అబ్దుల్లా ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన నిమిత్తం జోర్డాన్ రాజధాని అమ్మాన్‌కు మంగళవారం చేరుకున్నారు.ఈ సందర్భంగా జోర్డాన్ యువరాజు, మహమ్మద్ ప్రవక్త ప్రత్యక్ష వారసుడైన అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లా ప్రధాని మోదీకి అరుదైన గౌరవం అందించారు. యువరాజు తన వ్యక్తిగత బ్లాక్ కలర్ బీఎండబ్ల్యూ కారులో ప్రధాని మోదీని స్వయంగా అమ్మాన్‌లోని జోర్డాన్ మ్యూజియంనకు తీసుకెళ్లారు. ఈ ఘటన ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను చాటి చెప్పింది.అమ్మాన్‌లోని రాస్ అల్-ఐన్‌లో ఉన్న జోర్డాన్ మ్యూజియం పురావస్తు, చారిత్రక కళాఖండాలకు నిలయం. 2014లో నెలకొల్పిన ఈ మ్యూజియం జోర్డాన్ ప్రాంత సుదీర్ఘ నాగరిక ప్రయాణాన్ని వివరిస్తుంది. ఇక్కడ 1.5 మిలియన్ సంవత్సరాల నాటి జంతువుల ఎముకలు ఉన్నాయి. అత్యంత పురాతన విగ్రహాలలో ఒకటైన తొమ్మిదివేల ఏళ్లనాటి ఐన్ ఘజల్ సున్నపు ప్లాస్టర్ విగ్రహాలు ఉన్నాయి.ఈ మ్యూజియంను ప్రధాని మోదీ సందర్శించారు.

## నేడు పంచాయతీ తుది తీర్పు

సర్పంచి స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 394 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 3,752 సర్పంచి స్థానాలకు 12,652 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 36,425 వార్డులకుగాను 7,908 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 28,410 వార్డులకు 75,725 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. 11 సర్పంచి స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. రెండు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిలిపివేశారు.

## కాళేశ్వరం నిర్మాణానికి 83 లక్షల కోట్లు అయితే
# లక్ష కోట్ల అవినీతి ఎక్కడ?

- ఇసుక దందా కోసమే కాంగ్రెస్ కాళేశ్వరం రిపేర్ చేయడం లేదు.
- కాంగ్రెస్ నాయకులు హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు.
- బిఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



**మంచిర్యాల ప్రతినిధి డిసెంబర్ 16 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 83 లక్షల కోట్ల రూపాయలు అయితే కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని తప్పుడు ప్రచారం చేశారని, రెండు సంవత్సరాల కాలం లో ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు దెబ్బతిన్న రెండు పిల్లర్స్ ను కూడా రిపేర్ చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బిఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. మంగళవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక రెండు మూడు బ్యారేజీలు కావు అని రెండు పిల్లర్లు కుంగిపోంగనే కాళేశ్వరం కూలేశ్వరం అని ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు రెండు సంవత్సరాల కాలంలో ఎందుకు రిపేర్ చేయలేదని ప్రశ్నించారు. అన్నారం మెడిగడ్డ బ్యారేజీని అనుకొని మంత్రి వివేక్ అలాగే, మరో మంత్రి శ్రీధర్ బాబు ఇసుక దందా కొనసాగిస్తున్నారని లక్షలాది రూపాయల విలువ గల ఇసుకను హైదరాబాదు ప్రాంతాలకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాణహిత చేవెళ్ల నుండి సుందిళ్ల బ్యారేజీలు వాడుకొని ఎల్లంపల్లి ప్రాజెక్టు కు నీరు తీసుకుపోవడానికి సన్నాహాలు చేస్తున్నారని పేర్కొన్నారు . బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ బ్యారేజీ ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు .కృష్ణ నదిలో 95 టీఎంసీల నీటి వాటా ఉంటే దానిని 45 టీఎంసీలకు కుదించి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు గురుదక్షిణ కింద మన సీఎం రేవంత్ రెడ్డి ఇస్తున్నారని ఆరోపించారు .కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 3600 ఎకరాలు ముంపు గురైందని ప్రచారం చేసిన మంత్రి వివేక్ వారికి పరిహారం ఎందుకు చెల్లించడం లేదని అందులోకి నీరు రాకుండా కరకట్ట ఎందుకు నిర్మించలేరని పేర్కొన్నారు.

### వివేక్ హత్య రాజకీయాలు

రాష్ట్రంలో జిల్లాలలో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలలో హత్యా రాజకీయాలను పెంచి పోషిస్తుందని పేర్కొన్నారు.చెన్నూరు నియోజవర్గంలో మంత్రి వివేక్ అత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు . కాంగ్రెస్ పార్టీ చెందిన శెట్టిపల్లి గ్రామ అధ్యక్షుడు తమ పార్టీలోకి రావడం లేదని టిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడిపై హత్యా ప్రయత్నం చేశాడని పేర్కొన్నారు. వివేక్ ఆ ఊరికి వెళ్లి వచ్చిన తర్వాత ఈ ఘటన జరిగిందని దానికి పూర్తి బాధ్యత మంత్రి వివేక్ వహించాలని తెలిపారు. ఇకనైనా హత్యా రాజకీయాలు మానుకోవాలని కోరారు. టిఆర్ఎస్ పార్టీ నాయకుడిపై హత్యా ప్రయత్నం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని పోలీస్ అధికారులను కోరారు లేనిపక్షంలో జైపూర్ ఎసిపి కార్యాలయం ముట్టడి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 3వ దఫా గ్రామపంచాయతీ
# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్ళిన సిబ్బంది
- పోలింగ్ నిర్వహణ కు భారీగా పోలీసు బందోబస్తు




**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 16 ( జనంసాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 3వ దఫా గ్రామపంచాయతీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 108 గ్రామ పంచాయతీలో ఎన్నికలు జరగాల్సి ఉండగా 4 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్, రెబ్బెన, తీర్యా నీ మండలాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు గమనించారు. ఆసిఫాబాద్ మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు, కాగజ్ నగర్ మండలంలో 26, రెబ్బన మండలంలో 24, తి ర్యాని మండలంలో 29 గ్రామ పంచాయతీలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇందు కోసం ఆయా మండల కేంద్రాల్లో గల పంపిణీ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి తీసుకొని ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. పోలీసు బందోబస్తు మధ్య వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలి వెళ్లారు. మొత్తం 104 గ్రామపంచాయతీలో 744 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల సందర్భంగా జిల్లా అధికారులు కలెక్టర్ వెంకటేష్, ఎస్పీ నితికా పంత్, ఆడిసినల్ కలెక్టర్ వెంకటేష్, ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. 17న ఎన్నికలు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయి. అనంతరం మధ్యాహ్నంరెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సాయంత్రానికి ఫలితాలు పూర్తిగా వెల్లడి అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

# ఐడీపీఎల్ భూములపై ప్రభుత్వం విచారణ

**హైదరాబాద్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని ఐడీపీఎల్ భూములపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కూకట్‌పల్లిలోని సర్వే నంబర్ 376లో రూ.4 వేల కోట్ల విలువైన భూములపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. భూ కబ్జాలపై ఇటీవల ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. కవిత భర్త అనిల్‌పై మాధవరం కృష్ణారావు భూకబ్జా ఆరోపణలు చేశారు. ఈ వివాదం సంచలనంగా మారిన నేపథ్యంలోనే ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

# కరీంనగర్ టీఆర్పీలో మహిళల చేరికలు

- టౌన్ అధ్యక్షురాలు లావణ్య ఆధ్వర్యంలో చేరిన మహిళలు
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ మహిళా టౌన్ అధ్యక్షురాలు జింక లావణ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరారు. నూతన సభ్యులకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేసిన అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా నూతన సభ్యులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 96% ఉన్న బీసీ ఎస్సి ఎస్టీ మైనారిటీలు 4% ఉన్న అగ్రవర్ణాల జెండాలు మోసి, వారికి జేజేలు కొట్టి వారి కింద బానిసగా బ్రతికినామని ఇక తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు ఏ రాజకీయ పార్టీ న్యాయం చేయదని హితవు పలికారు. ఈ పార్టీలో మాజీలకు అవకాశం లేదని తాజాలను మాత్రమే చేర్పించుకుంటామని తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్టంలో ఒక కొత్త రాజకీయ నాయకత్వాన్ని సృష్టిస్తామని తెలుపుతూ ఎస్సి, ఎస్టీ బీసీ మైనారిటీలు ముందుకు రావాలని ప్రధానంగా మహిళా సోదరీమణులు భారీగా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. బీసీ రాజ్యాధికారం సాదించుకోవడం టీఆర్పీ పార్టీ తోనే సాధ్యమైతుందని, దానికి గాను మహిళల కృషి చాలా ముఖ్యమని తెలిపారు. మేమెంతో మాకంత అనే నినాదంతో ప్రజా క్షేత్రంలోకి వెళ్లి అగ్రవర్ణాల దోపిడీని అరికట్టాలని అందుకు గాను మీరంతా పార్టీ సైనికులై కష్టపడాలని తెలిపారు. పార్టీలో చేరిన నూతన సభ్యులందరూ పార్టీ బలోపేతానికి ముందు వరుసలో ఉండాలని అఖిల్ పాషా సూచన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, మహిళా టౌన్ ప్రెసిడెంట్ జింక లావణ్య, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.



# మంచి పాలన అందించి పేరు తెచ్చుకోవాలి

- నూతనంగా గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థులను సన్మానించిన ఎమ్మెల్యే రేవూరి

**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** మంగళవారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు సంగెం,గీసుగొండ మరియు పరకాల మండలాలకు చెందిన నూతన సర్పంచ్ లు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ని మరియు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయుభ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ,విజయం సాధించిన కాంగ్రెస్ సర్పంచ్ లు ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాయి అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే ని కలిసిన వారు పరకాల మండలం కామారెడ్డి పల్లి గ్రామ నూతన సర్పంచ్ చిర్ర అనిత రాజయ్య మరియు వార్డు సభ్యులు నియోజకవర్గంలోని పలు గ్రామాల నూతన సర్పంచ్ లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## ఖిలా వరంగల్ రాతికోట మోటు పార్కుపనులకు
# మంత్రి శంకుస్థాపన



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 16 (జనం సాక్షి):** ఖిలా వరంగల్‌లోని రాతి కోట వద్ద మోటు పునరుజ్జీవనం స్పాంజ్ పార్కు పనులకు రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, రెండు కోట్లతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. మంగళవారం రాతికోట మోటు పనులను మంత్రి సురేఖతోపాటు కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన పనులు చేపట్టారు.కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా రూ. 2 కోట్ల నిధులతో కాకతీయుల చారిత్రక వారసత్వ సంపద అయిన ఖిలా వరంగల్‌లోని రాతి కోట వద్ద మోటు (అగర్తల) పునరుజ్జీవనం, స్పాంజ్ పార్కు అభివృద్ధి పనులకు . మంత్రి కొండా సురేఖ తో వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చాహత్ బాజ్ పేయ్, నగర మేయర్ గుండు సుధారాణి, పీవో అజిత్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని వారసత్వ, పర్యావరణ హిత నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. చారిత్రక రాతి కోట చుట్టూ ఉన్న అగర్తలా (మోటు)ను శుభ్రం చేసి, అందులోకి స్వచ్ఛమైన నీరు చేరేలా పునరుద్ధరించుటకు, కోట పరిసరాలలో వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా అత్యాధునిక స్పాంజ్ పార్కు ను ఏర్పాటు చేయుటకు అభివృద్ధి పనులను ప్రారంబించమని అన్నారు. ఖిలా వరంగల్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, నగరంలో పర్యావరణ సమతుల్యతను కాపాడటం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## మూడో విడత గ్రామపంచాయతీ
# ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.
- 45 సర్పంచ్ స్థానాలు, 329 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికల నిర్వహణ.
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.




**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 16(జనంసాక్షి) :** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ సాధారణ గ్రామపంచాయతీ మూడవ విడత ఎన్నికలలో భాగంగా వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మూడు మండలాలలో మొత్తం 46 సర్పంచ్ స్థానాలు, 408 వార్డ్ మెంబర్స్ స్థానాలు అన్న ఉండగా వాటిలో ఒక సర్పంచ్ స్థానం, 78 వార్డు మెంబర్ స్థానాలు ఏకగ్రీవం కావడంతో 45 సర్పంచ్ స్థానాలకు, 329 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంకటాపురం మండలంలో 18 సర్పంచ్ స్థానాలకు, 150 వార్డ్ మెంబర్స్ స్థానాలకు 166, మండల వ్యాప్తంగా 166 పోలింగ్ కేంద్రాలలో 200 పిఓ, 229 ఓపిఓ లతో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నామని, వాజేడు మండలంలో 17 సర్పంచ్ స్థానాలకు, 118 వార్డ్ మెంబర్ స్థానాలకు మండల వ్యాప్తంగా 152 పోలింగ్ కేంద్రాలలో 152 పిఓ, 177 ఓపిఓ లతో ఎన్నికలను నిర్వహిస్తున్నామని, కన్నాయిగూడెం మండలంలో 10 సర్పంచ్ స్థానాలకు, 61 వార్డు మెంబర్స్ స్థానాలకు మండల వ్యాప్తంగా 90 పోలింగ్ కేంద్రాలలో 84 పీవో, 80 ఓపిఓ లతో ఎన్నికలు నిర్వహిస్తున్నామని కన్నాయి గూడెం మండలంలో ఒక వార్డుకు ఎలాంటి నామినేషన్స్ దాఖలాలు కాలేదని ఆయన తెలిపారు. భద్రత, మౌలిక సదుపాయాలు, శాంతియుత వాతావరణం కోసం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం వంటి గంట వరకే జరుగుతుందని కాబట్టి ఓటర్లు నిర్దేశించిన సమయంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

# పచ్చదనంతో ఓటర్లకు స్వాగతం




**చెన్నారావుపేట, డిసెంబర్ 16 (జనం సాక్షి):** మండలంలోని ఉప్పరపల్లి, తిమ్మరాయిని పహాడ్ గ్రామాల్లో హరిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేడు బుధవారం రెండవ సాధారణ మూడవ విడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సత్య శారద హరిత పోలింగ్ కేంద్రాలుగా ప్రకటించారు. అలాగే సెల్ఫీ పాయింట్ లను కూడా ఏర్పాటు చేశారు.ఈ హరిత పోలింగ్ కేంద్రాలు ఓటర్లను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. అంతేకాక పచ్చదనంతో స్వాగతం పలుకుతున్నాయి.

# నిర్దేశించిన గడువులోపు పనులన్నీ పూర్తి చేయాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి -తాడ్వాయి, డిసెంబర్ 16(జనంసాక్షి) :** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ ప్రాంగణ పునరుద్ధరణ అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోపు పనులన్నీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ ప్రాంగణం పునరుద్ధరణ అభివృద్ధి పనులను, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను, రహదారులను, ఫ్లోరింగ్ సుందరీకరణ పనులను, జంపన్న వాగు పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులతో, గుత్తేదారులతో మాట్లాడుతూ డిసెంబర్ 24వ తేదీ లోపు దేవాలయ ప్రాంగణ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. జాతర సమీపిస్తున్న నేపథ్యం లో ముందస్తు మొక్కులు చెల్లించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మహా జాతరకు విచ్చేసే కోట్లాదిమంది భక్తులకు దేవాలయ ప్రాంగణం మహా కళాఖండంగా దర్శనమిస్తుందని ప్రతి భక్తుడికి మధురానుభూతిని కలిగించే విధంగా ఆలయ ప్రాంగణం రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు, తహసిల్దార్ పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 17 డిసెంబర్ 2025

# పెన్షనర్ల వేదన అరణ్య రోదన

మన భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 17వ తేదీని 'జాతీయ పెన్షనర్స్ దినోత్సవం'గా జరుపుకుంటారు. దేశ,రాష్ట్ర నిర్మాణంలో తమ జీవితాంతం శ్రమను, సేవను అర్పించిన రిటైర్డ్ ఉద్యోగుల కృషిని గుర్తించి, వారి సంక్షేమాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఈ దినాన్ని పాటిస్తున్నారు. ఉద్యమాలు చేయలేని, రోడ్లపై నిలబడి పోరాటాలు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న పెన్షనర్ల సమస్యలు పెరిగిపోకుండా తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అయితే నేడు పరిస్థితి ఏమిటి?..1,జనవరి-2004 తర్వాత నియామకైన కేంద్ర ఉద్యోగులు, 1,సెప్టెంబర్-2004 తర్వాత నియామకమైన ఉమ్మడి రాష్ట్ర ఉద్యోగులకు పెన్షన్ వర్తించకుండా పాత పెన్షన్ రద్దు చేసి,నూతన పెన్షన్ పరిధిలోకి తెచ్చారు.దీంతో నియామకైనా ఐఏఎస్ నుండి అటెండర్ వరకు రిటైర్ అయిన తర్వాత వీరికి పెన్షన్ సౌలభ్యం లేదు. మరోవైపు" 2025 ఆర్థిక బిల్లులో" కొత్తగా చట్టం రూపొందించిన చట్టంలో పెన్షనర్లకు పిఆర్సి, డి ఏ ల పెరుగుదల వర్తించదనే దాంతో ఆందోళన చెందుతున్నారు. పెన్షన్ హక్కులను గుర్తుచేస్తూ, పెన్షనర్ల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన పాలకులు..వారు చేసిన సేవలను విస్మరిస్తూ, హక్కులను ఒక్కొక్కటిగా హరిస్తూ అమానవీయంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.



**జాతీయ పెన్షనర్స్ డే – చరిత్ర, ప్రాధాన్యత**

మన దేశంలో 1982 నుంచి డిసెంబర్ 17ను జాతీయ పెన్షనర్స్ డేగా జరుపుకుంటున్నారు. ఆ సంవత్సరంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వై.వి. చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన చారిత్రాత్మక 'డి.ఎస్. నకారా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' తీర్పు,ఈ దినానికి ప్రాణం పోసింది.ఆ తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొన్న అంశాలు ఇవి.. లిపెన్షన్ ఉద్యోగి ప్రాథమిక హక్కు. లిపెన్షన్ గత సేవలకు ఇచ్చే ప్రతిఫలం. లిపెన్షన్ ఎవరి దానధర్మం కాదు.లిపెన్షన్‌ను రద్దు చేసే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదు. లిపెన్షన్ సామాజిక-ఆర్థిక న్యాయం కల్పించే సంక్షేమ చర్య.లిరిటైర్డ్ ఉద్యోగి గౌరవంగా జీవించేందుకు ఇచ్చే జీవన భృతి. "సేవకు ప్రతిఫలంగా ప్రభుత్వం ఇవ్వాల్సిన చట్టబద్ధ భద్రత" అని న్యాయస్థానం చేసిన వ్యాఖ్య చట్టానికి మాత్రమే కాదుపాలకుల మనసుకు కూడా శాసనం కావాలి.కానీ దురదృష్టవశాత్తు, ఈ తీర్పు చెప్పిన సమానత్వం, గౌరవం, హక్కుల పరిరక్షణ అన్నీ నేడు పుస్తకాలకే పరిమితమయ్యాయి.

*పెన్షనర్లు అడుగుతున్నది.. దయ కాదు-దానం కాదు, వారి హక్కు మాత్రమే. జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసిన ఈ పెన్షనర్లు మన పరిపాలనా వ్యవస్థలను నిలబెట్టిన వేర్లు.పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.పెన్షనర్ల గౌరవాన్ని పునరుద్ధరించాలి. నకారా తీర్పు విలువలను అమలు చేయాలి.వృద్ధులు రోడ్ల మీద నిలబడి హక్కులు అడిగే పరిస్థితి వస్తే-అది పాలకుల ఓటమే. పెన్షనర్ల కన్నీళ్లకు ముగింపు పలికే నిర్ణయం ప్రభుత్వ చేతుల్లోనే ఉంది. ఇది పెన్షనర్ల హక్కు-ప్రభుత్వాల బాధ్యత.*

**నేడు పెన్షనర్ల వాస్తవ స్థితి**

మన రాష్ట్రంలో పదవీ విరమణ చేసిన వేలాది మంది పెన్షనర్లు, తమకు చట్టబద్ధంగా రావాల్సిన రిటైర్మెంట్ బకాయిల కోసం ప్రభుత్వ కార్యాలయాల మెట్లు ఎక్కుతూ దిగుతూ కాలం గడుపుతున్నారు.పెన్షనర్స్ డే నాడు పలకాల్సిన గౌరవ గీతం-నేడు ఒక అరణ్య రోదనగా మారిపోయింది.

**రిటైర్మెంట్ బకాయిలనిలిపివేత..**

2024 మార్చి నుంచి పదవీ విరమణ చేసిన 18 వేల మందికి పైగా పెన్షనర్లకు 21 నెలలుగా బకాయిలు నిలిచిపోయాయి. వాటిలో.. గ్రాట్యుటీ, లికమ్యూటేషన్, లిటీఎస్‌జీఎల్ఐ, లిజీపీఎఫ్,లిలీవ్ ఎన్‌క్యాష్‌మెంట్..ఇవి అన్నీ ఉద్యోగి తన జీతం నుంచి నెలనెలా పొదుపుగా పెట్టుకున్న సొమ్మే. ప్రభుత్వం చేయాల్సింది ఒక్కటేతిరిగి ఇవ్వడం.అయినా ఈ హక్కుల విషయంలో ప్రభుత్వ యంత్రాంగం ముఖం చాటేస్తోంది. ఇది పరిపాలనా లోపం కాదుపెన్షనర్‌ను ఒక "సంఖ్య"గా మాత్రమే చూసే మానవీయ వైఫల్యం.పెన్షనర్లుబిభారం కాదు, వ్యవస్థకు పునాది,పెన్షనర్ అనగానే 'భారం' అన్న అపోహ ఇప్పటికీ ఉంది.కానీ వాస్తవం ఏమిటంటే.. పాఠశాలల నుంచి జిల్లా పాలన వరకూ,రెవెన్యూ కార్యాలయాల నుంచి పోలీస్, ఆరోగ్య శాఖల వరకూ,రాష్ట్ర, కేంద్ర పరిపాలన వ్యవస్థలన్నీ దశాబ్దాలపాటు పెన్షనర్ల భుజాల మీదే నడిచాయి.నేడు బకాయిలు రాకపోవడం వల్ల వైద్య ఖర్చులకు సొమ్ము లేక చికిత్స ఆగిపోతోందని సోషల్ మీడియాలో వేడుకున్న కదలిక లేదు.బ్యాంకు ఈఎంఐలు చెల్లించలేక అప్పుల్లో కూరుకు పోతున్నారు. ప్రైవేట్ అప్పుదారుల వేధింపులు, భవిష్యత్తుపై భయం,మనోవేదన, మానసిక క్షోభ ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఇప్పటి వరకు 28 మంది పెన్షనర్లు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం, ఇదేనా సంక్షేమ రాజ్యం?.

**'ఆర్థిక లోటు' – పెన్షనర్లకేనా?**

పాలకులు చెప్పే ఒక్కసమాధానం, "ఆర్థిక లోటు ఉంది."కానీ అదే సమయంలో- సేవ పేరుతో ప్రజా ప్రతినిధులైన వారి వేతనాలు, ప్రత్యేక అలవెన్సులు, విలాస వాహనాలు, ప్రభుత్వ పథకాల ప్రచారానికి కోట్ల ఖర్చులు పాలకుల ప్రతిష్టకు వృథా అయ్యే నిధులు ఇవన్నీ కొనసాగుతూనే ఉంటాయి. కానీ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన పిఆర్సి, డి ఏ/ డి ఆర్ లు, 2024 నుంచి రిటైర్ అయిన పెన్షనర్ల బకాయిలు అనగానే మాత్రం ఆర్థిక లోటు గుర్తుకు వస్తుందా?ఇది ఉద్యోగులు - ప్రజల మధ్య అగాధం సృష్టించడం కాదా? సేవ పేరుతో రాజకీయాల్లోకి వచ్చి ఎన్నో పదవులు నిర్వహించిన నేతలు అనేక పెన్షన్లుతీసుకుంటున్నారు. కానీ జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులు మాత్రం తమ హక్కుల కోసం రోడ్ల మీద నిలబడాల్సి రావడం ఎంతటి దుర్మార్గం!

**ప్రజాస్వామ్యంలో పెన్షనర్ల స్వరం ఎక్కడ?**

పెన్షనర్లు ప్రజాస్వామ్య మార్గాలన్నీ అనుసరించారు. ఎమ్మెల్యేలకు,మంత్రులకు విజ్ఞప్తులు ఎంపీలకు లేఖలతో ప్రభుత్వానికిప్రతినిధ్యాలు చేసినఫలితం-నిశ్శబ్దం.చివరకు ఇందిరా పార్క్ ధర్నాలో వేలాది వృద్ధుల వేదన గాలిలో కలిసిపోయింది.

**'మా బకాయిలు ఇవ్వండి-మమ్మల్ని చంపవద్దు'** అనే నినాదాలు ఈ రాష్ట్ర పాలనకు అద్దం పట్టాయి.ఎంఎల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఈ పరిస్థితిని అమానవీయం అని వ్యాఖ్యానించారు.అయినా ప్రధాన మీడియా ఈ ఉద్యమాన్ని పతాక స్థాయిలో ప్రస్తావించకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది.

**నకారా తీర్పు స్పష్టం చేసింది..**

పెన్షన్ హక్కే సుప్రీంకోర్టు 1982లోనే చెప్పింది- "పెన్షన్ భిక్ష కాదు, హక్కు."21 నెలలుగా రిటైర్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం అత్యున్నత న్యాయస్థాన తీర్పును అవమానించడం కాదా?.

**ఇకైనా ప్రభుత్వం మేల్కొనాలి**

పెన్షనర్లు అడుగుతున్నది.. దయ కాదు-దానం కాదు, వారి హక్కు మాత్రమే. జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసిన ఈ పెన్షనర్లు మన పరిపాలనా వ్యవస్థలను నిలబెట్టిన వేర్లు.పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.పెన్షనర్ల గౌరవాన్ని పునరుద్ధరించాలి. నకారా తీర్పు విలువలను అమలు చేయాలి.వృద్ధులు రోడ్ల మీద నిలబడి హక్కులు అడిగే పరిస్థితి వస్తే-అది పాలకుల ఓటమే. పెన్షనర్ల కన్నీళ్లకు ముగింపు పలికే నిర్ణయం ప్రభుత్వ చేతుల్లోనే ఉంది. ఇది పెన్షనర్ల హక్కు-ప్రభుత్వాల బాధ్యత.



మేకిరి దామోదర్
రచయిత ఎ సామాజిక విశ్లేషకులు
జిల్లా: వరంగల్
ఫోన్: 9573666650.

# పౌర సమాజం మీద రాక్షసంగా ప్రభుత్వాల ధోరణి

భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం. ప్రజలే ప్రభుత్వానికి మూలాధారం. ప్రజల మాట వినడమే ప్రభుత్వ బాధ్యత. కానీ నేటి భారతదేశంలో అక్రమాలు, అన్యాయాలు, దుర్మార్గాలు జరుగుతున్నాయని ప్రశ్నిస్తున్న పౌర సమాజం మీద కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాక్షసంగా ప్రవర్తించడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. దేశంలో అవినీతి, కార్పొరేట్ దోపిడి, ఆదివాసీల భూముల లూటీ, మైనింగ్ పేరుతో పర్యావరణ విధ్వంసం, కుల%-%మత రాజకీయాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలపై పౌర సమాజం గొంతెత్తితే వాటిని ప్రజాస్వామ్య స్వరంగా చూడాల్సిన ప్రభుత్వం, దేశద్రోహం అనే ముద్ర వేసి అణచివేయాలని చూస్తోంది. ప్రశ్నించడం నేరంగా మారుతున్న పరిస్థితి ఏర్పడింది. జర్నలిస్టులు, రచయితలు, విద్యార్థులు, న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు ఎ ఎవరు మాట్లాడినా ఉపా, ఈడి, సీబీఐ, పోలీస్ వంటి సంస్థలను ఆయుధాలుగా మార్చి వేధింపులకు గురిచేస్తున్నారు. జైళ్ళు ప్రశ్నించే గొంతులతో నిండిపోతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే పౌరుడి హక్కు అయితే, నేడు ఆ హక్కునే లాక్కొంటున్నారు. పౌర సమాజం దేశ శత్రువు కాదు. అది దేశానికి కళ్లు, చెవులూ. అన్యాయం జరిగితే చూపించేది పౌర సమాజమే. కానీ ఆ సమాజాన్ని అణచివేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖాళీ కాగితంగా మార్చుతోంది. ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని మాత్రమే మిగిల్చి, ఆలోచనల ప్రజాస్వామ్యాన్ని చంపేస్తోంది. రాష్ట్రాధికారం ఒకప్పుడు ప్రజల సేవ కోసం ఉండేది. ఇప్పుడు ప్రజలను భయపెట్టే రాక్షస రూపం దాల్చింది. చట్టాలు రక్షణ కోసం కాదు, అణచివేత కోసం ఉపయోగించబడుతున్నాయి. మీడియా మౌనంగా మారుతోంది, న్యాయం ఆలస్యం అవుతోంది, నిజం మాట్లాడేవాళ్లు ఒంటరిగా మిగిలిపోతున్నారు.

ఈ పరిస్థితి కొనసాగితే భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా కాకుండా, నియంతృత్వ రాజ్యంగా మారే ప్రమాదం ఉంది. పౌర సమాజాన్ని అణచివేయడం ద్వారా దేశాన్ని రక్షిస్తున్నామని చెప్పడం ఒక పెద్ద మోసం. నిజానికి దేశాన్ని నాశనం చేసే పని ఇదే. కాబట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే పౌర సమాజాన్ని గౌరవించాలి. ప్రశ్నలను అణచివేయకుండా, సమాధానాలు ఇవ్వాలి. భయం మీద కాదు, న్యాయం మీద పాలన సాగాలి. లేకపోతే చరిత్ర కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ రాక్షస ధోరణిని క్షమించదు.

రచయిత
కుద్మేత శ్రీనివాస్
సెల్ నెబీ 9177166152.

## పల్లె ప్రగతికి భవిష్యత్తుకు ఓటెయ్యాలి

తెలంగాణలో 3వదశలో
జరుగనున్న పంచాయతీ
ఎన్నికల పోలింగ్లో ఓటర్లు
పాల్గొనాలి

ఓటర్లు పోలింగ్ బూతుల్లో
ఓట్లతో సందడి చేయాలి
రాబోయే ఐదేళ్ల పల్లె
పాలనను శాసించాలి

నీ చూపుడు వేలు సిరా
చుక్క పల్లె ప్రగతికి
పల్లె ప్రజల తల రాతను
మార్చే చుక్కాని కావాలి
స్థానిక సంస్థల
సాధికారితకు ఓటు
వజ్రాయుధం
ప్రజాస్వామ్య రక్షణకు
దశ దిశ కావాలి

ఒక్క ఓటు అని వదిలేస్తే
భవిష్యత్తు గందరగోళం
నిర్లక్ష్యం నిర్లిప్తత
వీడండి పల్లె
ప్రగతికి పాటు పడే
ఉత్తమ అభ్యర్థులను
సర్పంచిగా ఎన్నుకో
ఒకే ఒక ఓటుతో
ఫలితాలు తారు మారు

పయనించే బస్సు మిస్సైతే
ఆలస్యంగానైనా
ప్రయాణం చేయచ్చు

అదే ఓటు వేయకపోతే
ఐదేళ్లకోసారి జరిగే
ఎన్నికల్లో ఓటు వేసే
అవకాశం కోల్పోయినట్లే
ప్రశ్నించే గొంతుక
మూగ బోయినట్లె
అవినీతి నిరంకుశ
పాలనకు చోటిచ్చినట్లే

ఒక్క ఓటు తేడా
ఎన్నో సంచలనాలను
సృష్టించింది
ప్రభుత్వాలు
కూలిపోయాయిజి
అధికారాలు
దూరమైనాయిజి
చేతికి అందివస్థాయన్న
అవకాశాలు
రాకుండా పోయాయి

ఐదేళ్లకోసారి
వరుసలో నిలబడి
ఐక్యతను చాటాలి
ఓటుతో ప్రగతి
పురోగతికి
పాటుపడాలి
పల్లె అభివృద్ధికి
పాటుపడే సమర్థ
అభ్యర్థిని సర్పంచిగా
ఎన్నుకోవాలి

ఓటే వజ్రాయుధం
ఓటే ప్రజాస్వామ్యానికి
ఇరుసు

గ్రామ పారిశుధ్యం
రోడ్లు రక్షిత నీరు
విద్య వైద్యం
డ్రైనేజ్ హరిత
హారం జలవనరులు
మానవ వనరుల
అభివృద్ధి కొరకు
కార్యాచరణతోజి
ముందుకు వచ్చిన
అభ్యర్థిని సర్పంచిగా
ఎన్నుకోవాలి
పల్లెల ప్రగతికి
ఓటేయ్యాలి

పల్లెలో పేదరికం
నిరుద్యోగం
ద్రవ్యోల్బణం
ఆర్థిక అసమానతలు
ఆర్థిక దోపిడి లింగ వివక్ష
మానవ అక్రమ
రవాణాకు అడ్డుకట్ట
వేసే నాయకులు కావాలి

నేరమయ రాజకీయాలను
ఓటుతో అడ్డుకోవాలి
పోలింగ్ కేంద్రాలకు
ఓటర్లు పోటెత్తాలి

రాజకీయాలు వద్దు
పార్టీల రాద్ధాంతాల
పద్దులు వద్దు
ఓటుతో సుపరిపాలనకు
శ్రీకారం చుట్టాలి
బాపూజీ భావించిన
గ్రామ స్వరాజ్యాన్ని
స్థాపించాలి

అంబేద్కర్ ఆశయాలను
సాకారం చెయ్యాలి
ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం
ప్రజాస్వామ్య స్ఫూర్తిని
ప్రపంచ దేశాలకు చాటుదాం
పల్లె ప్రజల జీవితాల్లో
వెలుగులు తెద్దాం

నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
తెలంగాణ వికాస వేదిక
కరీంనగర్
9440245771

## ఓ కావేరి

నే చేరుకుంటి టిప్పు సుల్తాను నగరి
ఓపుణ్య జలసిరి
నీదరి చేరి
ఆశీర్వచనము కోరి
ఆశయం నెరవేరి
తిలకించితి శ్రీరంగపురి
మునిగి తేలితి సంబరగిరి
ఓ! నారీ అనవరతం బండరాళ్ళతో పోరి
సదా ప్రవహిస్తున్న సుజల విహారి
నమోస్తు పరిపరి..
జననీ నీవేలే నా రహదారీ
కాదు నే సంచారి
నేనొక భయమెరుగని పాదచారి
ఇక నే అన్యుల చెంత చేరి
నిజం గా చేయను అబద్ధాల కచేరి
నీఅడుగుజాడల పయనమే నా బగ్గీ సవారి
ఈ ప్రపంచమొక మాయలమారి
మునకేయ నందులో దూరి
నీపైగల ఆసక్తే జీవన లహరి
ఓ సువిశాల హృదయ మంజరి
విశ్వాసమే ఆనంద పురి
భక్తి సామ్రాజ్య మే ప్రచార సమర భేరి
నిష్ కల్మషయాత్రలో మరచితి చలిగిలి నీలాంభరి
నీ చల్లని చూపులే తొలకరి
అనాదిగా ఇరువురి మధ్య లేదు కిరికిరి
ఓకావేరి ముగిస్తానిక నయ భయముతో కవితాక్షరి

నమిలకొండ నాగేశ్వర్ రావు, మేడ్చల్,

## పెద్దపులి.. చలిపులి

అడవిలో పెద్దపులి విసిరిన పంజాకి
బెంబేలెత్తిన జంతువులు
దెబ్బకి దడదడలాడిపోయాయి

రాష్ట్రంలో చలిపులి విసురుతున్న పంజాకి
రక్తం గడ్డకడుతున్న జీవులు
విలవిలలాడిపోతున్నాయిజి
గజగజ వణికిపోతున్నాయి

కోటం త్రిశూల్
8523005678

## కోటి వసంతాలతో

పరవశించే మనసుకి
వృత్తిలోనే అదృష్టం అందలం
వలయాలెన్నో దాటుకొని
వ్యవస్థ మేలుకోరుకొని
జాములోనే జాగరూకత
పనికై ఆతురత
రమ్మని ఎవరు పిల్చినా
ఆలకించడానికి రెండు చెవులు
ఆదుకోవడానికి రెండు చేతులు సిద్ధం
ఒక్కొక్కరు ఒక్కొక్క విధం
జీవన మనుగడ యుద్ధం
మలినాల్ని పారద్రోలే మహత్తర కార్యాలకి చెమట
ఇంధనం బంధనం
నిజానికి వెన్ను తట్టేవాళ్లు లేకున్నా
ధైర్యం చెప్పేవాళ్లు మౌనం వహించినా చేటంటూ
కూర్చోక లోటంటూ ముద్దుకోక.. పనిలో సేవానిరతి
పనిలో సమాజభక్తి .. చిన్న పనులే కావచ్చు
సూక్ష్మాతి సూక్ష్మ పనులే కావచ్చు
అల్ప ఆలోచనలు కావు
భిన్నమైన జాతులు తెగలు సంస్కృతులు వృత్తినే
నమ్ముకొని
నాయకులారా.. కొంచెం చేతివృత్తుల చెట్లకు
నీళ్ళోయండి
ఊరందరినీ ఉత్తేజ పరుస్తాం
కోటి వసంతాలతో జీవిస్తాం

కోటం చంద్రశేఖర్, 9492043348

## ఓటర్లు నిజాయతీ అవసరం

ఎన్నికల కమిషన్ సూచించన నియమాలు ఒక గ్రామంలో 5 వేల కంటే జనాభా ఉంటే 2.5 లక్షలు 5 వెల కంటే తక్కువ జనాభా ఉంటే 1.5 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి ఎన్నికల ఖర్చుల ను 45 రోజులు లోపు సమర్పిం చా లి.ఈ పరిమితి దాటితే ,నివేదిక సమర్పించు టలో విఫలం అయితే 3 సంత్సరాల వరకు పోటీ చేయడానికి వీలు లేదునేటి ప్రజాస్వామ్య గ్రామీణ వ్యవస్థ పునాది..అధికారిక లెక్కలకు అభ్యర్థులు ఖర్చుకుపొంతన లేదు.ప్రజాస్వామ్యం ధన స్వామ్యం అయింది.దీన్నినిందిచాల్సిం ది నాయకుల్నికాదు ప్రజలే బాద్యులు.పార్టీలకు అతీతంగా,కులాలకు అతీతంగా,నిజాయితీగా పనిచేసే వ్యక్తులను ఎన్నుకోవాలిఅధికారం సేవే అనే బాధ్యత అని గుర్తించాలి.ప్రజాస్వామ్యనికి పూనాది .అందుకే నిజాయితీ గలఓట ర్లు కావాలి,అప్పుడే నిజాయితీ గలప్రతినిధులు ఎన్నిక అవుతారు.యద్భావం తత్భవతే దేనికైనా వర్తిస్తుంది.

ఉమాశేషారావు వైద్య
సీవీక్స్ లెక్చరర్, దోమకొండ

## కాకా అందించిన పెన్షన్ ప్రసాదాన్ని భోజనంగా మార్చాలి

బొగ్గు ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత శేష జీవితం ఆరోగ్యంగా ఆనందంగా గడుపుటకు స్వర్గీయ కాకా వెంకటస్వామి పెట్టిన భిక్ష పెన్షన్ పథకం. కానీ 27 సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు ఈ పథకం సమీక్ష సవరణ జరపకపోవడం వలన ఉద్యోగ విరమణ చేసిన రోజు నిర్ధారించిన పెన్షన్ తో జీవితకాలమంతా గడపవలసి వస్తున్నది దినదినం అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతున్నాయి మరియు వైద్య ఖర్చులు కూడా గగనాన్ని అంటుతున్నాయి. చాలీచాలని అతి తక్కువ పెన్షన్ తో బ్రతకడమే ఒక భారము అవుతున్నది.మీరు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన తర్వాత పెద్దపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేని విధంగా అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నారు అదేవిధంగా పెద్దపల్లి మంచిర్యాల తదితర స్టేషన్లలో ముఖ్యమైన రైళ్లకు హాల్టులు ఏర్పాటు చేయించినారు మీ చిత్తశుద్ధి అంకిటిత భావానికి ఇవి నిదర్శనం. అంతేకాకుండా రామగుండం ప్రాంతంలో విమానాశ్రయానికి నెలకొల్పుటకు నిరంతరం కృషిచేస్తున్నారు నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని వెంటనే వారి ఇళ్ల వద్దకు చేరుకొని కష్టసుఖాలను తెలుసుకుంటున్నారు మరియు ఆదుకుంటున్నారు కూడా ఇదే స్ఫూర్తితో బొగ్గు ఉద్యోగుల పెన్షన్ పెంచుటకు మీరు కృషి చేస్తారని కాకా వెంకటస్వామి వారసునిగా తాత అందించిన ప్రసాదాన్ని కడుపునిండా భోజనంగా విస్తరిస్తారని మిమ్ములను ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను సార్ ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో బొగ్గు పెన్షన్ పెంచుటకు మీరు ప్రభుత్వాన్ని ఒప్పించి ఒక ప్రకటన చేయించుతారని దేశంలోని లక్షల మంది బొగ్గు రిటైర్డ్ ఉద్యోగులు మీపై అత్యంత విశ్వాసం వ్యక్తపరుస్తున్నారు


దండంరాజ రాంచందర్ రావు
అధ్యక్షుడు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కాప్ర
హైదరాబాదు, 9849592958

# వర్తమాన సమాజపు దృశ్యీకరణ

ప్రఖ్యాత కవి షేక్ కరీముల్లా 'అబాబీ'ల ప్రక్రియ ఆవిష్కర్త. ఇప్పుడున్న అనేక తెలుగు సాహిత్య ప్రక్రియలలో ఎక్కువ మంది అబాబీలను రాస్తున్నారు. సామాజిక స్పర్శతో, భిన్న జీవన సందర్భాల విశ్లేషణతో, చైతన్యాన్ని రంగరించి ఆకట్టుకునే అబాబీలను రాస్తూ ఆలోచింపజేస్తున్న కవులు ఎందరో ఉన్నారు. 'అంతర్ముఖం' పేరుతో కవయిత్రి షేక్ నసీమా బేగం ఇటీవల అబాబీల సంపుటిని వెలువరించారు. మానవీయ కేంద్రంగా, సాంస్కృతిక తాత్విక నేపథ్యం, సంవేదనతో భిన్న జీవన పార్శ్వాలను విశ్లేషిస్తూ ఆలోచింపజేసే సందేశాల్ని ఇందులోని 100 అబాబీలు అందించాయి. కవయిత్రి నిశిత పరిశీలనాత్మక దృష్టి, విశ్లేషణాత్మకత అబాబీల అభివ్యక్తిలో చాలా స్పష్టంగా వ్యక్తమైంది. భావావేశంతో పాటు వ్యంగ్యాత్మక చురకలాంటిస్తూనే సందేశాత్మక దిశానిర్దేశం ఈ అబాబీల్లో జరిగింది. 'గజల్' లో 'తఖల్లుస్ ' లా ఐదు పంక్తులుగా సాగే ఈ అబాబీలో నాలుగో పంక్తి కవయిత్రి పేరుతో కనిపించి చివరి పంక్తి సందేశాత్మక మూలమై ముగుస్తుంది.

'ఒక్కసారి మారి చూడు / మనిషిలా బ్రతికి చూడు/ పశ్చాత్తాపం నీరు కార్చినప్పుడు / నసీమా!/ ఉప్పు నీటిలో ఉన్న రుచి చూడు ' అన్న అబాబీ కష్టసుఖాల సమ్మేళనమైన జీవన వాస్తవికతను స్పష్టంగా మనిషికి తెలియజెప్పింది. 'పైపై మాటలు ఇక ఎన్నాళ్లు/ నటనే జీవితమై దారి తప్పనీకు ' అన్న అబాబీ మనుషుల్లోని ద్విముఖ ప్రవర్తనను నిరసించింది. 'గుణపాఠం పొందని జీవితం ఎందుకు' అని ఇంకో అబాబీలో అన్నారు. 'ఒంటరి పోరని భయపడకు, న్యాయదేవతే నీకై కళ్ళు తెరిచింది, కార్యదీక్షతో కరచాలనం చేసి చూడు, రాత్రి గడిచాకే కదా పగలు వెలిగేది, కార్యదీక్షను మించిన క్యాలెండర్ ఎక్కడ' అన్న భరోసానిచ్చే వాక్యాలున్న అబాబీలు ఆలోచింపజేస్తాయి.' ఎక్కడ కనిపియొద్దు ఎక్కడ అవసరానికో భాష ఉంటుంది / నిజం లాగానే కనిపిస్తాయి భ్రమలు' అని హెచ్చరిస్తారు. ' విస్తరించిన ఆధునికత / ఆవులిస్తున్న ఆదర్శాలు / రేపటి పౌరులను రక్షించేదెలా ' అని వేదన చెందారు. కాలాన్ని బంధించలేవన్న విషయాన్ని తెలుసుకోమన్నారు. లభించే ప్రతిక్షణం వరమేనని గ్రహించమని మనిషికి సూచించారు.

'బహిర్ముఖులు/ అంతర్ముఖులు / మనిషి వాక్కురూపాలు / నసీమా!/ దృక్పథాలు మార్చు అనుభవాలు ' అని లోకుల నైజాన్ని కవయిత్రి తేటతెల్లంగా విశ్లేషించారు. 'ప్రమాద ఘంటిక మ్రోగింది / దేశం దేహం ఒక్కటేనని చెప్పు ' అన్నారు. 'మతము లేని ఉన్నా/ మనుషులంతా ఒక్కటే' అన్నారు. ద్వేషమెరుగని దేహంలో ఎదనిండా అమాయకత్వంతో పాటు ఇహలోక చింతన కూడా ఉండదంటూ అలాంటి వారు స్వర్గతుల్యులని చెప్పారు. మూటలో విసిరేయబడిన మూడు మాసాల పసికందు శోకం మిగిల్చిన సామ్రాజ్యానికి ప్రతిబింబమని




అన్నారు. 'ఆక్రందనల లావా పెల్లుబికింది / రాక్షసత్వం రెక్కలు చాచింది అని ఒక అబాబీలో ఆవేదన చెందారు. ఒక్కో బొట్టు రక్తం ప్రాణాన్ని నిలిపే సంజీవని అని చెప్పారు. ఓటమిని అంగీకరించి గెలుపును స్వీకరించమని చెప్పారు. తొందరపడి అంచనాకు రావద్దని ఆ తరువాత హంగులన్నీ తేలిపోతాయని హెచ్చరించారు. 'రివాజులన్నీ గరీబు కొరకే నవాబులు అందరికీ దోస్తులే' సమాజ గమనంలోని అసమానతను ఎత్తిచూపారు. క్వాలిటీ,గ్యారెంటీ, వారంటీల వర్తమాన కాలంలో జీవితం చౌక బారుగా మారిపోయిందని అన్నారు. స్వార్థ ప్రపంచంలో మనిషి కేవలం వాడుక పాత్రగా మాత్రమే మిగిలిపోయాడని చెప్పారు. జారిన కన్నీరు గుండె బరువును దింపిందన్నారు. అర్థమయ్యే వారిని ఆదరించి లోతులు తెలుసుకొని ప్రవర్తించాలని చెప్పారు. ఆత్మశుద్ధి అనివార్యమని తెలిపారు. ఆప్తుల రూపాన మెచ్చుకుంటూనే, గుచ్చేసి గాయపరిచే వారి పట్ల ఎంతో జాగ్రత్త అవసరం అన్నారు.' గెలుపుపై శ్రద్ధ / ప్రగతిపై అశ్రద్ధ పెరిగాయని' చెప్పారు. విలువలు లేని స్నేహోన్మాదంతో జాగ్రత్త అని అన్నారు. నిర్ణయాలలో నాణ్యత పెంచమన్నారు. ఆధారాలను నిరాధారాలుగా మార్చే దుస్థితి సమాజంలో పెరిగిందని తెలిపారు. చిరునవ్వుతో పలకరించి, చిరుగాలిలా ప్రసరించి, ఎదలోతుల్లోకి చేరి వాడని పువ్వై మనిషిని పరిమళించమన్నారు. వేష భాషలే ప్రగతికి మార్గాలా అని ప్రశ్నించారు. 'ఆడపిల్ల ఈడ పిల్ల కాదా' అని పుట్టిల్లు, మెట్టిల్లు కన్నీళ్లను మిగిల్చకూడదని చెప్పారు. ఆకలిదప్పుల హాయిలే పవిత్ర రంజాన్ మెరుపులన్నారు. 'చేతలే రాతగా నీ గీత మార్చుకో' అని సందేశించారు. అ స్పష్ట చిత్రాలకు రూపు ఉండదని చెప్పారు. అజ్ఞాతంలోకి నైతికత వెళ్ళిపోయిందన్నారు. నమ్మకం అమ్మకానికి దొరుకునా అని ప్రశ్నించారు. అంతర్యుద్ధంతో లోపాల్ని జయించమన్నారు. ఆధునికత ముసుగులో సంస్కారం సరిహద్దులు దాటిందని చెప్పారు. పగటి వెలుగుకు ప్రత్యర్థులు ఎవరని చెప్పారు. మంటలు మసినే మిగిల్చుతాయని అన్నారు. స్వీయ శిక్షణ ప్రతి మనిషి లక్ష్యం అవ్వాలని భావించారు. అంతరాత్మపై గెలుపును సాధించమన్నారు. జీవం లేని జీవితం వృథా అని చెప్పారు. సోదర భావంతో దృఢమైన ఐక్యతా పునాదులున్న దేశం మనదని తెలిపారు. అనారోగ్యం వచ్చినప్పుడే ఆయువు విలువ తెలుస్తుందని చెబుతూ ఆరోగ్యాన్ని మించిన ఆస్తి ఉందా అన్నారు. అమానవీయ చర్యలతో నిజాన్ని దారి మళ్ళించవద్దన్నారు. 'రాలిన పువ్వులను అతికించడం సాధ్యమా, నక్కజిత్తులను నమ్మ సాధ్యమా' అని ప్రశ్నించారు. చరిత్ర పుటలు తిప్పి చూస్తే ఎగిరి పాతాళానికి పడిన అధికారమే కనిపిస్తుందన్నారు. ఒకసారి విజ్ఞత వాకిలిని తడుమమని చెప్పారు. కన్నీరు మండే జ్వాల అవుతుందని గ్రహించమన్నారు. 'ఏది నిజం/ మరేదీ అబద్ధం / తుఫాను హెచ్చరిక ఎదలో / నసీమా!/ న్యాయానికి జరగాలి పరామర్శ ' అన్న చివరి వందవ అబాబీలో కూడా తిరోగమన జీవనపు తీరు పట్ల అంతరంగపు అంతర్మ ధనం పెల్లుబికింది. మనుషులు సామాజిక అంతర్భంద చట్రంలో చిక్కి విడదీయలేని సంకెళ్ల మధ్య అంతర్ముఖులై భిన్న ప్రవృత్తులతో బాధల్ని ఈదుతూ సాగిస్తున్న అసమానతల జీవితాల్ని ఈ సంపుటిలోని పలు అబాబీలు ఎంతో లోతుగా విశ్లేషించాయి. అశాశ్వతమైన జీవితంలో శాశ్వత చిరునామాను అందుకొని వికృతమైన బహు రూపాలను వీడి విశాలాలోచనతో సర్వసమ్మతమైన అంతర్ముఖమై మనిషి సదా మెరవాలన్నది ఈ అబాబీల ద్వారా కవయిత్రి ప్రగాఢాకాంక్ష.

('అంతర్ముఖం'- అబాబీలు, రచన: షేక్ నసీమా బేగం, పుటలు: 52, వెల: రూ. 55 /-, ప్రతులకు : చర్చి దగ్గర, ఆనంద్ నగర్, బాపట్ల-522101, సెల్ : 9409440865)

డా.తిరునగరి శ్రీనివాస్
9441464764

# రాష్ట్రపతి పర్యటనకు హకీంపేట ఎయిర్‌పోర్ట్‌లో పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ మను చౌదరి ఆకస్మిక తనిఖీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికై ఈ నెల 17న హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పరిధిలోని హకీంపేట ఎయిర్‌పోర్ట్‌లో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ మను చౌదరి మంగళవారం పరిశీలించారు. రాష్ట్రపతి సాయంత్రం 4.25 గంటలకు ప్రత్యేక విమానంలో హకీంపేటకు చేరుకోనున్న నేపథ్యంలో, భద్రత, సౌకర్యాలు, ఆతిథ్య ఏర్పాట్లు సమర్థంగా ఉండేలా అన్ని శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రపతి పర్యటన అత్యంత ప్రాధాన్యత గలదని, చిన్న లోపం కూడా చోటు చేసుకోకుండా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. హకీంపేట ఎయిర్‌పోర్ట్‌లో నిర్వహణ, సమన్వయ బాధ్యతల కోసం కీసర ఆర్డీఓను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో పర్యటన సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్ట్ పరిసర



ప్రాంతాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ పనులు చేపట్టాలని, రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలో రోడ్లకు ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రపతిని స్వాగతించేందుకు వచ్చే రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులకు తగిన సీటింగ్, ఆతిథ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, అవసరమైన చోట మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అవసరమైన మందులు, అత్యవసర వైద్య కిట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. హకీంపేట నుంచి బొల్లారం వరకు రాష్ట్రపతి ప్రయాణించే రహదారిపై గుంతలు పూడ్చివేయడం, అవసరమైన చోట కొత్తగా రోడ్డు వేయడం ద్వారా ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రోడ్లు-భవనాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అగ్నిమాపక భద్రత చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని ఫైర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, శామీర్‌పేట్ ఎమ్మార్వో సంయుక్త, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉద్యాన శాఖాధికారి శ్రీధర్, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌ను నాలుగు డివిజన్లుగా విభజించాలి




**బోడుప్పల్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జిహెచ్‌ఎంసి వార్డుల విభజనకు సంబంధించి ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, బోడుప్పల్ ప్రాంతాన్ని జిహెచ్‌ఎంసి లో విలీనం చేసి నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ యూత్ జిల్లా నాయకులు ఉప్పరి విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చినింగళ్ళ సంతోష్, చంటి శివ, దానగల లక్ష్మణ్, రామగుల్ల శంకర్ కలిసి బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఔపచారిక వినతిపత్రాన్ని సమర్పించారు. బోడుప్పల్ ప్రాంతం జనాభా పరంగా విస్తృతంగా ఉండటంతో పాటు, అభివృద్ధి అవసరాలు, మౌలిక సదుపాయాల అందుబాటు డిమాండ్ ఎక్కువగా ఉన్నాయని నాయకులు స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు డివిజన్‌తో పాలన సమర్థవంతంగా జరగడం కష్టమని, ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యాలు అందించడానికి నాలుగు డివిజన్ల విభజన అత్యవసరమని వారు పేర్కొన్నారు. అధికారులు ఈ వినతిని సానుకూలంగా పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవాలని నాయకులు కోరారు.

## ప్రతి ఒక్కరూ ఆకుపచ్చ ప్రపంచం కోసం కృషి చేయాలి

- వనజీవి రామయ్య బయోపిక్ డాక్యుమెంటరీ చిత్రం
- వికారాబాద్‌లో షూటింగ్.. పర్యావరణ సేవలకు గౌరవం

**తాండూరు, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** పద్మశ్రీ అవార్డు గ్రహీత, కోటి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ వ్యక్తి వనజీవి రామయ్య జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న బయోపిక్ డాక్యుమెంటరీ చిత్రం షూటింగ్ వికారాబాద్ జిల్లా కేంద్రం అనంతగిరి అటవీ పలు ప్రాంతాల్లో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి చెట్లు నాటడం, ప్రకృతితో అనుబంధంగా జీవించే నిత్య జీవిత విధానాన్ని ప్రతిబింబించే స్కూల్లో సన్నివేశాలను ప్రముఖంగా చిత్రీకరించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా 'పర్యావరణ పరిరక్షణ' ఫిలిం బ్యానర్‌పై ఈ డాక్యుమెంటరీని నిర్మిస్తున్నట్లు నంది అవార్డు గ్రహీత పలు కమర్షియల్ చిత్రాలకు డైరెక్టర్గా చేసిన ప్రముఖ డైరెక్టర్ వేముగంటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సినిమాకు దర్శకుడు నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వం వహిస్తుండగా, వనజీవి రామయ్య పాత్రలో ప్రముఖ సినీ నటుడు బ్రహ్మాజీ డబ్బులు తీసుకోకుండానే



నటిస్తున్నారు. రామయ్య భార్య పాత్రలోఆర్టిస్ట్ నాగరాణి నటిస్తున్నారు. కోట్లాది మొక్కలు నాటి, అటవీ సంరక్షణ, భవిష్యత్ తరాలకు పచ్చని వారసత్వం అందించాలనే సందేశంతో వనజీవి రామయ్య చేసిన సేవలను ఈ డాక్యుమెంటరీ చిత్రం ప్రజలకు చేరువ చేయనుంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేలా ఈ చిత్రం నిలుస్తుదని ఈ చిత్రాన్ని అందరూ ఆదరించి ప్రతి ఒక్కరూ ఆకుపచ్చ ప్రపంచం కోసం కృషి చేయాలన్నారు. వనజీవ రామయ్య జానకమ్మ వేష ధారణ లో స్టూడెంట్స్ నటించారు. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ బల్లె మోహన్, రైటర్ డాక్టర్ కళారంగా, కెమెరామెన్ తోటకె వి రమణ, సహనిర్మాత రవీందర్ నాథ్ టులు..జ్యోగిని శ్యామల ప్రభావతి, సిద్దిపేట తిరుపతి, డా. కళా రంగ, కేవిఎం వెంకట్, పైడిపల్లి, చైతన్య, వేణు గోపాల్, రవీంద్రనాథ్, సింగర్ దివాకర్ తదితరులు నటిస్తున్నారని తెలిపారు.

# గెస్ట్ లెక్చరర్ల నియామకాలలో అవకతవకలు

- నోడల్ అధికారి శంకర్ నాయక్‌పై విచారణ చేపట్టాలి
- తాండూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం
- జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్

**తాండూరు, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకాల ప్రక్రియలో తీవ్రమైన అవకతవకలు, అన్యాయాలు జరుగుతున్నాయని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం తాండూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో బీసీ ప్రతినిధులు, యువ నాయకులతో కలిసి డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మహేష్‌తో పాటు పలువురు గెస్ట్ లెక్చరర్లు గత ఐదు నుండి పది సంవత్సరాలకు పైగా నిరంతరంగా సేవలు అందించినప్పటికీ, తాజా నియామకాలలో ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా ఉద్యోగాల నుంచి తొలగించబడ్డారని తెలిపారు. సీనారిటీ, అనుభవం, అర్హతలను పక్కనపెట్టి పారదర్శకత లేకుండా నియామకాలు జరిగాయని రాజ్ కుమార్ విమర్శించారు, దీని వల్ల గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నియామకాల ప్రక్రియలో జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ పాత్రపై అనుమానాలు ఉన్నాయని ఆయన ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఎంపికలు జరిగాయని ఆరోపించారు, కావున నోడల్ అధికారి శంకర్ నాయక్



పాత్రపై తక్షణమే విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాయంగా తొలగించబడిన అనుభవజ్ఞులైన గెస్ట్ లెక్చరర్లను వెంటనే తిరిగి నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్యదర్శి సయ్యద్ శుకూరు, జిల్లా బీసీ నాయకులు గడ్డం వెంకటేష్, బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి జగదీశ్వరి, బీసీ ప్రతినిధులు కే.ఎన్. రాజు, సి.హెచ్. జోసఫ్, బాబా గౌడ్, బషీరాబాద్ మండల బీసీ సంఘం అధ్యక్షులు నరేందర్, బీసీ యువ నాయకులు టైలర్ రమేష్, యాసర్, అంతరం ప్రవీణ్, రాజు గౌడ్, నాగరాజు, శ్రీనివాస్, రాము, చిన్న నాయీ, రమేష్, వివేక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజాపూర్, నవాబుపేట, మిడ్జిల్ మండలాలకు చెందిన పలువురు నూతనంగా ఎన్నికైన ఇండిపెండెంట్ సర్పంచ్ లు, వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీలోకి చేరగా అనిరుధ్ రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాజాపూర్ మండలంలోని చెన్నవెల్లి, కల్లేపల్లి, నవాబుపేట మండలంలోని లింబ్యా తాండ, కొల్లగుట్ట తాండ, మిడ్జిల్ మండలంలోని వెలుగొమ్ముల గ్రామాల నుంచి చేరికలు జరిగాయి. గ్రామాల సమస్యలను వారు ఎమ్మెల్యేకు వివరించి వాటిని పరిష్కరించడానికి కావాల్సిన నిధులను మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్యేకు విజప్తి చేయడంతో వెంకటేశ్వర తాండ అభివృద్ధికి రూ.25 లక్షలు, కొల్లగుట్ట తాండ అభివృద్ధి కి రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేస్తామని అనిరుధ్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతం పార్టీలో చేరిన వాళ్లే కాకుండా ఇంకా రాజాపూర్, నవాబుపేట, మిడ్జిల్, ఊర్కొండ మండలాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గెలుపొందిన పలువురు సర్పంచ్ లు, వార్డు మెంబర్లు కూడా తమకు టచ్ లో ఉన్నారని, కాంగ్రెస్ పార్టీలోకి ఈ చేరికల పరంపర కొనసాగుతుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కొత్తగా సర్పంచులు గా గెలిచిన వారు కాంగ్రెస్ పార్టీలోకి చేరాలని ఆహ్వానించారు. రాజకీయాల కంటే అభివృద్ధికి తాను ప్రాధాన్యత ఇస్తానని పార్టీలోకి చేరే వారిని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తామని, కాంగ్రెస్ పార్టీలోకి చేరి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**మల్కాజిగిరి, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై పూర్తిస్థాయిలో నేరెడ్ మెట్ సిఐ సందీప్ కుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థులు సోషల్ మీడియా, ఈ-మెయిల్స్, ఓటీపీ షేరింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరగాళ్లు అనుసరించే కొత్త పద్ధతులు, వాటి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి వివరించారు. సైబర్ నేరం జరిగినప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన ఆవశ్యకతను, చట్టపరమైన అంశాలను విద్యార్థులకు తెలిపారు. డిజిటల్ యుగంలో విద్యార్థులు సైబర్ భద్రత పట్ల అవగాహన పెంచుకుని, తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా దీనిపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఫైబర్ నేరాలపై విద్యార్థులు తమ సందేహాలను సిఐ ని అడిగి తెలుసుకున్నారు. ఆయన సవివరంగా



సమాధానాలు ఇస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ బండి రాజు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు సైబర్ భద్రత అత్యంత ముఖ్యమని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించడం ద్వారా యువతను ఆన్‌లైన్ మోసాల నుండి రక్షించవచ్చని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పోలీసు వారి సూచనలను పాటించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## చేవెళ్లలో పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

- మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

**చేవెళ్ల, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** చేవెళ్లలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని భాజపా నాయకులు, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రెండేళ్ల క్రితం 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనం కోసం రూ.17.50 కోట్లు మంజూరైన ఎందుకు పనులు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు కనీసం భూ సేకరణ సైతం చేపట్టలేదని విమర్శించారు 100 పడకల ఆసపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించిన కూడా ఇప్పటికీ ఎమ్మెల్యే ప్రారంభించలేదన్నారు. గతంలో కూడా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించామని, ఆ రోజున చేవెళ్లలో స్థలం చూపించాలని తెలియజేశారు. కానీ ఇప్పటివరకు ఒక సెంటు కూడా పని జరగడం లేదని, అతి త్వరలోనే ఈ 100 పడకల ఆసపత్రిని పూర్తి చేయకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. అప్పటికి కూడా ఎమ్మెల్యే 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించక పోతే చేవెళ్లలో రిలే నిరాహార దీక్ష కాదు, ఆమరణ నిరాహార దీక్ష



చేయడానికి కూడా ముందుంటామని రత్నం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీకాంత్, గుండన్నగారి వెంకట్ రెడ్డి, డా.వైభవ్ రెడ్డి ఆంజనేయులు గౌడ్, దేవుని శర్వలింగం, గోటూరి శంకర్ గౌడ్, ఇంద్రసేనా రెడ్డి, పత్తి సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, పాగా వెంకటేష్, సిరుమని తిరుపతి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అభిశేఖర్ రెడ్డి, రాజు, మహేందర్ రెడ్డి, గణేష్, మిట్టు, శివ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తాం

- తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప




**తాండూరు, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు. బసప్ప పేర్కొన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు. బసప్ప తనయుడు అఖిలేష్ జన్మదినం పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా యాలాల మండలం దౌలాపూర్ గ్రామంలో కోలువుదీరిన రక్త మైసమ్మ దేవాలయంలో తాండూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆలయానికి విరాళంగా రెండు సిమెంట్ బెంచీలు, మూడు వందల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శరణు బసప్ప మాట్లాడుతూ తాం డూర్ లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అదేవిధంగా ప్రతి నెల రెండవ గురువారం, నాలుగవ గురువారం తాండూరు రైన్బో హాస్పిటల్ ద్వారా ఉ చిత కంటి వైద్యశిబిరం నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని తాండూర్ ప్రజలు వినియోగిం చుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు దౌలపూర్ సర్పంచ్ పట్లోళ్ల విజయ నిర్మల శ్రీనివాస్ యాదవ్, తిమ్మాయి పల్లి సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, దుబ్ చర్ల సర్పంచ్ .మల్లా రెడ్డి లను క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో తాండూ ర్ లైన్స్ క్లబ్ కార్యదర్శి మంకల్ నటరాజ్, జిల్లా చైర్మన్ సల్ల దామోదర్, ఉపాధ్యక్షులు వీర ప్రసాద్, మాజీ అధ్యక్షులు గోపాలకృష్ణ యాదవ్, జిల్లా చైర్మన్ వై బసనప్ప, సభ్యులు, దుప్ చర్ల సర్పంచ్ .మల్లా రెడ్డి, సభ్యులు భోజిరెడ్డి ,యాలాల మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అయ్యా గళ్ళ బీమయ్య, దౌలపూర్ సర్పంచ్ పెట్లోళ్ల విజయ నిర్మల శ్రీనివాస్ యాదవ్, తిమ్మాయి పల్లి సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, బోడంపల్లి నర్సిములు, బెల్కటూరు మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్టర్ ఉప్పల్‌లోనే ఉండాలి



**ఉప్పల్, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** ఉప్పల్ సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని బొడుప్పల్‌కి తరలించవద్దు అని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి సచివాలయం లో కలిసి వినతి పత్రం అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి .అలాగే కాప్రా సబ్ రిజిస్టర్ కార్యాలయం నూతన భవనం ఏర్పాటు చేయాలని మంత్రి గారిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్ , బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మంజీరా పరివాహక ప్రాంతంలో ఫిఫ్త్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయాలి

- రైల్వే సదర సమితి అధ్యక్షులు గంగాజోగినాథ్

**జోగిపేట, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** అందోల్ లోని మంజీర పరివాహక ప్రాంతంలో ఫిఫ్త్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయాలని రైల్వే సాధన సమితి చైర్మన్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా జగినాథ్ అన్నారు. మంగళవారం జోగిపేటలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఆల్ పార్టీస్ మీటింగ్ ఏర్పాటు చేశారు ఇందులో ఆయన మాట్లాడుతూ ఎన్ హెచ్ 161 కలుపుతూ మంజీరా పరివాహక ప్రాంతంలో ఉన్న వందలాది ఎకరాల భూమిని దృష్టిలో ఉంచుకొని అక్కడ ఐటిసిటీ కారిడార్లను ఫ్యూచర్ సిటీకి ప్లాన్ చేయాలని ఆయన తెలిపారు. దీనికి అనువైన స్థలం మా ప్రాంతంలో ఉందని హైదరాబాద్కు దగ్గరలో ఉన్నందున ఈ కంపెనీలకు సౌకర్యం సులభం అవుతుందని తెలిపారు. అందులో తొందరలోనే ట్రిబుల్ ఆర్ అవుతున్నందున, ఐటీ ఫ్యూచర్ సిటీకి ఇంకా ఎంతో అనువుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటి కె కేంద్ర మంత్రులైన అమిత్ షా, పీయూష్ గోయల్, అశ్విన్ వైష్ణవ్ , కిషన్ రెడ్డి రఘునందన్



రావు లకు వినతి పత్రాలు అందజేశామన్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి కార్యాలయంలో, మంత్రి శ్రీధర్ బాబు లకు వినతి పత్రాలు అందజేశామన్నారు, దీనివల్ల ఇక్కడి ప్రాంత ప్రజలకు లక్షల మందికి ఉద్యోగ అవకాశా లభిస్తాయి అన్నారు. అలాగే భూములకు విలువ వస్తుందని, ఒక రైతుకు నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలు పోయిన ఇంకా రెండు ఎకరాలు సులభంగా డిమాండ్ పెరుగుతుంది అన్నారు. దీనికి అన్ని పార్టీల నాయకులు మద్దతు పలకాలని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డికి హైదరాబాద్ పరివాహక ఫీచర్ సిటీ లు ఏర్పాటు చేయాలని ఉద్దేశం ఉందని అది మన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆయన ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి (బిఆర్ఎస్) బిఆర్ఎస్ప్రభాకర్ గౌడ్( బిజెపి) మాజీ ఎంపీపీ (రామా గౌడ్) టిఆర్ఎస్ లు మాట్లాడుతు, ఇంత మంచి ఆలోచన కలిగిన విషయాన్ని అన్ని పార్టీలు ఏకీభవించి రాష్ట్ర, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సాధించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఫిఫ్త్ కారిడార్ ఓపెన్ అయితే ఆందోల్ జోగిపేట అభివృద్ధి చెందుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రభాకర్ గౌడ్, ప్రభాస్, వెల్డింగ్ మానయ్య బిఆర్ఎస్ నుంచి బిక్షపతి, పైసల్, శ్రీనివాస్, లు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 17 డిసెంబర్ 2025

# చివరి దశ ఎన్నికలు కూడా సమర్థవంతంగా నిర్వహించాలి

- ఊట్కూరు, మక్తల్ డిస్ట్రిబ్యూషన్ తనిఖీ చేసిన కలెక్టర్



**మక్తల్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** జిల్లాలో తొలి, రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ను విజయవంతంగా ముగించినట్లే చివరి విడత ఎన్నికల పోలింగ్ ను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం మూడో విడత ఎన్నికల పోలింగ్ సందరరేగా పోలింగ్ కు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన ఉట్కూరు, మక్తల్ డిస్ట్రిబ్యూషన్/ రిసెప్షన్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందరరేగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలి, రెండో విడత ఎన్నికల పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగించడంలో అధికారులు, పోలింగ్ సిబ్బంది క ృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. అయితే చివరి దశలో ఎన్నికల పోలింగ్ జరిగే ఊట్కూరు, మక్తల్, మాగనూరు, కృష్ణా, నర్వ మండలాల పరిధిలో ఇటీవల జరిగిన రెండు విడతల పోలింగ్ బూత్‌ల కంటే ఎక్కువ ఉన్నాయని, పోలింగ్ సిబ్బంది కూడా ఎక్కువగానే ఉన్నారని, బుధవారం జరిగే పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. పోలింగ్ సామాగ్రి తీసుకున్న వెంటనే ముందుగా పీవోలు, ఓపివోలుబ్యాలెట్ పత్రాలను సరి చూసుకోవాలని, చెక్ లిస్టులో ఉన్న సామాగ్రి అంతా ఉందో లేదో ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలని సూచించారు. ఇతర జిల్లాలలో బ్యాలెట్ పత్రాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని, మన జిల్లాలో అలాంటి పొరపాటు జరగకుండా సిబ్బంది జాగ్రత్తగా పోటీలో ఉన్న అభ్యర్థులకు సరిపడా గుర్తులు ఉన్నాయా లేదా సరిగ్గా చెక్ చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆమె పరిశీలించి, సామగ్రి పంపిణీ ప్రక్రియ సక్రమంగా సాగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని, ఎన్నికల సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు, డిస్ట్రిబ్యూ షన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయే దారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది అందరూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, విధులకు హాజరై ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేస్తేనే స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికలు సాధ్యమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఫేస్ 1, 2 ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని మూడో విడతల్లో జరిగే ఎన్నికలు కూడా ప్రశాంతంగా జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని క ృష? మాగనూరు మక్తల్ నర్వ ఊట్కూరు మండలాలలో జరిగే సర్పంచు వార్డు మెంబర్లు ఎన్నికకు ప్రణాళిక బద్ధంగా రూట్ మ్యాప్ తయారుచేసినట్లు తెలిపారు. క ృషా?లో 21847 మాగనూరులో 19145 మక్తల్ లో 43,701 నర్వలో 26,175 ఊట్కూరులో 41,780 మొత్తం 1,52,648 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పిఓపిఓ లు 25 86 మంది 32 మంది జోనల్ ఆఫీసర్లు 29 మంది రోడ్డు ఆఫీసర్లు నియమించినట్లు జిల్లాలో 52 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు 1083 పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందని ఆమె వెల్లడించారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన స్థానిక ఎస్సై



**వీపనగండ్ల, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో నేడు జరిగే స్థానిక సర్పంచ్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను స్థానిక ఎస్సై కే రాణి, గోపాల్ పేట్ ఏ.ఎస్ఐ. రమామని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సహనంతో ప్రజలకు ఎలాంటి అనుమానాలు ఉంటే ఓపికతో నివృత్తి చేయాలని సలహా ఇచ్చారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికలలో ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని నియమ నిబంధనలను ఎవరు అతిక్రమించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు నిరీ?త సమయంలో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట లోపు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సలహా ఇచ్చారు.ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రజలు గుర్తింపు పొందిన కార్డులను పోలింగ్ కేంద్రాలకు తీసుకుని రావాలని సలహా ఇచ్చారు. పోలింగ్ కేంద్రాలలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నర్సంగౌడ్, జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** గ్రామపంచాయితీ ఎన్నికలను విజయవంతం చేసేందుకు వివిధ విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ బెటాలియన్‌లో ఉన్న జడ్పీహెచ్ఎస్ ఆవరణలో గ్రామ పంచాయితీ మూడవ విడత ఎన్నికల సందరరేగా ఎర్రవల్లి మండలానికి సంబంధించిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు,ఇతర సిబ్బంది తమకు ఇచ్చే పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్ లో సరిచూసుకోవాలని, ఏమైనా సామాగ్రి లేకుంటే వెంటనే రిటర్నింగ్ అధికారుల ద ృష్టికి తీసుకొస్తే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలోని పోలింగ్ స్టేషన్లకు వెళ్లాక ఇబ్బంది పడకుండా పోలింగ్ నిర్వహణకు అవసరమైన ప్రతి ఒక్క వస్తువును ప్రీసైడింగ్ అధికారులు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. రిజర్వ్ కౌంటర్లో ఎంతమంది అధికారులు రిపోర్టు చేసారో పరిశీలించి,అవసరమైన గ్రామ పంచాయితీలలో వారు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ కౌంటర్లో బ్యాలెట్ పేపర్స్‌తో పాటు పోలింగ్ కు అవసరమైన వివిధ ఫారాలను,కవర్లను, ఇతర సామాగ్రిని పరిశీలించారు. పలు గ్రామ పంచాయతీల ఓటర్ లిస్టును వార్డుల వారీగా పరిశీలించి తగు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిపోర్టింగ్ చేశాక రూట్ వారీగా సంబంధిత గ్రామ పంచాయతీలకు పోలింగ్ మెటీరియల్‌తో వెళ్లేందుకు జోనల్ అధికారులు సహకరిస్తారన్నారు. పోలింగ్ నిర్వహణకు ఇదివరకే శిక్షణ పూర్తి చేసుకున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ అధికారులకు ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోనే సంబంధిత రిటర్నింగ్ అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. ప్రీసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది సాయంత్రంలోగా తమకు కేటాయించిన ఆయా గ్రామ పంచాయతీల పోలింగ్ కేంద్రాలకు చేరుకొని బుధవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలకు వాహనాల్లో తరలి వెళ్లే సమయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి తిరిగి రిసెప్షన్ కేంద్రానికి వచ్చేవరకు అవసరమైన పోలీస్ బందోబస్తు నియమించినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక ద ృష్టి కేంద్రీకరించి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు నుషిత,నరేష్,ఇతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మూడో విడత ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**మక్తల్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా, నిరరేయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పనిచేస్తూ, ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. నారాయణపేట జిల్లాలో మొదటి రెండవ విడతల్లో పోలీసులు బాగా పనిచేశారని అదే ఉత్సాహంతో మూడో విడత కూడా బాగా పని చేయాలని సూచించారు. నారాయణపేట జిల్లాలోని మక్తల్, మాగనూరు, కృష్ణ, ఉట్కూర్, నర్వ మండలాల్లో జరిగే సర్పంచ్ ఎన్నికల విధుల నిమిత్తం మక్తల్ పట్టణ కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో హాజరైన పోలీసులకు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ భద్రతాపరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ విడత ఎన్నికల కోసం 800 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు మండలాలను మొత్తం 29 రూట్లుగా విభజించి భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు 05 స్ట్రైకింగ్ ఫోర్సులు, 05 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు ఏర్పాటు చేసి నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే పోలీసులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని, మొబైల్ రూట్లు, ఆయా పరిధిలోని గ్రామాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలను వివరించి, అల్లర్లకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల రోజు నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ స్టేషన్ల సమీపంలో 163 (బి.ఎన్.ఎస్.ఎస్) యాక్ట్ అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో అనవసర రాకపోకలను అనుమతించరాదన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సెల్ ఫోన్లు, ఇంక్ బాటిల్స్ లేదా ఇతర హానికర వస్తువులు తీసుకురాకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదని ఈ సందరరేగా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హాక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, రఘునాథ్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు తరలిన సామాగ్రి, అధికారులు



**కృష్ణ, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** కృష్ణ మండలంలో బుధవారం జరుగనున్న తుది విడత పంచాయితీ ఎన్నికల పోలింగ్ మండలం ఎన్నికల అధికారులు మంగళవారం అన్ని విధాలుగా ఏర్పాటు చేశారు. .ఉదయం వరకు ఆయా గ్రామాల పంచాయతీలు పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని సిద్ధం చేసి జోన్ అధికారుల ద్వారా గ్రామాల కు బస్సులు ద్వారా తరలించారు మండలంలోని మొత్తం 13 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ సంచిత్ సంగ్వార్, ఎంపిడిఓ విజయలక్ష్మి పర్యవేక్షించారు.

# చివరి దశ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించండి

- అచ్చంపేట ఎన్నికల పంపిణీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ
- సామాగ్రి పంపిణీ, భద్రత ఏర్పాట్ల సమీక్ష
- రవాణా మరియు మైక్రో అబ్జర్వర్లకు సూచనలు
- నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్

**అచ్చంపేట, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని బర్కతుల్ల ఫంక్షన్ హాల్లో మూడోవ విడత ఎన్నికల సిబ్బందికి సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆయన పరిశీలించి, సామగ్రి పంపిణీ ప్రక్రియ సక్రమంగా సాగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని, ఎన్నికల సిబ్బంది లతో మాట్లాడి పలు సూచనలు చేసారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలి పారు. విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు, డిస్ట్రిబ్యూ షన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఏమైనా లోపాలు



కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయే దారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది అందరూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, విధులకు హాజరై ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేస్తేనే స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికలు సాధ్యమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలింగ్ జరిగిన చూడాలి

- పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలింగ్ జరిగే మండలాల్లో,గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బి ఎస్ ఎన్ 163 చట్టం అమల్లో ఉంటుంది జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు.మంగళవారం కొల్చారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ ను గ్రామ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ 161 సర్పంచ్ స్థానాలకు, 1220 వార్డు స్థానాలకు మూడో విడత ఎన్నికలకు ఏర్పాటులు పూర్తి చేయడం. ఈ జరిగిందని, విధులు నిర్వహించే అధికారులు క్రమశిక్షణగా విధులు నిర్వహించడానికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బ్యాలెట్ బాక్సులతో బయలుదేరడం జరిగిందని,పోలింగ్ స్టేషన్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మొదటి రెండో విడత పోలింగ్ నమోదులో మెదక్ జిల్లా 89% నమోదయిందని రాష్ట్రంలో 05 స్థానంలో ఉన్నదన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుని ఓటింగ్ శాతం నమోదులో మన జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు..గ్రామ పంచాయితీ ఎన్నికలను విజయవంతం చేసేందుకు విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది తమకు ఇచ్చే పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్ లో సరిచూసుకోవాలని, ఏమైనా సామాగ్రి లేకుంటే వెంటనే రిటర్నింగ్ అధికారుల ద ృష్టికి తీసుకొస్తే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలోని పోలింగ్ స్టేషన్లకు వెళ్లాక ఇబ్బంది పడకుండా పోలింగ్ నిర్వహణకు అవసరమైన ప్రతి ఒక్క వస్తువును ప్రీసైడింగ్ అధికారులు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికలు జరుగు ఆయా మండలాలగ్రామపంచాయతీలలో 163 బి ఎన్ ఎస్ చట్టం పగడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సైలెన్స్ పీరియడ్ అమలులోకి వస్తుందని తెలిపారు.పోలింగ్ ముగిసే వరకు ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఏ విధమైన ప్రచారాలు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు. సైలెన్స్ పీరియడ్‌లో ప్రజలు గుంపులుగా చేరరాదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు మరియు పోలింగ్ సమయంలో యంత్రాంగం పటిష‘ పర్యవేక్షణ చేపట్టాలని, ఎలాంటి ఎన్నికల ఉల్లంఘనలు జరుగకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని, ఏదేని ఉల్లంఘన జరిగినట్లు గమనిస్తే ఎన్నికల సంగం ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోబడునని అన్నారు. 15 సాయంత్రం ఐదు గంటల నుండి 163 బి. ఎన్.ఎస్ చట్టం 18 వ తారీకు ఉదయం 10 గంటల వరకు ఉంటుందని తెలిపారు.జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల సంగం మార్గదర్శకాలు పాటించాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం తహసిల్దార్ శ్రీనివాస్ చారి, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, ఎన్నికల ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ గంగ్వార్



**మాగనూర్ డిసెంబర్ 16 (జనం సాక్షి) :** మండలంలో బుధవారం జరిగే పంచాయితీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలనీ జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు.మండల కేంద్రంలో నీప్రభుత్వ జూనియర్ కళాశా ల మైదానంలో మంగళవారం గ్రామపంచాయతీ ఎన్నికల సందరరేగా పిఒఎమ్‌పిఓ, ఆర్ఓలకు ఆర్డిఓ రాంచందర్ ఎన్నికల సామాగ్రి అందజేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి, రెండవ విడత పోలింగ్ .విజయవంతంగా జరిగిందన్నారు.అలాగే మూడో విడత పోలింగ్ ప్రశాంతంగా దిగ్విజయం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల అధికారి శ్రీనివాస్. ఎమ్మార్వో సురేష్ కుమార్ ఎన్నికల అధికారి రామ్మోహన్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# మూడో విడతకు సర్వం సిద్ధం



- పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది..
- పోలింగ్ సామాగ్రి పంపిణీ ఏర్పడిన పరిశీలించిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 16 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో మూడో విడత ఎన్నికలు బుధవారం జరుగుతుండగా ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని సెయింట్ థెరీసా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి మూడో విడత ఎన్నికలలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రక్రియ కొనసాగుతుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల విధులకు కేటాయించబడిన పిఓ, ఓపిఓల రిపోర్టింగ్ కౌంటర్ ను కలెక్టర్ సందర్శించి అప్పటివరకు ఎంతమంది రిపోర్ట్ చేశారని అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రంలో ఆయా పోలింగ్ కేంద్రాల ఎన్నికల అధికారులను తీసుకున్న పోలింగ్ మెటీరియల్ ను పరిశీలించారా అని రిటర్నింగ్, పోలింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు కేటాయించబడినట్లు మొబైల్ ఫోన్ కు వచ్చిన సందేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటుచేసిన వాహన సదుపాయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ మెటీరియల్, పోలింగ్, కౌంటింగ్ అంశాల గురించి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కాగా హనుమకొండ జిల్లాలో మూడో విడత ఎన్నికలు ఆత్మకూర్, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా సర్పంచ్, వార్డు స్థానాలకు బుధవారం ఉదయం ఏడు నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. మంగళవారం పోలింగ్ సామాగ్రి పంపిణీ కోసం ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల నుండి ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. ఎన్నికల పోలింగ్ ను పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ డిస్ట్రి బ్యూషన్ కేంద్రం వద్ద ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తహసీ ల్దార్ జగన్మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# కుష్ఠ వ్యాధిగ్రస్తులను గుర్తిదాం

- డాక్టర్ గుగులోతు రవి



**మరిపెడ డిసెంబర్ 16 (జనంసాక్షి) :** మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మరిపెడ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి కుష్ఠ వ్యాధి పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం జాతీయ కుష్ఠ నిర్మూలన కార్యక్రమం లో భాగంగా కుష్ఠ వ్యాధిగ్రాస్తుల గుర్తింపు ఉద్యమం డిసెంబర్ 18 నుండి డిసెంబర్ 31 వరకు ప్రతి ఆశ మరియు ఏఎన్ఎంలు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు ప్రతి రోజు రెండు లెప్రసీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని డాక్టర్ రవి ఆశాలకు, ఏఎన్ఎంలు శిక్షణ కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించడం జరిగింది. డాక్టర్ రవి మాట్లాడుతూ కుష్ఠ వ్యాధి మైక్రో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వలన వచ్చే అతి సామాన్యమైన వ్యాధి. కుష్ఠ వ్యాధి ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుంది. కుష్ఠ వ్యాధి మచ్చలు సహజ చర్మపు రంగు కంటే తక్కువ లేదా ఎరుపు లేదా రాగి రంగు కలిగి ఉంటాయి. మచ్చలపై స్పర్శ ఉండదు. నొప్పి ఉండదు. దేహంలో ఏ ప్రదేశంలోనైనా రావచ్చుననీ. కుష్ఠ వ్యాధి చాలా నెమ్మదిగా పెరిగి, వ్యాధి లక్షణాలు బహిర్గతం కావటానికి సగటున 3 సంవత్సరాల నుండి 5 సంవత్సరాల వరకు పడుతుంది. కుష్ఠ వ్యాధి ఎవరికైనా రావచ్చుననీ. దీనికి వయస్సు లింగ బేధం లేదనీ కుష్ఠ వ్యాధి వంశ పారంపర్యం కాదనీ, శాపం -పాపం అంతకన్నా కాదనీ. కుష్ఠ వ్యాధి యండిటితో 6 నెలల నుండి 12 నెలల్లో పూర్తిగా నయం అవుతుందని వివరించడం జరిగింది. ప్రారంభందశలో గుర్తించి యం డి టి చికిత్స ఇచ్చినచో కుష్ఠ వ్యాధి అంగవైకల్యానికి దారితీయదనీ. కుష్ఠ వ్యాధి చికిత్స అన్ని ఆరోగ్య కేంద్రములలో ఉచితముగా లభించుననీ అన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ కిరణ్ సాగర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కమల సూపెర్వైసోర్ సుదర్శన్, ఆచార్యులు, లక్ష్మి, పల్లె దవాఖాన సిబ్బంది సతీష్, సరిత, ఝాన్సీ, ఉపేంద్ర, అనిత, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు

# వైద్యుల నిర్లక్ష్యం.. పాప మృతి

- ఆసుపత్రి ముందు నిరసన




**మంచిర్యాల డిసెంబర్ 16 (జనంసాక్షి) :** ఎన్నో ఆశలతో గర్భిణి ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరితే ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం మూలంగా ఆపరేషన్ చేయడంలో ఆలస్యం చేయడంతో నవజాత శిశువు మృతి చెందడంతో బంధువులు ఆస్పత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీలత మెటర్నిటీ ఆసుపత్రిలో గర్భిణికి ఆపరేషన్ చేయడంలో ఆలస్యం కావడంతో నవజాత శిశువు మృతి చెందింది. కాగజ్ నగర్ కు చెందిన కుమ్మరి పద్మను డెలివరీ కోసం శ్రీలత ఆసుపత్రిలో మధ్యాహ్నం చేర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం ఆస్పత్రిలో చేర్పించడంతో అన్ని రకాల పరీక్షలు చేసి పాప ఆరోగ్యంగా ఉందని తెలిపారు. రాత్రి ఆపరేషన్ థియేటర్ కి తీసుకెళ్లిన వైద్యులు 2గంటల అయిన తీయేటర్ కు రాకపోవడం ఆస్పత్రికి సిబ్బంది ప్రశ్నించగా డాక్టర్ బిడ్డకు హార్ట్ బీట్ లేదని చెప్పడంతో పాప చనిపోయింది అన్ని చెప్పారు. ఆపరేషన్ చేయడంలో వైద్యులు ఆలస్యం చేయడంతో పాప చనిపోయింది అని ఆస్పత్రి ముందు కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఎన్నికల ఫలితాలు సంతృప్తినిచ్చాయి

- ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 16 (జనం సాక్షి) :** సిర్పూర్ నియోజకవర్గం లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలు సంతృప్తిని కలిగించాయని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు అన్నారు. మంగళవారం సిర్పూర్ టి మండల కేంద్రం, దహగం మండల కేంద్రాల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థులు, ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో అభివృద్ధి కోసం కృషి చేయాలని గెలుపొందిన పాలకవర్గాలకు ఎమ్మెల్యే సూచించారు. గెలిచిన అహంతో పోకుండా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కోసం ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని పోవాలని సూచించారు. కొన్ని జి పిల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోవడం కొంతవరకు బాధను కలిగించినట్లు తెలిపారు. ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుంటామని అన్నారు. ముఖ్యంగా సిర్పూర్ టి మేజర్ గ్రామ పంచాయతీలో బిజెపి బలపరిచిన అభ్యర్థి గెలుపొందడం కొండంత బలాన్ని ఇచ్చింద న్నారు. దహేగాం, పెంచికల్పేట్ మండల కేంద్రాల్లో గల గ్రామపంచాయతీలు బిజెపి కైవసం చేసుకోవడం పట్ల ఎమ్మెల్యే ఆనంద వ్యక్తం చేశారు.

# అర్హులకు త్వరలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

- రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ తూర్పు లో రూ.4 కోట్ల 10 లక్షల తో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు...
- త్వరలో నిరుపేదలకు 2200 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ ...



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** అర్హులైన వారికి త్వరలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి కొండా సురేఖ స్పష్టం చేశారు. మంగళ వారం వరంగల్ (తూర్పు) నియోజక వర్గ పరిధి లోని 32,41 డివిజన్ లలో రూ.4 కోట్ల 10 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న సి సి రోడ్లు డ్రైన్ లు సైడ్ వాల్ లు బాక్స్ డ్రైన్ ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ నియోజక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని గతంలో తాను శాసన సభ్యురాలుగా ఉన్నపుడు వేసిన రోడ్లు అని ప్రస్తుతం దెబ్బతిని పనికి రాకుండా పోయిన నేపథ్యంలో మేయర్, కమిషనర్ స్థానిక కార్పొరేటర్లు స్థానిక నాయకుల సహకారంతో ఏక్కడ ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి వారి అవసరం మేరకు అంచనాలు తయారు చేసి వరంగల్ తూర్పు నియోజక వర్గం లో ప్రతి డివిజన్ లలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని, హౌసింగ్ కు సంబంధించి అన్ని డివిజన్ లలో అర్హులైన వారికి ఎల్ 1 కింద ఇప్పటికే ఇండ్లు కేటాయించడం జరిగిందని, కొంతమంది ఇండ్లు రాలేదు అని అడుగుతున్నారని, రీ వెరిఫికేషన్ కింద మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని వారిని కోరడం జరిగిందని అన్నారు. స్థలాలు ఉండి ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లను మంజూరు చేయడం, తమ వద్ద పెండింగ్ లో ఉన్నాయని అలాంటి వారికి సహకారం అందిస్తామని, స్థలం లేని వారికి రెండు పడక గదుల గృహాలు కేటాయిస్తామని ఇందుకోసం డబుల్ బెడ్రూం గైడ్ లైన్స్ సిద్ధం చేస్తున్నామని దాని ప్రకారం 2200 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వరంగల్ తూర్పు నియోజక వర్గం లో అందుబాటు లో ఉన్నాయని ల్, త్వరలో ఇళ్లను కేటాయిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి వరంగల్ నగరాన్ని రెండవ రాజధానిగా అభివృద్ధి చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నారని, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యు జీ డి), వరంగల్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయం (ఐడిఓసి) ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించనున్నామని తెలిపారు. పెండింగ్ లో ఉన్న అన్ని పనులను మంజూరు చేయించుకుని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరుగుతుందని అన్నారు. రూ. 200 కోట్లతో నియోజక వర్గానికి రెసిడెన్షియల్ స్కూల్ ను కేటాయించారని, నియోజకవర్గంలో స్థల లభ్యత లేకపోవడం వల్ల వర్ధన్నపేట నియోజకవర్గ పరిధి లో గల స్థలాని ఎన్ ఓ సి ద్వారా తీసుకోవడానికి కలెక్టర్ క్లియరెన్స్ ఇచ్చారని ఆది టెండర్ దశలో ఉందని దానిని కూడా ముఖ్యమంత్రి చేతులతో పునాది రాయి వేసేలా చూస్తామని అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన విధానం నిరుపేదల సంక్షేమమేనని , విద్యను ప్రామాణికంగా తీసుకొని ముందుకెళ్లడమే కాకుండా క్రీడలను కూడా ప్రోత్సహిస్తూ అన్ని రంగాలలో ముందుకెళ్లడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 2025 ను నిర్వహించి 2047 సం.వరకు మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధన లక్ష్యంగా ముందుకు దూసుకెళ్తున్న తరుణంలో ప్రపంచ దేశాలన్నీ తెలంగాణ రాష్ట్రం వైపు చూస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యం లో 41 వ డివిజన్ పరిధి లోని నాగమయ్య గుడి ప్రాంతం లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లును మంత్రి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. వివిధ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం సందర్భం గా శివ నగర్, వాటర్ ట్యాంక్ ప్రాంతంలో నిర్మిస్తున్న డక్ట్ డ్రైన్ పనుల స్థితి గతుల క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మంత్రి పనుల పురోగతిని మేయర్ కమిషనర్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఎవరు తీసిన గోతిలో వాళ్లే పడతారు

- మంత్రి కొండ సురేఖ

**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** పదిమంది గ్రూపులు పెట్టుకుని సంతోషపడుతున్నారని ఎవరు తీసిన గోతిలో వాళ్లే పడతారని పరోక్షంగా ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యను ఉద్దేశించి అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం మంత్రి సురేఖ వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. తాను గ్రూపులు కట్టిన వారిపై అధిష్టానానికి ఫిర్యాదు చేయనన్నారు. బలవంతులమైన మమ్మల్ని వాళ్లు ఏమి చేయలేరని అన్నారు. తాను ఎక్కడ ఉన్నా కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య
- నారగోని స్వప్న మురళి ఇంట్లో తేనీటి విందు



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** మొదటినుండి కాంగ్రెస్ పార్టీని వదలకుండా ఎన్ని కష్టనష్టాలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నటువంటి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీమంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య అన్నారు. మంగళవారం అండర్ రైల్వే గేట్ లోని శంభునిపేట విశ్వనాథ కాలనీలో సిటీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళి గృహంలో తేనీటి విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ నిరంతరం పార్టీకి సేవలందించిన వారికి సరైన గుర్తింపు వచ్చేలా వారికి కావలసిన పదవులను దక్కేల చేస్తానన్నారు. అందరం కలిసి మెలిసి ఉండాలని కోరారు. కార్యకర్తలు నాయకులకు పార్టీ పరంగా గౌరవ మర్యాదలు దక్కే విధంగా తాను పాటుపడతానని ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, బసవరాజ్ శ్రీమాన్, నల్లగొండ రమేష్, రాజనాల శ్రీహరి, పరమేష్, బసవరాజ్ కుమార్, తత్తరి లక్ష్మణ్, ప్రభాకర్, జీవన్ కిషోర్ గౌడ్, జన్ను రవి, గోరంటల రాజు, మంద సన్నీ, ఎండి సజిద్, దాసి రాందేవ్, గజ్జల లింగమూర్తి, పద్మ, ఎండి అఫ్జల్, ఆరిఫ్, బషీర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రం తనిఖీ

- జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డి.ప్రశాంత్ కుమార్



**ములుగు ప్రతినిధి, డిసెంబర్ (జనంసాక్షి) :** కన్నాయిగూడెం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలురు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డి ప్రశాంత్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బందికి అవసరమైన బ్యాలెట్ పేపర్లు, ఓటరు జాబితాలు, సీల్స్, పోలింగ్ సామగ్రి తదితర మెటీరియల్‌ను క్రమబద్ధంగా పంపిణీ జరగాలని, మెటీరియల్ తో కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని జరుగనున్న పోలింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఓటు హక్కు వినియోగం రహస్య పద్ధతిలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన మెటీరియల్‌ను పూర్తిగా పరిశీలించుకొని, ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తతతో పాటు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, ఎంపిడిఓ, పోలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుంభకోణం, అక్రమాలపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 16 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా ది కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ కల్పలత సూపర్ బజార్ కార్యాలయాన్ని మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మొదటగా ఎమ్మెల్యే వెళ్లిన వెంటనే కార్యాలయంలో సిబ్బంది లేకపోవడం వల్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రిజిష్టర్ లో 7 గురు సిబ్బంది ఉన్నప్పటికీ కేవలం ముగ్గురు మాత్రమే హాజరవడం అందులో ఇద్దరు మాత్రమే విధులలో ఉండటం పై ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే రికార్డులు, రిజిస్టర్, జమ, ఖర్చు తాలూకా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా రోజులుగా కల్పలత సూపర్ బజార్ లో అవకతవకలు జరిగాయని నా దృష్టికి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి రంగంలో అవినీతి జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇక్కడ జరిగిన కుంభకోణంపై వెంటనే విచారణ చేపట్టాలని సంబధిత అధికారులకు కోరడం జరిగిందని అన్నారు. సొసైటీలో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని, తప్పు చేసిన వారిని వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

# 3వ విడత పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో జరగనున్న 3వ విడత ఎన్నికల కొరకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండు విడతల ఎన్నికలను అధికారుల సమన్వయంతో జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందని, ఈ క్రమంలో 3వ విడత ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, ఫలితాల వెల్లడి అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 3వ విడత ఎన్నికలలో భాగంగా జిల్లాలోని చెన్నూర్, మందమర్రి, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. ఇందులో 102 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను 390 నామినేషన్లు వచ్చాయని, 4 స్థానాలు ఏకగ్రీవం కాగా 98 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. 868 వార్డు సభ్యుల స్థానాలకు గాను 1 వేయి 905 నామినేషన్లు వచ్చాయని, 4 స్థానాలలో నామినేషన్లు రాకపోవడం / సరైన నామినేషన్లు సమర్పించకపోవడం మినహాయించి 153 స్థానాలు ఏకగ్రీవం కాగా 711 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఎన్నికలలో 52 వేల 810 మంది పురుషులు, 54 వేల 75 మంది మహిళలు, 4 మంది ఇతరులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా, నిస్పక్షపాతంగా వినియోగించుకోవాలని తెలిపారు.

# ప్రాణం కాపాడిన నిర్మల్ బ్లూ కోల్ట్ పోలీస్

**నిర్మల్ బ్యూరో, డిసెంబర్16 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రాయపూర్-కాండ్లీ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు గ్రామస్తుల నుంచి సమాచారం అందగానే నిర్మల్ పోలీస్ అప్రమత్తమయ్యారు. వెంటనే విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని, వేగంగా చర్యలు చేపట్టి ఆ వ్యక్తిని సురక్షితంగా రక్షించారు. అనంతరం పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల స్పందిస్తూ, బ్లూ కోల్ట్ సిబ్బంది చూపిన అప్రమత్తత, మానవత్వాన్ని అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజల భద్రతే లక్ష్యంగా అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.

## వార్డు మెంబర్లుగా భార్యాభర్తలు



**నల్లబెల్లి, డిసెంబర్ 16 (జనం సాక్షి):** స్థానిక సంస్థ ఎన్నికల్లో మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన భార్యాభర్తలు సూరబోయిన మమత రాంబాబులు వార్డు సభ్యులుగా గెలుపొందారు. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులుగా 3వ వార్డులో భార్య మమత పోటీ చేసి గెలుపు పొందగా, 9వ వార్డులో భర్త రాంబాబు పోటీ చేసే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పై విజయాన్ని సాధించారు. రెండు వార్డులను భార్యాభర్తలు గెలుచుకోవడంతో భర్త రాంబాబు ఉప సర్పంచ్ పదవిని దక్కించుకున్నాడు.

# ఫేక్ వాట్సాప్ మెసేజ్‌ను నమ్మి మోసపోకండి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 16(జనంసాక్షి) :** వాట్సాప్ లో జిల్లా కలెక్టర్ ఫోటోను ఉపయోగించి డబ్బులు పంపాలని కోరుతూ నకిలీ సందేశాలు పంపిస్తున్న ఘటనలపై అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన ఫోటోను ప్రొఫైల్‌గా పెట్టుకొని కొందరు దుండగులు వివిధ అధికారులకు, వ్యక్తులకు వాట్సాప్ సందేశాలు పంపి డబ్బులు పంపించాలని అడుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని, ఎలాంటి లావాదేవీలు చేయవద్దని అధికారులకు, ప్రజలకు సూచించారు. జిల్లా కలెక్టర్ పేరు, ఫోటో లేదా హోదాను ఉపయోగించి వచ్చే సందేశాలు నకిలీవని, తన తరఫున వ్యక్తిగతంగా గానీ, వాట్సాప్ ద్వారా గానీ డబ్బులు అడగబోనని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి నకిలీ మెసేజీలు అందిన వెంటనే సంబంధిత వాట్సాప్ నంబర్లను బ్లాక్ చేయాలని, సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
17 డిసెంబర్ 2025

# ఎన్నికల సిబ్బంది పారదర్శకంగా బాధ్యతతో విధులు నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**హుజూర్‌నగర్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఎన్నికలపై నమ్మకం ఉందని ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఎన్నికల సిబ్బంది పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. డిసెంబర్ 17 న నిర్వహించే మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మంగళవారం గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు, మఠంపల్లి, హుజూర్ నగర్ మండలాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుజూర్ నగర్ డివిజన్ పరిధిలోని హుజూర్ నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల పరిధిలోని 146 గ్రామపంచాయతీ సర్పంచ్ లకు,1318 వార్డు సభ్యులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవ్వగా 22 సర్పంచులు, 257 వార్డు సభ్యులు ఏకగ్రీవం అవ్వడంతో డిసెంబర్ 17 తేదీన 124 గ్రామపంచాయతీలకు, 1061 వార్డు సభ్యులకు, 1176 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు నిర్వహించడం



జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు పోలింగ్ సామాగ్రి అంతా తీసుకున్నారో లేరో మరోసారి పరిశీలించుకోవాలని, కొన్నిచోట్ల సర్పంచులు ఏకగ్రీవమైన చోట వార్డులకు ఎన్నిక జరుగుతుందని, వార్డు సభ్యులు ఏకగ్రీవమైన చోట సర్పంచుకు ఎన్నిక ఉంటుంది. బ్యాలెట్ పేపర్లు తీసుకునే విషయంలో ఆర్వో అలాగే ఎన్నికల సిబ్బంది చాలా జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. పోలీస్ కేంద్రాలకు చేరుకున్న తర్వాత అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శి అలాగే ఎంపీడీవోకి సమాచారం అందిస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థుల పేర్లకు ఎదురుగా వారి యొక్క గుర్తులు జాగ్రత్తగా అతికించి పోలింగ్ కేంద్రం ముందు ప్రదర్శించాలని సూచించారు. పోలింగ్ ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని ఒకవేళ మధ్యాహ్నం 1:00 గంట కన్నా ముందే ఏదైనా ఒక పోలింగ్ కేంద్రంలో 100% పోలింగ్ నమోదైనప్పటికీ మధ్యాహ్నం 1:00 గంట వరకు పోలింగ్ బ్యాలెట్ బాక్స్ సీల్ చేయరాదని, ఫారంలు నింపరాదని ఒకవేళ ముందే పూర్తి అయిందని బ్యాలెట్ బాక్స్ సీల్ చేసి, ఫారంలు నింపితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. మధ్యాహ్నం 1:00 గంట తర్వాత పోలింగ్ కేంద్ర ప్రాంగణంలో ఎవరైనా ఓటర్లు ఉంటే వారికి చివరి నుండి వరుస క్రమంలో టోకెన్లు జారీ చేసి అందరు ఓటేసిన తర్వాతే పోలింగ్ ముగింపు చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవోలు సరోజ, సోమ సుందర్ రెడ్డి, లక్ష్మి, జగదీశ్, సుమంత్, తహసిల్దారులు స్రవంతి, సైదులు, కమలాకర్, మంగా, కవిత ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రథమ కర్తవ్యం



**తాండూరు, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుతామని దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు పేర్కొన్నారు. మంగళవారం యాలాల మండలం దేవనూర్ దుబ్బల తాండ మధ్యలో విద్యుత్ టన్స్ఫార్మర్ రోడ్డుకు ఆనుకొని ఉంది. రోడ్డుకు వారధిగా ఉండడంతో రాకపోగలకు ఇబ్బంది కలుగుతుందని ట్రాన్స్ఫార్మ్ ను అక్కడి నుండి తొలగించి రోడ్డుకు దూరంగా ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చోరవ చూపుతామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి వస్తే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకుడు కింగ్ కిరణ్, ఉప సర్పంచ్ మల్లేశం మాజీ ఎంపిటిసి మంత్రి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## శాంతి భద్రతల కోసం కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు

- **ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**
- **ఎస్పీ శరత్ చంద్ర పవర్**
- **ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి**



**దేవరకొండ, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మంగళవారం తాటికోల్ గ్రామంలో కేంద్ర,పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నిబంధన ప్రతి ఒక్కరు పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పి కోరారు.

# గ్రామస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తల పోరాటం అద్భుతం

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**మధిర, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే 85 శాతం స్థానాలు గెలుచుకుని కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని,ఇందిరమ్మ ప్రజా పాలనలో చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున దీవించి కాంగ్రెస్ నేతలను పెద్ద ఎత్తున గెలిపిస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.మంగళవారం ఆయన మధిర నియోజకవర్గ కేంద్రంలో తాజాగా గెలిచిన సర్పంచుల అభినందన సభలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున స్థానాలు గెలుచుకొని విజయ దుందిబించి మోగించి చరిత్ర సృష్టించారని,పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా అత్యంత ప్రజాసామిక పద్ధతిలో జరుగుతున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు.ఫలితాలు హర్షించదగిన రీతిలో వెల్లడి అయ్యాయని డిప్యూటీ సీఎం అన్నారు.ఎవరు సర్పంచులుగా గెలిచిన ప్రభుత్వం తరపున న్యాయం చేస్తాం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు సమానంగా అభివృద్ధి చేస్తాం అని డిప్యూటీ సీఎం అన్నారు.ఈ విజయ దుందుభిలో కాంగ్రెస్ కార్యకర్తల కృషి పోరాటం అద్భుతమైనదని అన్నారు.మొదటి విడతలో చేపట్టిన నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇల్లు, ప్రతి ఇంటికి ఐదు లక్షలు ఖర్చు చేస్తున్న తీరు,రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వారి పక్షాన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 8,600 కోట్లు ఆర్టీసీకి చెల్లించిందని డిప్యూటీ సీఎం వివరించారు.రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలు ఉండగా అందులో 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఇందుకు గాను ప్రభుత్వం 13,500 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 85శాతం మంది 20 యూనిట్ల కింద ఉచిత విద్యుత్ కింద ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇంటింటికి వెళ్లి చీరలు పంపిణీ చేస్తున్నామని వివరించారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నాం అన్నారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు.దేశంలోనే అతి ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించిందని అభివృద్ధి చెందిన గుజరాత్ లాంటి రాష్ట్రాలు కూడా తెలంగాణ లతో పోటీపడే పరిస్థితి లేదని డిప్యూటీ సీఎం అన్నారు. ఎక్కడ నదులకు ఆనకట్టలు కట్టాలి,ఏ ప్రాంతంలో రోడ్లు వేయాలి ఏ ప్రాంతంలో బుల్లెట్ ట్రైన్లు నడపాలి పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఫార్మా, ఐటీ పార్కులు ఎక్కడ నెలకొల్పాలు అనేది విజన్ డాక్యుమెంట్ 2047లో



వివరించామని డిప్యూటీ సీఎం తెలిపారు. 2017 కల్లా త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీని సాధించబోతున్నాం అందులో భాగంగా 1.39 లక్షల మెగావాట్ల విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం,ఎలా అందించబోతున్నామో ఈజన్ డాక్యుమెంట్లో వివరించామని డిప్యూటీ సీఎం తెలిపారు. విజన్ డాక్యుమెంట్ విడుదల చేసిన గంటల వ్యవధిలోనే 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి,భవిష్యత్తులో రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలి రానున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు.

# మూడో విడత పల్లె పోరుకు సర్వం సిద్ధం

**దేవరకొండ, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పోలింగ్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె దేవరకొండ లో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్బంగా ఏర్పాటు చేసిన డిఆర్సి కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని,పోలింగ్ సిబ్బంది సకాలంలో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను చేరుకొని అవసరమైన ఏర్పాట్లు ముందే చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు.ఎన్నికలలో తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, ముఖ్యంగా పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ కంపార్ట్మెంట్ కిటికీలకు దూరంగా ఏర్పాటు చేయాలని,



అలాగే సరైన విధంగా వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లో ముగ్గురు కంటే మించి ఓటర్లు ఉండకూడదని తెలిపారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు తప్పనిసరిగా ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని, లెక్కింపు పూర్తయిన తర్వాత ఎన్నికల ఫలితాలను వెంటనే ప్రకటించాలన్నారు. పోలైన బ్యాలెట్ల తో పాటు, పోల్ కానీ బ్యాలెట్లు సైతం పూర్తిగా కాపాడే బాధ్యత స్టేజ్-2 ఆర్ఓలపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె టెండర్ ఓట్ల ప్రాముఖ్యతను, టెండర్ ఓట్ల ప్రక్రియ విధానాన్ని తెలియజేశారు. పోలింగ్ కేంద్రం లే-అవుట్ పరిశీలించిన తర్వాత అతిపెద్ద రెండవ గదిని కౌంటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లకు కౌంటింగ్ టేబుల్ కి మధ్యలో బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కాగా మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు 269 పోలింగ్ కేంద్రాలలో 2206 వార్డులలో జరగనున్నాయి. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా కౌంటింగ్ పూర్తిచేయాలని, కౌంటింగ్ లో జాప్యం జరిగితే చీకటి పడి తప్పులు జరిగేందుకు ఆస్కారం ఉందని,అందువల్ల కౌంటింగ్ కు సాధ్యమైనన్ని ఎక్కువ టేబుళ్లు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రహరీ లేకుంటే తాత్కాలిక కంచె వేసుకోవాలని, సాధ్యమైనంత త్వరగా ఎన్నికలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ పోలింగ్, కౌంటింగ్ లపై సూచనలు చేశారు. దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డిపిఓ వెంకయ్య, జెడ్పిసిఈఓ శ్రీనివాస రావు, ఇతర అధికారులు ఉన్నారు.ఈ సందర్బంగా ఆమె పోలింగ్ సిబ్బంది దగ్గరకు వెళ్లి వారితో మాట్లాడడమే కాకుండా బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేయించారు.అంతకు ముందు ఆర్‌డిఓ కార్యాలయంలో 17న జరగనున్న 3 వ విడత ఎన్నికలకు ఆయా మండలాలకు కేటాయించే జిల్లా అధికారులు, ప్రత్యేకధికారుల, ఎంపిఓల నియామకంపై చర్చించారు.

## ప్రజాక్షేత్రంలో గెలుపు ఓటములు సహజం

**తాండూరు, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** ప్రజాక్షేత్రం లో గెలుపు ఓటములు సహజమని ఎవరుకూడా అధైర్య పడవద్దు అండగా ఉంటామని కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్. నారాయన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నలుగురు వార్డ్ మెంబర్లకు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ మొదటి విడత జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా నిలబడి దురదృష్ట వాషృత్తు ఓటమి కావడం జరిగింది. కావున కష్టం పడిన ప్రతి కార్యకర్తకు నాయకులకు సీనియర్ నాయకులకు ప్రతి ఒక్కరికి పేరు పేరు నా యొక్క కృతజ్ఞతలు తెలిపారు. ఓటమిపాలైనం దుకు ఎవరు కూడా బాధపడవద్దని ప్రతి ఒక్కరికి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు నేను అండగా ఉంటానని తెలిపారు. మున్ముందు రాబోయే ఎలక్షన్లలో మనం కచ్చితంగా గెలవబోతామని దానికి తగిన విధంగా ప్రతి ఒక్కరు కష్టపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీలో గెలుపొందిన నూతన నలుగురు వార్డు మెంబర్లు, టి నర్సిములు, ఎం చంద్రయ్య, సి రత్నయ్య, సి. అనంత, మాజీ సర్పంచులు మాజీ ఉప సర్పంచులు మాజీ వార్డ్ మెంబర్లు గ్రామ పెద్దలు రాధాకృష్ణారెడ్డి, రాములు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఎండి మైపూస్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం



**కొండమల్లేపల్లి, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను చిత్తశుద్ధితో పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి పోలింగ్ సిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి కొండమల్లేపల్లిలో ఏర్పాటుచేసిన మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల డిఆర్సి సెంటర్ ను సందర్శించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఆర్ఓలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని పోలింగ్ కేంద్రాలను ముందే చూసుకోవాలని పోలింగేంద్రంలో సరైన విధంగా లైటింగ్ ఉండేలా చూడాలని ఓటింగ్ కంపార్ట్మెంట్ కిటికీల దగ్గర ఏర్పాటు చేయవద్దని చెప్పారు. ముగ్గురికి మించి ఓటర్లు పోలింగ్ బూతులో ఉండరాదన్నారు. కౌంటింగ్ కు సంబంధించి సూచనలు చేస్తూ ఎట్టి పరిస్థితుల్లో మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కావాలని ఇందుకుగాను కౌంటింగ్ ఏర్పాట్లు ముందే చూసుకోవాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండస్ ఆర్డిఓ రమణారెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, కొండమల్లేపల్లి ప్రత్యేక అధికారి విజయేందర్ రెడ్డి, డిపిఓ వెంకయ్య, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తహసీల్దార్ నరేందర్, ఎంపిడిఓ స్వర్ణలత, పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

# ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
- **నేడు మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు**

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఎన్నికలపై నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఎన్నికల సిబ్బంది పారదర్శకంగా నిష్పక్షపాతంగా బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.జిల్లాలో నేడు నిర్వహించే మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మంగళవారం గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి, హుజూర్ నగర్ మండలాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. హుజూర్ నగర్, మఠంపల్లి,మేళ్లచెరువు, చింతలపాలెం, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల పరిధిలోని 146 గ్రామపంచాయతీ సర్పంచ్ లకు,1318 వార్డు సభ్యులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవ్వగా 22 సర్పంచులు ,257 వార్డు సభ్యులు ఏకగ్రీవం అవ్వడంతో నేడు 124 గ్రామపంచాయతీలకు, 1061 వార్డు సభ్యుల స్థానాలకు 1176 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పోలింగ్ కేంద్రాలకు



వెళ్లేటప్పుడు పోలింగ్ సామాగ్రి అంతా తీసుకున్నారో లేరో మరోసారి పరిశీలించుకోవాలని, కొన్ని చోట్ల సర్పంచులు ఏకగ్రీవమైన చోట వార్డులకు ఎన్నిక జరుగుతుందని, వార్డు సభ్యులు ఏకగ్రీవమైన చోట సర్పంచుకు ఎన్నిక ఉంటుందని అన్నారు.కాబట్టి బ్యాలెట్ పేపర్లు తీసుకునే విషయంలో ఆర్వో, ఎన్నికల సిబ్బంది చాలా జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు.పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తర్వాత అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శి,ఎంపీడీవోకి సమాచారం అందిస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.పోటీ చేసే అభ్యర్థుల పేర్లకు ఎదురుగా వారి యొక్క గుర్తులు జాగ్రత్తగా అతికించి, పోలింగ్ కేంద్రం ముందు ప్రదర్శించాలని సూచించారు.పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించడం జరుగుతుందని, ఒకవేళ మధ్యాహ్నం ఒంటి గంట కన్నా ముందే ఏదైనా ఒక పోలింగ్ కేంద్రంలో 100 శాతం పోలింగ్ నమోదైనప్పటికీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ బ్యాలెట్ బాక్స్ సీల్ చేయరాదని, ఫారంలు నింపరాదని, ఒకవేళ ముందే పూర్తి అయిందని, బ్యాలెట్ బాక్స్ సీల్ చేసి, ఫారంలు నింపితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికలు నిర్వహించే గ్రామాలలో శాంతి భద్రతల విషయంలో,పోలింగ్ విషయంలో ఏమైనా గందరగోళ పరిస్థితి ఏర్పడినా, అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే పై అధికారులు తెలియజేయాలని సూచించారు.ప్రతి ఒక్కరు ఓటు వేయటం బాధ్యతగా భావించి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు.పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఫలితాలు వెల్లడించిన తర్వాత ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బాణా సంచాలు కాల్చటం లాంటివి చేయకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసే విధంగా అభ్యర్థులు, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు సరోజ,సోమ సుందర్ రెడ్డి,లక్ష్మి, జగదీశ్, సుమంత్, తహశీల్దారులు స్రవంతి,సైదులు,కమలాకర్, మంగా,కవిత, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

**నేరేడుచర్ల, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ ఆదేశించారు. మండలంలో నేడు జరగబోయే మూడో విడత ఎన్నికల పోలింగ్ కేంద్రాలను అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. నేరేడుచర్ల మండలంలో ఎన్నికల సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు.మండలంలో 19 గ్రామ పంచాయతీలు గాను అందులో మూడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడం జరిగింది. 16 గ్రామపంచాయతీలో మొత్తం 20550 ఓటర్లు ఉన్నారు. వీరులో పురుషులు 9942, మహిళలు 10 608 మంది ఓటు హక్కును వినియోగించుకొనున్నారు. మండలంలో మొత్తం ఐదు రూట్లను విభజించారు. 168 వార్డుల్లో 49 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 119 వార్డులతో పాటు 16 గ్రామా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం కోసం 151 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.151 మంది పోలింగ్ ఆఫీసర్లు,186 మంది అసిస్టెంట్ పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సైదులు, ఎంపీడీవో సోమ సుందర్ రెడ్డి,ఎన్నికల అధికారులు ఉన్నారు.






# ఐఐటీ చదివి.. మీషో

## బిలినీయర్ జాబితాలోకి విదిత్ ఆత్రే

ఈ-కామర్స్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న మీషో లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విదిత్ ఆత్రే(34) నికర విలువ మంగళవారం ఒక బిలియన్ డాలర్ మార్కును అధిగమించి..బిలియనీర్ల క్లబ్‌లో చేరారు. మీషో షేర్లు ఒక్కసారిగా 13% పెరగడంతో అతని నికర విలువ రూ.9,142.87 కోట్లకు చేరుకుంది. ఐఐటీ ఢిల్లీలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి ఐటీసీ, ఇన్‌మోబీ వంటి దిగ్గజ సంస్థల్లో పనిచేసిన విదిత్ ఆత్రే.. మీషోకు సారథ్యం వహిస్తూ భారతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు



స్ఫూర్తినిస్తున్నారు. 1991లో జన్మించిన విదిత్ ఆత్రే ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో 2012లో బీటెక్ పూర్తి చేశారు. భార తదేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీ ఢిల్లీలో చదవడం ఆయనకు బలమైన సాంకేతిక పునాదిని అందించింది. గ్రాడ్యుయేషన్ తరువాత ఆత్రే తన కెరీర్‌ను ఐటీసీ లిమిటెడ్‌లో ప్రారంభించారు. ఆయన జూన్ 2012 నుంచి మే 2014 వరకు చెన్నైలో ఫ్యాక్టరీ కార్యకలాపాల్లో పనిచేశారు.

**మీషో స్థాపన:**

వృత్తిపరమైన అనుభవాన్ని మూటగట్టుకున్న తర్వాత ఆత్రే పారిశ్రామికవేత్తగా మారాలని నిర్ణయించుకున్నారు. జూన్ 2015 నుంచి ఆయన మీషో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నాయకత్వం వహిస్తున్నారు. మీషోను స్థాపించడంలో, దానిని విజయవంతమైన ప్లాట్‌ఫామ్‌గా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తన దూరదృష్టితో భారతదేశంలోని టైర్-2, టైర్-3 నగరాల వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని, ముఖ్యంగా జీరో-కమీషన్ మోడల్‌తో విక్రేతలకు, చిరు వ్యాపారులకు ఈ-కామర్స్ వేదికను అందుబాటులోకి తెచ్చారు. తన నాయకత్వంలో మీషో వేగంగా ఎదిగింది. దీని ఫలితంగా ఆత్రే ఫోర్బ్స్ 30 అండర్ 30 ఫార్చ్యూన్ 40 అండర్ 40 (2021) వంటి ప్రతిష్టాత్మక యువ నాయకత్వ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారు. మీషో డిసెంబర్ 10న స్టాక్ మార్కెట్లో అరంగేట్రం చేసి తన ఇష్యూ ధరకు ప్రీమియం వద్ద లిస్ట్ అయింది. లిస్టింగ్ రోజున రూ.111 ఐపీఓ ధర కంటే 53% ఎక్కువగా ముగించింది. మంగళవారం, స్టాక్ అసాధారణ ర్యాలీని కొనసాగించి ఇంట్రాడే గరిష్ట స్థాయి రూ.193.50 కి చేరుకుంది.

**విదిత్ ఆత్రే నికర విలువ**

మీషోలో విదిత్ ఆత్రేకు 11.1 శాతం వాటా ఉంది. షేరు ధర రూ.193.50 ఇంట్రాడే గరిష్టానికి చేరుకోవడంతో ఆయన వాటా విలువ రూ.9,142.87 కోట్లుగా ఉంది. అంటే సుమారు 1.005 బిలియన్ డాలర్లుగా ఉంది.

# మేరా భారత్ మహాన్..

## ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్..



**భారతదేశం ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం అందరికీ గర్వకారణం. కేవలం 15 ఏళ్లలో భారతదేశం ప్రపంచం లోని తొమ్మిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి ఐదో స్థానానికి ఎగబా కింది. సేవల రంగంలో గణనీయమైన వృద్ధి, మౌలిక సదుపాయాల వ్యయం పెరగడం, జీఎస్టీ, డిజిటలైజేషన్, పీఎల్ఐ పథకం.. వంటి కీలకమైన సంస్కరణలు ఈ వృద్ధికి దోహద పడ్డాయి. దాంతోపాటు బలమైన స్థూల ఆర్థిక స్థిరత్వం, అధిక మూలధన వ్యయం ఇందుకు ఎంతో తోడ్పడ్డా యి. అయితే భారత్ దశాబ్ద కాలంలో ఏమేరకు వృద్ధి చెందిందో అదే రీతిలో ప్రజల ఆదాయాలు పెరిగాయా అంటే లేదనే చెప్పాలి. ఏయే విభాగాల్లో పెట్టుబడులు ఆదాయాలు ఎంతమేరకు వృద్ధి చెందాయో కింద చూద్దాం.**

భారతదేశ వృద్ధి పథంలో భాగంగా ఉద్యోగ కల్పన దశాబ్ద కాలంలో మెరుగ్గానే ఉంది. గడిచిన పదేళ్లలో దాదాపు 17 కోట్ల ఉద్యోగాలు కొత్తగా వచ్చాయి. 2004-2014 కాలంతో పోలిస్తే ఉద్యోగ కల్పనలో తయారీ రంగం వాటా మెరుగుపడగా సర్వీసులు, నిర్మాణ రంగాల్లో అధిక కొలువులొచ్చాయి. అయినప్పటికీ జీవన నాణ్యత సంక్లిష్టంగా ఉంది. వైట్-కాలర్ ఉద్యోగాలో (ప్రొఫెషనల్ ఉద్యోగాలు) వేతన పెరుగుదల జీడీపీ విస్తరణ కంటే తక్కువగా ఉంది. కొత్తగా ఉద్యోగ మార్కెట్లో ప్రవేశించిన వారిలో ఎక్కువ భాగం అనధికా రిక లేదా గిగ్ వర్క్‌లో చేరుతున్నారు. భారతదేశం ఏటా వృద్ధి నమోదు చేస్తున్నట్లుగా ఉద్యోగులు వేతనాలు, వారి ఆదాయాలు వృద్ధి చెందడం లేదు.

**పెట్టుబడిదారులకు లాభాలు**

భారతదేశ వృద్ధి దశలో ఇటీవలి కాలంలో ఈక్విటీ ఇన్వెస్టర్లు లబ్ధిదారులుగా ఉన్నారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్స్ (సిప్) ఇన్వెస్టర్ల పొదుపును అమాంతం పెంచేశాయి. సెప్టెంబర్ 2025 నాటికి వివిధ ఈక్విటీల్లో సిప్‌ల కింద ఉన్న ఆస్తులు సుమారు రూ.15.5 లక్షల కోట్లకు చేరుకున్నాయి. 10 కోట్లకు పైగా సిప్ ఖాతాల ద్వారా ప్రస్తుతం నెలకు సుమారు రూ.20,000 కోట్లకు పైగా నిధులను ఈక్విటీ మార్కెట్లలోకి మళ్లిస్తున్నారు.గత ఐదేళ్లలో నిఫ్టీ 50, నిఫ్టీ 500 సుమారు 170-200 శాతం రాబడిని అందించాయి. మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ సూచీలు 300-380 శాతం వరకు పెరిగాయి. 2010 ప్రారంభంలో సిప్‌లను ప్రారంభించిన పెట్టుబడిదారుల పోర్ట్‌ఫోలియోలు రెట్టింపు అయ్యాయి. ఇది ఆర్థికంగా చాలా కుటుంబాలకు సాధికారత కల్పించింది.


**రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్లు**

నగరాల్లోని చాలా మంది పొదుపుదారులకు స్టాక్ మార్కెట్‌లోని రాబడులు తమ జీతం పెరుగుదలను అధిగమించాయి.ప్రధానంగా ఎస్ఐపీ ద్వారా సృష్టించిన సంపద వార్షిక వేతన పెంపు కంటే ఎక్కువగా ఉంది. దీనికి విరుద్ధంగా సాంప్రదాయ ఆస్తుల్లో పెట్టుబడి పెట్టినవారికి ఎక్కువగా రాబడులు లేవు. పెద్దగా ఆదరణలేని ప్రదేశాల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్లు, బ్యాంకు డిపాజిట్లు వంటి వాటిలో ఆశించిన రాబడి రాలేదు. ఆహారం, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి నిత్యావసరాల్లో ద్రవ్యోల్బణం పెరిగింది. భారతదేశం ఆర్థికంగా వేగంగా దూసుకుపోతోంది. అధిక జీడీపీ ర్యాంక్, మెరుగైన మూలధన మార్కెట్లు, బలమైన డిజిటల్ ఆర్థిక మౌలిక సదుపాయాలు దీనికి నిదర్శనం. అయితే, 'మీరు ధనవంతులా?' అనే ప్రశ్నకు సమాధానం అసమానంగా ఉంటుంది. స్థిరమైన సిప్ పెట్టుబడిదారులు, ఐటీ, ఫైనాన్స్, న్యూఏజ్(కొత్తగా, వేగంగా విస్తరిస్తున్న రంగాలు) సర్వీసులు వంటి అధిక వృద్ధి రంగాల్లో నిపుణుల నికర విలువలో అభివృద్ధి కనిపిస్తోంది. అయితే స్థిరమైన వేతనం లేనివారు, ఈక్విటీలో పెట్టుబడులు లేని సాధారణ జీతం పొందే సిబ్బంది ఈక్విటీలో పెట్టుబడులు లేని సాధారణ జీతం పొందే సిబ్బందిఈ సంపద సృష్టి నుంచి దూరంగా ఉన్నారు. భారతదేశం ప్రపంచంలోనే మెరుగైన ఆర్థిక దేశాల్లో ఐదో స్థానానికి ఎగబాకడం సంతోషకరమైన అంశమే. అయితే ఇందులో అందరికీ భాగస్వామ్యం ఉండాలి. దేశ వృద్ధికి అనుగుణంగా అన్ని రంగాల్లోని ప్రజల ఆదాయాలు వృద్ధి చెందాల్సి ఉంటుంది. ఈ ప్రయోజనాలు అందరికీ అందేలా ప్రభుత్వం, వ్యవస్థలు చర్యలు తీసుకోవాలి. ఈక్విటీ మార్కెట్ విజయాన్ని 'ఇండియా గ్రోత్ స్టోరీ'గా మార్చాలంటే, వేతన వృద్ధి, ఉద్యోగ నాణ్యతను మెరుగుపరచడం తదుపరి ఆర్థిక సంస్కరణల ప్రధాన లక్ష్యం కావాలి.

# బేర్‌మన్న మార్కెట్లు

**ముంబై:**మంగళవారం కూడా నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 533.50 పాయింట్లు లేదా 0.63 శాతం నష్టంతో 84,679.86 వద్ద, నిఫ్టీ 167.20 పాయింట్లు లేదా 0.64 శాతం నష్టంతో 25,860.10 వద్ద నిలిచాయి. అసహి సాంగ్వాన్ కలర్స్, అమైన్స్ అండ్ ప్లాస్టిసైజర్స్, అగ్రి టెక్ ఇండియా, ఈప్యాక్ డ్యూరబుల్స్, న్యూ ఢిల్లీ టెలివిజన్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. సలోనా కాట్స్పిన్, ఆర్వీ లాబొరేటరీస్, విపుల్ లిమిటెడ్, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎల్జీ రబ్బరు వంటి సంస్థలు నష్టాల జాబితాలో నిలిచాయి.






### ఏటీఎం నుంచి పీఎఫ్ విత్‌డ్రా..

# కొత్త డెడ్‌లైన్

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ చందాదారులు తమ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌ను ఏటీఎం ద్వారా, యూపీఐ ద్వారా విత్‌డ్రా చేసుకోవడానికి ఉపయోగపడే ఫీచర్ తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ అంశంపై కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవీయా స్పందించారు. 2026 మార్చిలోపు ఏటీఎం ద్వారా, యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వస్తుందని మన్సుఖ్ మాండవీయా పేర్కొన్నారు. మీరు ఇప్పటికే 75 శాతం పీఎఫ్‌ను విత్‌డ్రా చేసుకోవచ్చు. దీనిని మరింత సరళతరం చేయడంలో భాగంగానే ఏటీఎం విత్‌డ్రా ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుత ఈపీఎఫ్ ఉపసంహరణ విధానాన్ని కూడా మాండవియా హైలైట్ చేశారు. ఉద్యోగులు తమ ప్రావిడెంట్ ఫండ్‌ను ఉపసంహరించుకోవడానికి అనేక ఫామ్‌లను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇది చాలా మంది సభ్యులకు ఇబ్బందిగా మారుతుం దని, ఇటువంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని మంత్రిత్వ శాఖ ఈపీఎఫ్ ఉపసంహరణలను సులభతరం చేస్తోందని మంత్రి అన్నారు.అక్టోబర్ 2025లో, ప్రావిడెంట్ ఫండ్ కార్యకలాపాలను సులభతరం చేయడానికి, వేగవంతం చేయడానికి ఈపీఎఫ్ఓ ప్రధాన సంస్కరణలను ఆమోదించింది.

# అపరకుబేరుడిగా..




## మరింత పెరిగిన మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లలకు చేరిక..

**న్యూయార్క్:**టెస్లా అధినేత.. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 600 బిలియన్ డాలర్ల (రూ. 54.56 లక్షల కోట్లు) నికర విలువ కలిగిన మొదటి వ్యక్తిగా రికార్డ్ క్రియేట్ చేశారు. స్పేస్ఎక్స్ 800 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో పబ్లిక్‌గా (ఐపీఓ) వచ్చే అవకాశం ఉందనే వార్తలు వెలువడిన వెంటనే.. మస్క్ నికర విలువ ఒక రోజులో 168 బిలియన్ డాలర్లు పెరిగింది. స్పేస్ఎక్స్ సీఈఓ ఇప్పటికే.. ఈ ఏడాది అక్టోబర్‌లో 500 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటారు. కాగా ఇప్పుడు ఈయన సంపద 600 బిలియన్ డాలర్లకు చేరింది. స్పేస్ఎక్స్‌లో మస్క్ 42 శాతం వాటాను కలిగి ఉండటం వల్ల.. సంపద ఒక రోజులోనే భారీగా పెరిగిపోయింది. ఇది అనేక దేశాల కంటే ఎక్కువ. దీంతో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా.. మస్క్ తన స్థానాన్ని మరోమారు సుస్థిరం చేసుకున్నారు. స్పేస్ఎక్స్ మాత్రమే కాదు, ఎలాన్ మస్క్ తన ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లాలో దాదాపు 12% వాటాను కలిగి ఉన్నారు. ఇది కూడా ఈయన సంపదను పెంచడంలో దోహదపడింది. టెస్లాలో మస్క్ వాటా ఇప్పుడు దాదాపు 197 బిలియన్ డాలర్లుగా ఉంది.మార్చి 2020లో, టెస్లా సీఈఓ సంపద 24.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తరువాత జనవరి 2021లో దాదాపు 190 బిలియన్ డాలర్ల నికర విలువతో మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు అయ్యాడు. అయితే.. మస్క్ సంపద పెరుగుదల అక్కడితో ఆగలేదు, ఎందుకంటే ఆయన నికర విలువ డిసెంబర్ 2024లో 400 బిలియన్ డాలర్లకు, అక్టోబర్‌లో 500 బిలియన్ డాలర్లకు చేరింది. ఇప్పుడు తాజాగా 600 బిలియన్ డాలర్ల మార్క్ దాటింది.

# రియల్ హీరోకు ప్రశంసల వెల్లువ

- దేశవ్యాప్తంగా భారీగా విరాళాలు
- అహ్మద్ అల్ అహ్మద్‌ను ఆస్పత్రిలో పరామర్శించిన ఆస్ట్రేలియా ప్రధాని



సిడ్నీ:ఆస్ట్రేలియాలోని సిడ్నీ బోండీ బీచ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించిన అహ్మద్ అల్ అహ్మద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.ప్రాణాలను పణంగా పెట్టిమరీ దుండగులను నిలువరించిన అహ్మద్‌కు నాలుగు నుండి ఐదు తుపాకీ గాయాలు అయ్యాయి. చాలా రక్తం పోవడంతో పలు మార్లు ఆపరేషన్లు చేయాల్సి ఉందని అక్కడి అధికారులు వెల్లడించారు. అలాగే ఎడమ భుజం బ్లేడ్ వెనుక భాగంలో ఒక బుల్లెట్‌ను ఇంకా తీయలేదు. ఈగాయం కారణంగా అతని ఎడమ చేయిని తీసివేయాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అతని పరిస్థితి ఊహించిన దానికంటే తీవ్రంగా ఉన్నట్టు తెలుస్తోంది.మరోవైపు అహ్మద్ చూపించిన తెగువ, ధైర్యం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకుంటోంది. ముఖ్యంగా సిడ్నీలోని ఒక ఆసుపత్రిలో అహ్మద్‌ను ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ పరామర్శించారు. నిజమైన నేషనల్ హీరో అంటూ కొనియాడారు. ఆస్ట్రేలియన్లకు ప్రేరణ అంటూ అభివర్ణించారు. కాల్పుల తర్వాత వెంటనే బాధితులకు చికిత్స చేయడంలో సహాయం చేసిన అహ్మద్,ఇతరును ఆస్ట్రేలియా ప్రధాని ప్రశంసించారు.అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, హెడ్జ్ ఫండ్ బిలియనీర్ బిల్ అక్మాన్ అహ్మద్ ధైర్య సాహసాలను కొనియాడారు. పెర్షింగ్ స్క్వేర్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు అక్మాన్ అహ్మద్‌ను డేరింగ్ హీరో అంటూ ప్రశంసించారు. కుటుంబానికి మద్దతుగా హెడ్జ్ ఫండ్ సంస్థ ఏర్పాటు చేసిన నిధుల సేకరణకు భారీ స్పందన లభిస్తోంది. గోఫండ్‌మీ పేజీ విరాళాలు 2 మిలియన్ల డాలర్ల (రూ. 18.15కోట్లు)కు సమీపంలో ఉండటం విశేషం. దాదాపు 33వేల మంది విరాళాలందించారు. అంతేకాదు అత్యధిక విరాళం (99,999 డాలర్లు) ఇచ్చిన వ్యక్తిగా విలియం అక్మాన్ నిలవడం విశేషం.సిరియాలో జన్మించిన అహ్మద్, 15 మందిని బలిగొన్న ఈ మారణహోమం సమయంలో కాల్పులకు గురైన వారిలో ఒకరిపైకి దూకి, అతని చేతుల నుండి తుపాకీని లాక్కున్నాడు. ఈ సంఘటన యొక్క అసాధారణ దృశ్యాలు వైరల్ అయ్యాయి. సిడ్నీలోని బోన్డీ బీచ్‌లో జరిగిన హనుకా కార్యక్రమంలో యూదు సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపిన దుండగులు తండ్రీ కొడుకులేనని ఆస్ట్రేలియా అధికారులు ధృవీకరించారు. ఆస్ట్రేలియా చరిత్రలో అత్యంత దారుణమైన ఉగ్రవాద దాడి అయిన ఈ మారణహోమంలో15 మంది మరణించారు. కాల్పులకు పాల్పడిన ఇద్దరిలో 50 ఏళ్ల తండ్రి ఎదురుకాల్పుల్లో మరణించారు. 24 ఏళ్ల కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలో హీరోగా నిలిచిన 43 ఏళ్ల అహ్మద్‌ను దక్షిణ సిడ్నీకి చెందినవాడిగా గుర్తించారు. ఇద్దరు పిల్లల తండ్రి అయిన అహ్మద్ 2006లో సిరియా నుండి ఆస్ట్రేలియాకు వచ్చాడు. ఆస్ట్రేలియన్ పౌరసత్వం ఉన్న అతను చిన్న షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.


# తుపాను బీభత్సం

## కుప్పకూలిన స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ

గువైబా :దక్షిణ బ్రెజిల్‌లోని గువైబా నగరంలో తీవ్ర తుఫాన్ బీభత్సం సృష్టించింది. బలమైన గాలులు, తుఫాన్ తాకిడికి దాదాపు 114 అడుగుల ఎత్తున్న స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ప్రతిరూపం కుప్పకూలిపోయింది.అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీనికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్ బాగా షేర్ అవుతోంది.సోమవారం మధ్యాహ్నం బ్రెజిల్‌లోని గుయిబా నగరాన్ని తీవ్రమైన తుఫాను ముంచెత్తింది. దీంతో దాదాపు 40 మీటర్ల పొడవైన స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ప్రతిరూపం కూలిపోయింది. ఫాస్ట్-ఫుడ్ అవుట్‌లెట్ సమీపంలోని హవాన్ రిటైల్ మెగాస్టోర్ ,కార్ పార్కింగ్‌లో ఏర్పాటు చేయబడినఈ విగ్రహాన్ని తీవ్రమైన గాలులు తాకాయి. బలమైన గాలుల ధాటికి తొలుత వంగిపోయిన ఈ విగ్రహం తాకిడి తీవ్రం కావడంతో స్టాట్యూ తల ముక్కలైంది.బ్రెజిల్ పౌర రక్షణ సంస్థ అధికారుల ప్రకారం.. పై భాగం మాత్రమే ప్రభావితమైది. అయితే 11 మీటర్లు (36 అడుగులు) పీఠం చెక్కుచెదరకుండా ఉంది. గుయిబా మేయర్ మార్సెలో మారనాటా మాట్లాడుతూ, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. సత్వరమే స్పందించిన అధికారులను ప్రశంసించారు. విగ్రహం కూలిపోవడానికి ఖచ్చితమైన కారణాన్నిగుర్తించేందుకు, తీవ్రమైన వాతావరణం తోపాటు, తర అంశాలు పాత్రపై ఆరా తీసేందుకు సాంకేతిక తనిఖీ నిర్వహించబడుతుందని అధికారి ఒకరు చెప్పారు.కాగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన స్టాట్యూ ఆఫ్ లిబర్టీ అసలైన విగ్రహం అమెరికాలోని న్యూయార్క్‌లో ఉంది. బ్రెజిల్‌లోని హవాన్ అనే డిపార్ట్‌మెంటల్ స్టోర్ చైన్ బ్రాండ్ గుర్తుగా 2020లో దీన్ని ఏర్పాటు చేశారు..

# దెబ్బతీసిన గ్రీన్ కార్డ్ ఇంటర్వ్యూ

## 30 ఏళ్లుగా ఉంటున్నభారత సంతతి మహిళ అరెస్ట్



అమెరికాలో గ్రీన్ కార్డ్ ఇంటర్వ్యూలో భారత సంతతికి చెందిన 60 ఏళ్ల మహిళకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. అమెరికాలో 30 ఏళ్లుగా నివసిస్తున్నమహిళను గ్రీన్ కార్డ్ ఇంటర్వ్యూ చివరి రౌండ్‌లో అరెస్ట్ చేయడం కలకలం రేపింది.బబ్లీజీత్ కౌర్ అలియాస్ బబ్లీ అనే మహిళ, గ్రీన్ కార్డ్ దరఖాస్తుకు సంబంధించిన బయోమెట్రిక్ స్కాన్ అపాయింట్‌మెంట్‌కు వెళ్లినప్పుడు ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రీన్ కార్డ్ ఇంటర్వ్యూ చివరి దశలో ఉండగా ఇమ్మిగ్రేషన్ అధికారులు తన తల్లిని అదుపులోకి తీసుకున్నారని ఆమె కుమార్తె జోతి మీడియాకు తెలిపారు. 1994 నుండి అమెరికాలో నివసిస్తున్న బబుల్జిత్ "బబ్లీ" కౌర్, పెండింగ్‌లో ఉన్న ఆమె గ్రీన్ కార్డ్ దరఖాస్తు కోసం బయోమెట్రిక్ స్కాన్ అపాయింట్‌మెంట్ సమయంలో ఫెడరల్ ఏజెంట్లు అదుపులోకి తీసుకున్నారు. డిసెంబర్ 1న తన తల్లి యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం డెస్క్ వద్ద ఉన్నప్పుడు, పలువురు ఫెడరల్ ఏజెంట్లు భవనంలోకి ప్రవేశించారని జ్యోతి చెప్పింది. ఆ తర్వాత ఫెడరల్ ఏజెంట్లు వెళ్లిన గదిలోకి కౌర్‌ను పిలిచి, ఆమెను అరెస్టు చేస్తున్నట్లు చెప్పారని ఆమె తెలిపింది. కౌర్‌కు తన న్యాయవాదితో ఫోన్‌లో మాట్లాడే అవకాశం కల్పించినప్పటికీ, ఆమెను నిర్బంధంలోనే ఉంచారని ఆమె కుమార్తె చెప్పింది. కొన్ని గంటల పాటు కౌర్‌ను ఎక్కడికి తీసుకెళ్లారో కుటుంబ సభ్యులైన తమకు తెలపకుండానే, రాత్రికి రాత్రే అడెలాంటోకు బదిలీ చేశారని ఆరోపించారు. మరోవైపు అమెరికా పౌరురాలైన ఆమె మరో కుమార్తె, గ్రీన్ కార్డ్ ఉన్న ఆమె భర్త నుండి ఆమోదించబడిన గ్రీన్ కార్డ్ హోదాలో ఉన్నారని లాంగ్ బీచ్ వాచ్‌డాగ్ తన కథనంలో వివరించింది.

# నేషనల్ హెరాల్డ్ కేసు.. సోనియా, రాహుల్‌గాంధీకి ఊరట

అయితే, ఈ కేసు లో ఈడీ తమ దర్యాప్తును కొనసాగించొచ్చని న్యాయస్థానం తెలిపింది.ప్రైవేటు వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ నేషనల్ హెరాల్డ్ కేసులో దర్యాప్తు జరిపి ఈ ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసినట్లు న్యాయస్థానం విచారణ సందర్భంగా వెల్లడించింది. చట్టప్రకారం దీన్ని పరిగణనలోకి తీసుకోవడం కుదరదని స్పష్టం చేసింది. ఈ కేసులో ఇప్పటికే దిల్లీ ఆర్థిక నేరాల విభాగం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయాన్ని గుర్తుచేసింది. అలాంటప్పుడు ఈడీ ఛార్జ్‌షీట్ ఆధారంగా తీర్పు ఇవ్వడం తొందరపాటు చర్యే అవుతుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. నేషనల్ హెరాల్డ్ మాతృక సంస్థ అసోసియేటెడ్ జర్నలిస్ట్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించింది. అందుకు బదులుగా ఏజేఎల్ కంపెనీ ఆస్తులను తమ అధీనంలోకి తీసుకుంది. అయితే, ఈ వ్యవహారంలో సోనియా, రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దుబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్ ప్రైవేటు కంపెనీ కుట్ర, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తోంది.రాహుల్, సోనియాకు మెజార్టీ వాటా ఉన్న యంగ్ ఇండియన్ కేవలం రూ.50 లక్షలు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెల్లించి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులపై అధికారాన్ని పొందిందని దర్యాప్తు సంస్థ తమ ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది.

# చిక్కుల్లో శ్రీలంక క్రికెట్ దిగ్గజం..

## అరెస్టుకు రంగం సిద్ధం



శ్రీలంక దిగ్గజ క్రికెటర్ అర్జున రణతుంగ చిక్కుల్లో పడ్డాడు. మంత్రిగా ఉన్న సమయంలో భారీ అవినీతికి పాల్పడ్డాడనే ఆరోపణలతో అతడిపై అభియోగాలు నమోదయ్యాయి.ఈ నేపథ్యంలో రణతుంగను అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమైనట్లు సమాచారం.అంతర్జాతీయ క్రికెట్‌లో అర్జున రణతుంగా శ్రీలంక తరఫున సత్తా చాటాడు. ఈ లెఫ్టాండర్ బ్యాటర్ 1996లో కెప్టెన్ హోదాలో శ్రీలంకకు వన్డే వరల్డ్‌కప్ అందించాడు. రణతుంగ సారథ్యంలో పటిష్ట ఆస్ట్రేలియాను ఓడించి లంక టైటిల్ గెలవడంతో అతడి ప్రతిష్ట మరింత పెరిగింది.ఇక ఆటకు స్వస్తి పలికిన తర్వాత అర్జున రణతుంగా రాజకీయాల్లో ప్రవేశించాడు. శ్రీలంక రవాణా, విమానయాన శాఖ,పోర్ట్స్ అండ్ షిప్పింగ్ శాఖ, పెట్రోలియం వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశాడు. అయితే, పెట్రోలియమ్ మినిస్టర్‌గా ఉన్న సమయంలో అతడు అవినీతికి పాల్పడినట్లు సమాచారం.ఈ కేసు విచారణలో భాగంగా అవినీతి నిరోధక శాఖ కొలంబో మెజిస్ట్రేట్ అసంగ బొడరగమా ముందు సోమవారం తమ వాదనలు వినిపించింది. మొత్తంగా 27సార్లు జరిపిన కొనుగోళ్లలో 800 మిలియన్ శ్రీలంకన్ రూపాయలు (భారత కరెన్సీలో రూ. 23. 5 కోట్లు) అవినీతి జరిగినట్లు తాము గుర్తిం చినట్లు తెలిపింది.కాగా ఈ కేసులో ఇప్పటికే అర్జున రణతుంగ అన్నయ్య, సిలోన్ పెట్రోలియమ్ చైర్మన్‌గా ఉన్న ధమ్మిక రణతుంగను పోలీసులు సోమ వారం అరెస్టు చేశాడు. అయితే, కాసేపటికే అతడు బెయిల్‌పై విడుదలయ్యాడు

## కొత్త సంవత్సరంలో ఖమ్మం దేవరపల్లి
# జాతీయ రహదారి అందుబాటులోకి తీసుకురావాలి

- జనవరి నాటికి ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- ధంసలాపురం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే, ఆర్‌ఓబీ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అనుదీప్



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** కొత్త సంవత్సరంలో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావాలని, రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆర్‌ఓబీ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ధంసలాపురం వద్ద ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఖమ్మంకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను క్షేత్రస్థాయిలో తిరుగుతూ పరిశీలించారు. నమూనా మ్యాప్ లను చూసి ఏజెన్సీలకు సూచనలు చేశారు. నిర్మాణ దశలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసురావాలని, పనులను వేగవంతం చేసి జనవరి కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిపై ధంసలాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి, మున్నేరుపై బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని అన్నారు. ఖమ్మం ప్రజలకు, ప్రక్క రాష్ట్రం వారికి ఈ జాతీయ రహదారి ఉపయోగపడుతుందని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి, కాంక్రిట్ వాల్ జనవరి నాటికి పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణంలో సేఫ్టీ నియమాలు పాటించాలని కలెక్టర్ అన్నారు. ఆర్‌ఓబి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ వంటి అన్ని పనులు పూర్తి చేశామని, ఒకవైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం వరకు ఉపయోగపడుతుందని తెలిపారు. నూతన సంవత్సరంలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. రైల్వే, కెనాల్, మున్నేరుపై రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రహదారి వాహనాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ సర్వీస్ రోడ్లు, మున్నేరు బ్రిడ్జ్ తో పాటు ధంసలాపురం ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని, జాతీయ రహదారి పనులకు సంబంధించి పెండింగ్ భూ సేకరణ పనులు నిరంతరం మానిటరింగ్ చేస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నేషనల్ హైవే పిడి దివ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.








# కదిలారు.. కూల్చారు

## జెవి కాలనీలో అక్రమాలపై జిహెచ్ఎంసి అధికారుల చర్యలు

- డబుల్ పర్మిషన్ కలిగిన ఓ భారీ భవనం కూల్చివేత
- మరో భవనాన్ని సైతం సీజ్ చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు





**శేరిలింగంపల్లి, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** ఎలాగైతేనేం మొత్తానికి శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులలో కాస్త చలనం కలిగి పలు అక్రమ నిర్మాణాలపై దృష్టిని సారించడం జరిగింది. ఈ మధ్యకాలంలో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో పలువురు భవన నిర్మాణ దారులు అడ్డదారిలో అధికారులతో మిలాఖత్ అయి కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న దొంగచాటు వ్యవహారాలను పలు మీడియా సంస్థల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జనం సాక్షి సైతం పలు విశ్లేషణాత్మక కథనాలతో పాటు సమగ్రమైన ఆధారాలతో కూడిన వార్తలను ప్రచురించ డం జరిగింది. దీంతో తప్పనిసరి పరిస్థితులలో శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఎట్టకేలకు తమ మబ్బులు వదిలించుకొని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పలు అక్రమాలపై నిఘాలు పెంచి కూపి లాగడంతో వార్తాకథనాలలోని సారాంశం బోధపడడంతో చర్యలకు పూనుకున్నారు.




### ఇంకా ఇంకా పసిగట్టాలి

శేరిలింగంపల్లి డివిజన్ పరిధి (జెవి కాలనీ)లో గత కొన్నేళ్లుగా గుర్తుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాల వ్యవహారం చక్కబెడుతున్న కొంతమంది అక్రమ బిల్డర్లు శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగంలోని కొంతమంది అధికారులతో చేతులు కలిపి కోట్లాది రూపాయల ప్రజా ప్రజాధనాన్ని బొక్కుతున్న విషయాన్ని పసిగట్టిన మీడియా వరుసగా విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించగా ఎట్టకేలకు కదిలిన అధికారులు జెవి కాలనీ పరిధిలోని ఓ భారీ బహుళ అంతస్తుల భవనాన్ని మంగళవారం కూల్చివేయడం విశేషం. కాగా ఈ భవనంతో పాటు మరో భవనాన్ని కూడా అధికారులు సీజ్ చేసి తమ స్వాధీనంలోకి తీసుకోవడం కొసమెరుపు. ఇప్పటికైనా అధికారులు తమ దృష్టిని సారించి డివిజన్ తోపాటు ఇతర ప్రాంతాలలోసైతం రూపుదిద్దుకున్న ఇలాంటి అక్రమ నిర్మాణాలను పసిగట్టి నేలమట్టం చేయాల్సిన అవసరం ఉందని ఆయా కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు.



## డివిజన్ పునర్విభజనలో గందరగోళం: ఎమ్మెల్యే మర్రి

**అల్వాల్, డిసెంబర్ 16(జనంసాక్షి):** ప్రస్తుత డివిజన్‌ల పునర్విభజనలో స్పష్టత లేకపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మల్కాజ్‌గిరి శాసనసభ్యుడు మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం జిహెచ్ఎంసి కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాత గ్రామాల పేర్లను ఆధారంగా చేసుకుని సహజ సరిహద్దుల ప్రకారం డివిజన్‌లను మళ్లీ పునర్విభజన చేయాలని ఆయన డీలిమిటేషన్ కమిషనర్‌ను కోరారు. అల్వాల్ పరిధిలో గతంలో మూడు డివిజన్‌లు ఉండగా, ఇప్పుడు ఆరు డివిజన్‌లుగా పెంచడం ప్రజలకు అసౌకర్యాలు కలిగిస్తుందని ఆయన అన్నారు. మల్కాజ్‌గిరి వెంకటాపురం డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ, బోరహ సముదాయం, లోటస్ ఫండ్ కాలనీలను కూకట్‌పల్లి పరిధిలోని హస్మత్‌పేట్ డివిజన్‌లో కలపడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. అల్వాల్ కేంద్రం కేవలం ఒక కిలోమీటరు దూరంలో ఉండగా, కూకట్‌పల్లి చేరుకోవడానికి దాదాపు పదకొండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని, ఇది పరిపాలనా, ఆదాయ సంబంధిత సమస్యలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. డివిజన్‌లకు పేర్లు నిర్ణయించేటప్పుడు పాత గ్రామకంఠాలు, చారిత్రక ప్రాంతాల పేర్లను కొనసాగించాలని ఆయన సూచించారు. నేరేడ్మెట్ వంటి ప్రాంతాలకు కొత్త కాలనీ పేర్లను పెట్టడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

## 50 చర్చిలకు రూ.15 లక్షల ఆర్థిక సహాయం

### క్రీస్తు ప్రవచన మార్గంలో ప్రేమ, శాంతిని పెంపొందించాలి : డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 16 (జనం సాక్షి) :** క్రీస్తు ప్రవచన మార్గంలో ప్రేమను పెంపొందిస్తూ భారత రాజ్యాంగంలో ప్రతిపాదించిన లౌకిక విలువలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని శాసనమండలిలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లాలో క్రిస్మస్ పండుగ వేడుకలను ఆయన ఘనంగా ప్రారంభించారు. మేడ్చల్ పట్టణంలోని జేవియర్ గార్డెన్‌లో నిర్వహించిన యునైటెడ్ క్రిస్మస్ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లాలోని 50 చర్చిలకు ఒక్కో చర్చికి రూ.30 వేల చొప్పున మొత్తం రూ.15 లక్షల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు ఆనందంగా, ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుమారు 2,000 మంది క్రైస్తవులతో కలిసి సామూహిక విందులో పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులు, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ ప్రజాహిత నిర్ణయాలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పారు. క్రీస్తు ప్రవచించిన ప్రేమ, శాంతి సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన కోరారు. ఈ వేడుకల్లో ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఆర్టీవో సభ్యులు జైపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు ముజీబ్, మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పోచంపల్లి, అల్వాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, తుంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# టిపిఎఫ్ నాల్గవ మహాసభలకు పిలుపు

- కరపత్రం ఆవిష్కరణతో ఉద్యమ జ్వాల
- అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయండి

**షాద్‌నగర్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టిపిఎఫ్) నాయకులు రాష్ట్ర నాల్గవ మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిపిఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో గత పోరాట చరిత్రను గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు నాలుగు దశాబ్దాల పాటు అవిశ్రాంతంగా పోరాడారని, ఈ క్రమంలో అనేకమంది తమ ప్రాణాలను త్యాగం చేశారని ఆయన అన్నారు. వ్యక్తులు, శక్తులు, సంస్థలు తెలంగాణ సమాజంలో సంవాదాలు నడిపి, సంభాషణలు జరిపి, ఉద్యమాన్ని రగిలించాయని పేర్కొన్నారు. మొదటి దశలో ఉద్యోగులు, విద్యార్థులు చురుకుగా పాల్గొని 360 మంది విద్యార్థులు పోలీసు తూటాలకు బలయ్యారని, తర్వాత ఉద్యోగులు తమ హక్కుల కోసం పోరాడుతూ తెలంగాణ ఆకాంక్షలను సజీవంగా ఉంచారని తెలిపారు. 90వ దశకంలో చిన్న రాష్ట్రాల ఏర్పాటు దేశవ్యాప్త ఎజెండాగా మారిన నేపథ్యంలో పీపుల్స్ వార్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను బలపరిచే డాక్యుమెంట్ విడుదల చేసిందని, అది ప్రజాస్వామికవాదులు, మేధావులు, కళాకారులపై విశేష ప్రభావం చూపిందని వివరించారు. భువనగిరి, సూర్యాపేట, వరంగల్ డిక్లరేషన్లు తెలంగాణ సమాజంలో పెద్ద కదలిక తీసుకొచ్చాయని, మేధావులు, కవులు, కళాకారులు సాహిత్య కృషి చేశారని అన్నారు. తెలంగాణ జనసభ, ఐక్యవేదిక, మహాసభ, సంస్కృతి వేదిక, స్టడీ ఫోరం వంటి సంస్థలు నిర్మాణాత్మకంగా కృషి చేశాయని పేర్కొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాజీలేకుండా పోరాడిందని, 2018 నుంచి నిర్బంధం విధించి నాయకులను అరెస్టు చేసినా సంస్థ బలాన్ని కూడగట్టుకుని ప్రజల్లో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాల్గవ మహాసభలకు సిద్ధమైందని, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈనెల 28, 29 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిఎఫ్ జిల్లా కన్వీనర్ అర్జునప్ప, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య, ప్రజా కళామండలి జిల్లా కన్వీనర్ రాంచందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కన్న పేగే.. కాటేసింది

## ఏడేళ్ల చిన్నారిని మూడో అంతస్తు నుంచి తోసేసి హత్య చేసిన తల్లి

- మానసిక సమస్యలతో బాధపడుతున్న నిందితురాలు మోనాలిసా
- తీవ్ర గాయాలతో చిన్నారి షారోన్ మేరీ మృతి
- కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిడి కారణమని అనుమానం
- పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు



**మల్కాజిగిరి, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వసంతపురి కాలనీలో సోమవారం దారుణ సంఘటన చోటుచేసుకుంది. కన్నతల్లి మోనాలిసా (37) తన ఏడేళ్ల కూతురు షారోన్ మేరీని మూడో అంతస్తు భవనం నుంచి కిందకు తోసేసి హత్య చేసిన ఘటన స్థానికులను కలచివేసింది. చిన్నారి తీవ్ర గాయాలపాలై గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

మృతురాలి తల్లిదండ్రులు గత 20 ఏళ్లుగా వసంతపురి కాలనీలో నివసిస్తున్నారు. చిన్నారి తండ్రి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, తల్లి మోనాలిసా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి కారణంగా ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సోమవారం జరిగిన ఈ ఘటనలో మోనాలిసా చిన్నారిని బాల్కనీకి తీసుకెళ్లి కిందకు తోసేసినట్టు పోలీసులు తెలిపారు.

సంఘటన జరిగిన వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. అయితే తలకు, శరీరానికి తీవ్ర గాయాలైన షారోన్ మేరీ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మోనాలిసాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మానసిక స్థితి సరిగా లేని ఆమెపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు.

చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, బంధువులకు అప్పగించారు. ఈ దారుణాన్ని చూసిన స్థానికులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కన్నబిడ్డను కాలయమురాలిగా మారిన తల్లి చర్య ఏ కారణాల వల్ల జరిగిందనే ప్రశ్న అందరి మనసుల్లో మెదులుతోంది.

# జవహర్‌నగర్ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

### ఇళ్ల అనుమతులు, ఖాళీ భూముల రక్షణ కోరిన వజ్రేష్ యాదవ్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనం సాక్షి), డిసెంబర్ 16 :** మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్ సర్కిల్ పరిధిలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ జవహర్‌నగర్‌ను "మినీ ఇండియా"గా పిలుస్తారని, ఇక్కడ సుమారు 200 కాలనీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు గత 30 ఏళ్లుగా నివసిస్తున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం పాత ఇళ్ల స్థానంలో కొత్తగా ఇళ్ల నిర్మాణం చేసుకోవడానికైనా, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పక్కా ఇళ్లు నిర్మించుకోవడానికైనా అనుమతులు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన 58, 59 జీవోల ద్వారా పొందిన పట్టాలు ఉన్నప్పటికీ, వాటి ఆధారంగా ఇప్పుడు కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఈ సమస్యపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా జవహర్‌నగర్‌లో మిగిలి ఉన్న ఖాళీ స్థలాల అంశం న్యాయస్థానంలో ఉండటంతో, అక్కడ నిర్మించాల్సిన ఓపెన్ జిమ్‌లు, సమీకృత మార్కెట్‌లు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, కాబట్టి తక్షణమే చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వినతిని సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి, జవహర్‌నగర్ సమస్యలపై సమగ్రంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వజ్రేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికుడిగా మారిన సర్పంచ్ భర్త

### గ్రామంలో మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్న సర్పంచ్ భర్త సది

**ముత్తారం డిసెంబర్ 16(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి వారం కూడా గడువక ముందే గ్రామంలోని సమస్యలను గుర్తించి సర్పంచ్ భర్త పారిశుధ్య కార్మికుడిగా మారారు. సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు అనేక విధాలుగా పారిశుధ్య పనులు చేస్తున్నప్పటికి గ్రామంలో ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు భార్య గ్రామభివృద్ధికి తొడ్పాడాలని ఉద్దేశంతో నిలిచిపోయిన పనులను ప్రారంభించాడు. పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం సీతంపేట గ్రామంలో మురుగు కాల్వను నిండుకొని దుర్గంధం వెదజల్లుతుండడంతో సర్పంచ్ కృష్ణవేణి భర్త సదితో సర్చించడంతో మంగళవారం పంచాయతీ కార్మికుడిగా మారి కాల్వను శుభ్రం చేయడంతో నూతన సర్పంచ్ దంపతులును చొరవను గ్రామస్తులు రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు

# కర్ల రాజేష్ మృతికి కారకులు పోలీసులే..

- పూర్తి ఆధారాలను డీజీపీకి సమర్పించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



కోదాడలో మాదిగ సామాజికవర్గానికి చెందిన చెందిన కర్ల రాజేష్ ను ఏ పిర్యాదు లేకుండానే చట్టవిరుద్ధంగా కస్టడీలోకి తీసుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టి అతని చావుకు కారకులైన చిలుకూరు ఎస్సై, కోదాడ రూరల్ సీఐ అలాగే ఇతర పోలీసు సిబ్బంది మీద తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, 'పద్మశ్రీ' మందకృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డిని కలిశారు. ఈ మేరకు మృతుడి తల్లి కర్ల లలితమ్మతో కలిసి కర్ల రాజేష్ మృతికి సంబంధించిన సంపూర్ణ ఆధారాలు,సాక్ష్యాలు, సంబంధిత పత్రాలతో కూడిన మెమోరాండంను అందజేశారు. ఈ సందర్భంగా సంఘటనకు సంబంధించిన వాస్తవాలు, బాధిత కుటుంబం ఎదుర్కొన్న అన్యాయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. కేసును నిష్పక్షపాతంగా, వేగవంతంగా విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. డీజీపిని కలిసిన అనంతరం మంద కృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడుతూ " దేశంలోనే అత్యంత అరుదైన కస్టడీ డెత్ కర్ల రాజేష్ ది కావడం గమనార్హం అన్నారు. ఇప్పటివరకు జరిగిన లాకప్ డెత్ లన్ని బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత లేదా ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత నిందితులను అదుపులో తీసుకొని పోలీసులు విచారిస్తున్న సందర్భంలో జరిగిన హింసల వల్ల జరిగాయని అన్నారు. చట్టవిరుద్ధమైన కస్టడీ, చట్ట విరుద్ధమైన చిత్రహింసలు రాజేష్ మరణానికి ప్రధాన కారణం అని అన్నారు. డీజీపీ స్పందిస్తూ ఈ సంఘటనపై త్వరలోనే విచారణ చేపడతామని న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాదిగ, కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి ఏపూరి రాజు మాదిగ హైకోర్టు అడ్వకేట్ దున్న అంబేద్కర్ అలాగే కర్ల రాజేశ్ తమ్ముడు కర్ల కమల్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మధ్య గేటు వద్ద ఆర్వోబికి గ్రీన్ సిగ్నల్

- భూ సేకరణ కోసం వేచి చూస్తున్నాం
- ఎంపీ వద్దిరాజు వినతికి రైల్వే అధికారుల స్పందన



**ఖమ్మం బ్యూరో డిసెంబర్ 16 (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలో రెండు ప్రధాన వ్యాపార కూడళ్లు గాంధీ చౌక్, కమాన్ బజార్లను కలిపే మధ్యగేటు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబి) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే అందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి, తమ అప్పగిస్తే అక్కడ పనులు మొదలు పెడతామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ స్పష్టం చేశారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల కోరిక మేరకు మధ్య గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోరుతూ.. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రైల్వే జీఎం కు గత నెలలో ఓ వినతిపత్రం అందజేశారు. ఆ మేరకు రైల్వే జీఎం స్పందించి ఆయకు ప్రత్యుత్తరం రాశారు. ఖమ్మం - పందిళ్ళపల్లి మధ్యలో 104 లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీని పూర్తిగా కేంద్ర నిధులతో నిర్మించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే ఆర్వోబి నిర్మాణం భూ సేకరణ అంశంతో ముడిపడి ఉన్నందున, అందుకు సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి తమకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు రైల్వే జీఎం తెలియజేశారు. ఈ అంశం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెడతామని దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీవాస్తవ తన లేఖలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు స్పష్టం చేశారు.

### మూడవదశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు

# కరీంనగర్‌లో కట్టుదిట్టమైన భద్రత

- పటిష్ట బందోబస్తు, సున్నిత కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ల మోహరింపు
- విజయోత్సవ ర్యాలీలపై నిషేధం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 16(జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసెంబర్ 17న జరగనున్న మూడవదశ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందితో సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బందోబస్తు ప్రణాళిక వివరాలను వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోని వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజురాబాద్, వి.సైదాపూర్ మండలాల్లో 111 గ్రామ పంచాయతీలకు గాను మొత్తం 1034 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించడంతో పాటు క్రిటికల్, ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న మండలాల్లో ఇద్దరు ఏసీపీలను కేటాయించామని వివరించారు. గత సంఘటనల ఆధారంగా గుర్తించిన సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించడంతోపాటు వెబ్‌కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో స్టాటిక్ పోలీసు పార్టీ, ప్రతి రూట్‌లో మొబైల్ పార్టీ ఉండేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. అదనంగా ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారి అధీనంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కేటాయించామని, ఈ ఫోర్స్‌లో స్పెషల్ యాక్షన్ టీమ్ సభ్యులు పూర్తి రైట్ గేర్‌తో సిద్ధంగా ఉంటారని వివరించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల మేర ప్రచారం, పార్టీ చిహ్నాలు, గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధమని, పోలింగ్ స్టేషన్‌లో మొబైల్ ఫోన్లు, ప్రచార సామగ్రి అనుమతించబడవని స్పష్టం చేశారు. మూడవదశ బందోబస్తు కోసం దాదాపు 877 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఇందులో 6 మంది ఏసీపీలు, 20 మంది ఇన్‌స్పెక్టర్లు, 39 మంది ఎస్సైలు, 40 మంది ఏఎస్సై/హెడ్ కానిస్టేబుళ్లు, 460 మంది కానిస్టేబుళ్లు, 35 మంది స్పెషల్ యాక్షన్ టీమ్ సభ్యులు, 178 మంది హోంగార్డులతో పాటు 100 మంది బెటాలియన్ స్పెషల్ పోలీసులు, అదనంగా ఎన్‌సీసీ సభ్యులను కూడా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాచార వినిమయం వేగవంతంగా జరిగేందుకు 5 మండలాల్లో అదనపు రిపీటర్లు, బేస్ సెట్లను ఏర్పాటు చేసి వైర్‌లెస్ కమ్యూనికేషన్‌ను పూర్తి సిద్ధంగా ఉంచామని, పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను రిసీవింగ్ సెంటర్లకు తరలించే ప్రక్రియ కట్టుదిట్టమైన భద్రత మధ్య, నిరంతర నిఘా మధ్య జరుగుతుందని సీపీ వివరించారు. శాంతిభద్రతల కాపలాకు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. ఎన్నికల అనంతరం అదేరోజు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని సీపీ గౌష్ ఆలం విజ్ఞప్తి చేశారు.

## రాజేంద్రనగర్ సర్కిల్ నూతన డివిజన్లపై కార్పొరేటర్ అభ్యంతరం

**రాజేంద్రనగర్, డిసెంబర్16(జనం సాక్షి):** నియోజకవర్గం పరిధిలోని రాజేందర్‌నగర్ సర్కిల్ (60)లో నూతన డివిజన్ల ప్రకటనతో గందరగోళం ఏర్పడిందని కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాష్ తెలిపారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమె మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఈ అంశంపై వినతి పత్రం సమర్పించారు. ఆరాంఘర్ నుంచి బాపు గాడ్ బ్రిడ్జి వరకు ఉన్న తన డివిజన్‌ను సులేమాన్ నగర్‌లో చేర్చడం, అలాగే తన సొంత ఊరైన శివరాంపల్లిలోని తన ఓటు హక్కును కూడా సులేమాన్ నగర్ ప్రాంతంలో కలపడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఉప్పర్‌పల్లి పాత కోర్టు ప్రాంతాన్ని హైదర్‌గూడ డివిజన్‌లో కలపడం వల్ల డివిజన్ మూడు ముక్కలుగా విభజించబడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఒక వర్గానికి లబ్ధి చేకూర్చేలా జరుగుతోందని ఆరోపించిన ఆమె, తాను తన డివిజన్ అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.75 కోట్లతో పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా రాజేంద్రనగర్ డివిజన్‌లో ఇతర డివిజన్లను కలపవద్దని మేయర్‌ను కోరారు. దీనికి స్పందిం చిన మేయర్ గద్వాల విజయలక్ష్మి సమస్యను సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### చివరి దఫా పంచాయతీ

## ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**జమ్మికుంట, ఇల్లందకుంట, హుజురాబాద్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** మూడవ విడతలో నిర్వహించనున్న గ్రామపంచా యతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు 2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో 17న చివరి విడత పోలింగ్ జరగనుంది. జమ్మికుంట, ఇల్లందకుంట, హుజురాబాద్, వీణవంక, వి.సైదాపూర్ మండలాల్లోని గ్రామపంచాయ తీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. హుజురాబాద్ మండలానికి సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, జమ్మికుంట మండలానికి సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఇల్లందకుంట మండలానికి సంబంధించి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ఫంక్షన్ హాల్ లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించి, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు జిల్లాకేంద్రానికి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని, చివరి దశ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమేష్ బాబు ఉన్నారు.

# మంథని మార్కెట్ వ్యాపారులకు హైకోర్టు ఊరట

- పాత మార్కెట్ తరలింపు, కూల్చివేతలకు బ్రేక్
- తాత్కాలిక షెడ్లలో సౌకర్యాలు కల్పించాలి
- రెండు నెలల గడువు.. కొత్త మార్కెట్‌లోనే కేటాయింపు
- స్ట్రీట్ వెండర్ల చట్టం పాటించాలి



**మంథని, డిసెంబర్ 16(జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని పాత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ వ్యాపారులకు హైకోర్టులో ఊరట లభించింది. మార్కెట్ తరలింపు, కూల్చివేతలను నిలిపివేయాలంటూ పిటిషన్ దాఖలు చేసిన వ్యాపారులకు అనుకూలంగా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తాత్కాలిక షెడ్లలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేవరకు రెండు నెలల గడువు ఇచ్చింది. కొత్త మార్కెట్ నిర్మాణం పూర్తయిన తర్వాత వీరికే షాపులు కేటాయించాలని షరతు విధించింది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిర్మాణాల కోసం సుమారు 4 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. దీంతో 50 మందికిపైగా కూరగాయల వ్యాపారులను బొక్కలవాగు కట్టపై తాత్కాలికంగా వెదురు తడకలతో 40 షెడ్లు నిర్మించారు. అయితే ఎండ, వాన, చలి, కుక్కలు, పందులు, కోతుల నుంచి రక్షణ లేకుండా నాసిరకం సామగ్రితో నిర్మించారు. నాలుగున్నర లక్షల రూపాయలతో ఈ షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారులను బలవంతంగా తరలించేందుకు మున్సిపాలిటీ అధికారులు రెండు రోజులుగా షట్టర్లు ఖాళీ చేయిస్తూ కూల్చివేతలు మొదలుపెట్టారు. గాజులు, పూసలు, అలంకరణ సామగ్రి వ్యాపారులు 15 మంది, మసాలా, ఆలుగడ్డ, ఉల్లిగడ్డల వ్యాపారులు 8 మందికి ఎలాంటి పునరావాసం కల్పించకుండా షట్టర్లు ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారు. పక్కనే ఉన్న కట్టడాలను రెండు రోజుల క్రితం తొలగించారు. త్వరలో కూరగాయల మార్కెట్, తర్వాత చికెన్, మటన్ మార్కెట్లను తరలించేందుకు సిద్ధమయ్యారు. దీనిపై మంథని కూరగాయల మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధం రవీందర్, ఉపాధ్యక్షుడు కోరవేనా సతీష్, స్ట్రీట్ వెండర్ ఎడ్ల సాగర్ తదితరులు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మార్కెట్ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ సరైన సౌకర్యాలతో పునరావాసం కల్పించకుండా కూల్చివేతలు మొదలుపెట్టడం సరికాదని వాదించారు. మున్సిపాలిటీ అధికారులు మూడు నెలలుగా చర్చలు జరిపామని, కొందరు అంగీకరించారని కోర్టుకు తెలిపారు. మంగళవారం విచారణ జరిపిన జస్టిస్ బి. విజయసేనారెడ్డి సరైన పునరావాసం కల్పించే వరకు పనులు చేపట్టరాదని, రెండు నెలల్లో సౌకర్యాలతో షెడ్లు నిర్మించి తరలించాలని, కొత్త మార్కెట్‌లో వీరికే కేటాయించాలని ఆదేశించారు. తెలంగాణ స్ట్రీట్ వెండర్ల చట్టం-2014 పాటించాలని సూచించారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది ఇనుముల సత్యనారాయణ, మున్సిపాలిటీ తరఫున షకీరా బేగం వాదనలు వినిపించారు.

### సర్పంచులు ఆత్మహత్యలు పాల్పడినప్పుడు

# లీగల్ సెల్ ఎటు పోయింది

- మూడవ విడత పూర్తి కాకముందుకే సర్పంచ్‌లకు అభినందన సభలా?
- నియోజకవర్గంలో ఉనికి కోసమే కేటీఆర్ ఆర్భాటం
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్



**తంగళ్ళపల్లి డిసెంబర్ 16 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ పై ఎమ్మెల్యే కేటీఆర్ కపట ప్రేమ చూపిస్తున్నారని తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లాలో మొదటి,రెండవ విడతల సర్పంచ్ ఎన్నికలు పూర్తయ్యాయి. మూడవ విడత ఎన్నికలు పూర్తికాకముందుకే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పల్లెల్లో విజయకేతనం ఎగురవేశారు. కేటీఆర్ కంచుకోటగా చెప్పుకునే తంగళ్ళపల్లి మండలంలో గెలిచిన అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ లో ఎక్కడ చేరుతారని ఆగమేఘాల మీద గెలిచిన అభ్యర్థులకు కేటీఆర్ సన్మానం చేయడం సిగ్గుచేటు.గత ప్రభుత్వ హయాంలో కనీసం సర్పంచులతో మాట్లాడే అవకాశం కేటీఆర్ ఇవ్వలేదు,వారి సమస్యలను పెడచేవిన పెట్టారు. గ్రామాలలో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక జిల్లాలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అప్పుడు సర్పంచ్ లపై లేని ప్రేమ ఇప్పుడు అమాంతం వారిపై పుట్టుకొచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో సర్పంచులకు సమస్యలు ఏర్పడితే బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటుచేసిన లీగల్ సెల్ ను ఆశ్రయించాలని చెప్పడం విడ్డూరంగా ఉంది. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ ఆరిపోయే దీపమని బిజెపిలో విలీనం కానుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లె కుట్రలకు కేటీఆర్ తెరలేపారని అన్నారు. పల్లెలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందడంతో జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు పెరిగిందని ఏ పార్టీ అభ్యర్థి గెలిచిన పల్లెల్లో అభివృద్ధికి తోడ్పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో అందిస్తుంది.గతంలో మా పార్టీ ఎమ్మెల్యేలు,మంత్రులు చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీపై నాయకులపై విమర్శలు మానుకోవాలని లేదంటే ప్రజాక్షేత్రంలో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, డైరెక్టర్లు పొన్నాల పరుశురాం, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లింగాల భూపతి,సత్తు శ్రీనివాసరెడ్డి, కటకం రాజశేఖర్,గుగ్గిల శ్రీకాంత్ గౌడ్,మునిగల రాజు, చుక్క శేఖర్, సుద్దాల శ్రీనివాస్ గౌడ్, మిరాల శ్రీనివాస్ యాదవ్, ఏగుర్ల ప్రశాంత్, గుగ్గిల భరత్ గౌడ్, ప్రశాంత్, మనోజ్, జనార్దన్ రెడ్డి, పయ్యావుల శ్రీనివాస్, చందు, బండి పరుశురాం, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

**ఆర్మూర్,డిసెంబర్ 16 ( జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అలూర్, ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం,భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్ఓలకు సూచించారు. కాగా, ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ కలెక్టర్ తో కలిసి అలూర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించారు. అలాగే, నందిపేట, డొంకేశ్వర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సైతం సందర్శించి పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరును పరిశీలించారు. వీరి వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

### మంత్రిగా ప్రమాణం చేస్తాడా..



# జిల్లా కల నెరవేరనుందా?

**నిజామాబాద్ బ్యూరో, డిసెంబర్ 16 జనంసాక్షి :** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ త్వరలో క్యాబినెట్ మంత్రిగా సేవలు అందించనున్నారా అంటే అవుననే చెప్పాలి. పార్టీ అధిష్టానం సైతం మహేష్ కుమార్ గౌడ్ కు మంత్రి పదవి అప్పగించే యోచనలో ఉన్నట్లు సమాచారం. త్వరలో నే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ ప్రక్షాళన జరగనున్నట్లు స్వయంగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడిం చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఢిల్లీలో రెండు రోజుల క్రితం జరిగిన మీడియా సమావేశంలో స్వయంగా మహేష్ కుమార్ గౌడ్ మంత్రివర్గ ప్రక్షాళన పై మాట్లాడారు. అయితే తనకు మొదట్లోనే మంత్రి పదవి ఇస్తానని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఆఫర్ ఇచ్చిన తాను సున్నితంగా తిరస్కరించడం జరిగిందన్నారు. నాపై అపార నమ్మకంతో అధిష్టానం నన్ను రాష్ట్ర పార్టీ బాధ్యతలు అప్పగించిందని..ఇచ్చిన పనిని సక్రమంగా నిర్వహించదమే తన ప్రథమ కర్తవ్యం అని వెల్లడించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పగ్గాలు చేపట్టిన తాను ఏడాది పాటు సమర్థవంతంగా పదవికి న్యాయం చేశానని మహేష్ కుమార్‌గౌడ్ చెప్పుకోచ్చారు. అయితే హై కమాం డ్ మాత్రం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షున్ని మార్చి కొత్తవారిని నియమించే అవకాశాలు ఉన్నట్లు పార్టీలో చర్చ మొదలైంది. అదే బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుత క్యాబినెట్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పొన్నం ప్రభాకర్ స్థానంలో మహేష్ కుమార్ గౌడ్ కు మంత్రి పదవి కట్టబెట్టే ఆలోచనలో పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా ఇప్పటివరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి అప్పగించకపోవడం మహేష్ కుమార్ గౌడు కు మంత్రి పదవి ఇవ్వాలనే ఉద్దేశంతోనే హై కమాండ్ ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వకుండా ఖాళీగా ఉంచినట్లు తెలుస్తుం ది. మాజీ మంత్రిగా పార్టీ సీనియర్ నేతగా, బోధన్ శాసనసభ్యులు గా కొనసాగుతున్న ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి కీ ఉమ్మడి జిల్లా నుండి మంత్రి పదవి ఖాయమనే ప్రచారం అప్పట్లో జరిగింది. అయితే రాజకీయ సమీకరణ నేపథ్యంలో సుదర్శన్ రెడ్డికి చివరి క్షణంలో మంత్రివర్గంలో చోటు కల్పించలేదు. అదేవిధంగా మంత్రి వర్గ విస్తరణ లోనూ సుదర్శన్ రెడ్డికి మొండి చేయి చూపడంతో ఆయనతోపాటు, అనుచర వర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయిం ది. ద్వితీయ శ్రేణి నాయకత్వం సుదర్శన్ రెడ్డికి మద్దతుగా రాజీనామాలకు సిద్ధమయ్యారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన పార్టీ అధిష్టానం సుదర్శన్ రెడ్డికి క్యాబినెట్ హోదా కలిగిన ప్రభుత్వ సలహాదారు పదవిని కట్టబెట్టింది. ఈ పదవిపై సంతృప్తి లేకపోయిన ప్పటికీ అయిష్టంగానే బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత సుదర్శన్ రెడ్డిని పార్టీ పెద్దలు బుజ్జగించి, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో భారీ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీంతో కొంత ఊరట చెందిన సుదర్శన్ రెడ్డి ఎట్టకేలకు ప్రభుత్వ సలహాదారు పదవిలో కొనసాగుతున్నారు. సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడానికి కారణం తెర వెనుక మరో కోణం ఉన్నట్లు పార్టీలో ప్రచారం మొదలైంది. ఉమ్మడి జిల్లా నుండి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా కొనసాగుతున్న మహేష్ కుమార్ గౌడ్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం హోదాలో హోం శాఖ అప్పగించే అవకాశాలు ఉన్నట్లు పార్టీలో ప్రచారం మొదలైంది. అయితే తనకు మంత్రి పదవి అవసరం లేదని చెప్పినప్పటికీ హై కమాండ్ నిర్ణయాన్ని శిరసా వహించి మంత్రి పదవిని తీసుకోవా ల్సిందే. ఇదే ప్రస్తుతం రాష్ట్రంలో హాట్ టాపిక్ గా ఉంది.

### అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా

# విజయ్ దివస్ వేడుకలు

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** సైనికుల వల్లనే నేడు మన భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నదని, దేశ ప్రజలకు ఎల్లప్పుడూ రక్షణ కల్పించేది వారేనని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో విజయ్ దివస్ సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి అమర జవాన్ల చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించి వారు చేసిన త్యాగాలను స్మరించుకుని నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విజయ్ దివస్ అనగానే అందరికీ స్ఫూర్తి వస్తుందని, సైనికుల త్యాగాలు స్ఫూర్తి నింపుతుందని వారు తెలుపుతూ పాకిస్తాన్ చెరలో బందిగా ఉన్నటువంటి బంగ్లాదేశ్ కు విముక్తి పొందినటువంటి రోజు అని సైనికులందరికీ పౌరులందరికీ గొప్ప రోజని వారు చెప్పారు. 1970లో కరడు కట్టిన పాకిస్తాన్ పై భారత్ సాధించిన అపూర్వ విషయం ఒకటి గుర్తు వస్తుందని ఆ విజయంతో బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని, భారత అమర జవాన్ త్యాగాలు పునాదులపై బంగ్లాదేశ్ పుట్టిందని విజయ్ దివస్ భారత చరిత్రలో సువర్ణఅక్షరాలతో లిఖించబడినదని, భీకరంగా జరిగినటువంటి యుద్ధంలో పాక్ సైన్యం భారత్ ముందు యుద్ధం చేయలేక చేతులెత్తేసిందని చెప్పారు. ఈ సంవత్సరం 54 విజయ్ దివస్ గా జరుపుకుంటున్నామని, ప్రతి ఒక్కరు వీర సైనికులను స్ఫూర్తిగా తీసుకోవాలని దేశానికి రక్షణ కవచంగా ఉండాలని వారు కోరారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు వారిని విముక్తి చేయాలని అనేకమార్లు విన్నవించారని చెప్పారు. వారి దయనీయ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని భారత్, పాకిస్తాన్ సైన్యంతో పోరాడి బంగ్లాదేశ్ ను విముక్తి చేసిందని చెప్పారు. జై జవాన్ - జై జై జవాన్, జయహో భారత్ - జయహో జవాన్ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్రం

- మహాత్మాగాంధీ పేరు తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం
- తెలంగాణలోని కేంద్ర మంత్రులు, ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలి
- ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉపాది హామీ పథకం నూతన బిల్లుపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఫైర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 16(జనంసాక్షి):** గత 20 సంవత్సరాల క్రితం సోనియా గాంధీ యుపిఎ చైర్ పర్సన్ గా కేంద్రంలోని యుపీఏ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామాలలోని పేదలకు భరోసా కల్పించడానికి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉపాధి దొరుకుతుందని గత పన్నెండు సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతున్న ఎన్డీఏ ప్రభుత్వం ఏ ఒక్క పథకం తీసుకురాకపోగా మారిన సామాజిక ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేస్తున్నామని పార్లమెంటులో నూతన బిల్లు ప్రవేశపెట్టిన ఎన్డీఏ ప్రభుత్వం అప్పటికి ఇప్పటికీ 20 శాతం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పటికి కనీసం కూలీ రేటు పెంచాలన్న ఆలోచన లేదని పని దినాలు కేవలం 25 రోజులు మాత్రమే పెంచారని అన్నారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రకంగా నిర్దిష్ట మొత్తాన్ని కేటాయిస్తామని పేర్కొనడం వెనుక బీజేపేతర రాష్ట్రాల ప్రభుత్వాలకు మొండి చేయి చూపే కుట్ర ఉందని నరేందర్ రెడ్డి ఆరోపించారు. మహాత్మాగాంధీ పేరు తొలగించడంలో ఉన్న శ్రద్ధ పేదలకు న్యాయం చేయాలన్న దాంట్లో లేదని నరేందర్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ లోని కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపిలు ప్రజలకు సమాధానం చెప్పాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పిట్టల రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, దండి రవీందర్, మేకల నర్సయ్య, రమణా రెడ్డి, సుదర్శన్, మేరాజ్, మాసుం ఖాన్, తోట అంజయ్య, బషీర్, పెద్దిగారి తిరుపతి, కొట్టె ప్రభాకర్, అష్రఫ్, బత్తుల రాజ్ కుమార్, బషీర్, భారీ, సాయిరాం, ఉప్పరి అజయ్, యోనా తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
17 డిసెంబర్ 2025

# బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లింది!

- కెసిఆర్ వచ్చినా..కెటిఆర్ పాదయాత్ర చేసినా ఏం లాభం?
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్,డిసెంబర్16 (జనంసాక్షి) :** బీఆర్‌ఎస్‌కు తెలంగాణ రాష్ట్రంలో కాలం చెల్లిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. కెసిఆర్ బయటకు వచ్చినా..కెటిఆర్ పాదయత్ర చేసినా ఉపయోగ మేమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బయటకు వచ్చినా చేసేదేమీ లేదన్నారు. కేటీఆర్ పాదయత్ర చేసి ఏం సాధిస్తారని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో చేయనిది సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్లలో చేశారని.. పాదయాత్ర చేస్తే కేటీఆర్‌కు ఈ విషయం అర్థమవుతుందన్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌పై ఆది శ్రీనివాస్ నిప్పులు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫారం ఇచ్చినా కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎందుకు ఓడిపోయారంటూ సందేహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తొలిసారి 171 ఓట్ల మెజార్టీతో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారని.. కానీ తాను మొదటి సారి 14,561 ఓట్లతో విజయం సాధించానని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. తండ్రి చాటు బిడ్డగా కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చారని ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను కష్టపడి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అయితే కేసీఆర్ మనవడు అధికారిక కార్యక్రమాలకు హాజరయ్యారని.. కానీ రేవంత్ మనవడు ప్రయివేట్ కార్యక్రమానికి వచ్చారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు.. మూడు దశల్లో జరుగుతున్నాయి. రేపటితో అంటే డిసెంబర్ 17వ తేదీ మూడో దశతో ఈ ఎన్నికల పక్రియ ముగియనుంది. అయితే రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కొన్ని స్థానాలను గెలుచుకుంది. ఈ ఫలితాలు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయని కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు. రోవైపు డిసెంబర్ 19వ తేదీన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయలని హామీలు, తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, ఏపీ ప్రభుత్వం చేపట్టనున్న పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్ట్ అంశం, తెలంగాణలో ప్రాజెక్ట్ అంశాలను కేసీఆర్ ప్రస్తావించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు తెలంగాణలో పాదయాత్ర చేపట్టనున్నట్లు కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు. కేటీఆర్ చేపట్టే ఈ యాత్ర వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరదంటూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శిస్తున్న విషయం విదితమే.

# మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలి

- ఉపాధి హామీ పథకాన్ని మార్చితే మోడీ ప్రభుత్వానికి పుట్టగతులుండవ్
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని, లేకుంటే ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవు అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ మంత్రి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గపు చర్య అని, మోడీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చిన్నారెడ్డి హెచ్చరించారు. మహాత్మా గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణ, పట్టణ ప్రజలు విజయవంతంగా ఉపయోగించుకుంటున్నారని, ఇలాంటప్పుడు మహాత్మా గాంధీ పేరును తొలగించడం తప్పు అని, ఇది సమంజసం కాదని చిన్నారెడ్డి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ లాంఛనంగాప్రారంభించారని చిన్నారెడ్డి గుర్తు చేశారు. దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చిన మహాత్మా గాంధీ స్వరాష్ట్రమైన గుజరాత్ అని కూడా చూడకుండా మోడీ ప్రభుత్వం ఆ మహనీయుని పేరు ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం అన్యాయమని, దేశ స్వాతంత్ర పోరాటంలో బిజెపి పాత్ర ఏమాత్రం లేదనే విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని చిన్నారెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వానికి చిన్నారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**ముంబై, డిసెంబర్16 (జనంసాక్షి) :** మార్కెట్లో బంగారం ధరలు కాస్తంత తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. హైదరాబాద్‌లో మంగళవారం నాటికి దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1520 మేర తగ్గి.. రూ.1,33,860గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ గోల్డ్‌పై రూ.1,400 పతనమై.. రూ.1,22,700గా ఉంది. ఇక వెండి విషయానికొస్తే.. నిన్న ఆకాశాన్నంటిన వెండి ధరలు.. మంగళవారం కాస్త తగ్గాయి. ప్రస్తుతం.. కిలో వెండి రేటు రూ.2,11,000గా ఉంది. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల మేలిమి పసిడి ధర రూ.1,34,730గా ట్రేడవుతోంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి రేటు రూ.1,34,010గా ఉంది. సోమవారం భారీ స్థాయిలో గరిష్ట స్థాయికి ఎగబాకిన వెండి రేట్లు నేడు కాస్త తగ్గాయి. నిన్నటితో పోల్చగా.. కిలో వెండిపై రూ.3,900 మేర తగ్గింది. ప్రస్తుతం.. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ.2,11,000గా ఉంది. చెన్నై సహా పలు ప్రముఖ నగరాల్లోనూ దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. భారత్‌-అమెరికా డీల్‌పై కొనసాగుతున్న సందిగ్ధత, డాలర్‌తో పోలిస్తే తగ్గుతున్న రూపాయి మారకం విలువ, ఫెడ్ వడ్డీ రేటులో కోత వెరసి పసిడి, వెండి ధరలకు రెక్కలొచ్చేలా చేస్తున్నాయి. పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు మార్కెట్లలో ఎప్పటికప్పుడు మారుతుంటాయి.

## గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయతీ ఎన్నికలు

- 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం
- పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటివరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం కొనసాగుతూనే ఉంది. గ్రామాలకు పూర్తి స్థాయి నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించాం అని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సహచర మంత్రుల నాయకత్వంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రామస్థాయిలో సత్తా చాటిందన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదు. రాళ్లు కాదు.. రాతి శిలలపై చెక్కిన చరిత్రే ఆదివాసీ అస్థిత్వానికి నిదర్శనం. ఇళ్ల విషయంలో భారత రాష్ట్ర సమితి నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నరలో కొన్ని వేల ఇళ్లు ఇచ్చిందని అన్నారు. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారింది. తాడ్వాయి ప్రాంతంలో ఆదివాసీ మహిళ గెలిస్తే భూములు లాగేసుకుంటారని ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం నీచమైన రాజకీయం. మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు.

## బీఎల్‌వో నిర్లక్ష్యంతో ఓట్లు కోల్పోయాం


- నార్నూర్ గ్రామస్థుల ఆందోళన



**ఆదిలాబాద్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు ఓటర్ జాబితా లో తమ పేర్లు లేకుండా చేసిన బూత్ లెవల్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం ఖైరదట్వా గ్రామస్థులు డిమాండ్ చేశారు. బీఎల్‌వోపై చర్యలు తీసుకోకపోతే సర్పంచ్ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. మంగళవారం ఈ మేరకు గ్రామంలోని కుమ్రం భీం విగ్రహం వద్ద గ్రామస్థులు డిమాండ్ చేశారు. బీఎల్‌వో విద్వాన్ నిర్లక్ష్యంతో ఓటర్ జాబితాలో 75 మంది ఓటు హక్కును కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 70 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకున్నా నేటికి జాబితాలో చోటు దక్కలేదని వాపోయారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించిన ఐదుగురి పేర్లు సర్పంచ్ ఎన్నికల జాబితాలో లేకపోవడం శోచనీయమన్నారు. ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసేందుకు కొందరి వద్ద బీఎల్‌వో రూ. వంద తీసుకొన్నట్లు ఆరోపించారు. అధికారులు స్పందించి బీఎల్‌వోపై తక్షణమే చర్యలతో పాటు విధుల నుంచి తొలగిస్తేనే నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ప్రమాణ స్వీకారం చేయిస్తామని స్పష్టం చేశారు. లేనిపక్షంలో వచ్చే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాడవి భగ్‌వంత్ రావ్, మరప జాకు, తోడసం మోతిరం, పేందూర్ రాము, మాడవి జయవంత్ రావు, యూత్ అధ్యక్షుడు కుమ్ర చతుర్షావ్ తదితరులున్నారు.

# అటవీ భూములను ఆక్రమించిన 'కొండగట్టు'

- దేవాదాయ శాఖు అటవీశాఖ నోటీసులు
- చర్చనీయాంశంగా మారిన వ్యవహారం



**జగిత్యాల, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లాలో ఉన్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ప్రస్తుతం అటవీ శాఖ, దేవాదాయ శాఖ మధ్య కీలక వివాదానికి కేంద్రంగా మారింది. అటవీ శాఖ అధికారులు ఆలయ నిర్వహణ కమిటీకి నేరుగా షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో, భక్తులలో మరియు స్థానికులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అటవీ శాఖ అధికారులు జారీ చేసిన నోటీసులలో, ఆలయ నిర్వహణ కమిటీ 684 బ్లాక్ అటవీశాఖ పరిధిలోని దాదాపు 6 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించారని స్పష్టంగా ఆరోపించారు. ఈ ఆక్రమణ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయని, ఇది అటవీ సంరక్షణ చట్టాలను ఉల్లంఘించడమేనని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఈ ఆరు ఎకరాల విస్తీర్ణంలోనే అన్నదాన సత్రం, వాటర్ ప్లాంట్, వాహన పూజ షెడ్, ఎగ్జిక్యూటివ్ బిల్డింగ్, సాగర్ గెస్ట్ హౌస్, పబ్లిక్ టాయిలెట్స్ వంటి ఆలయానికి సంబంధించిన ముఖ్యమైన కట్టడాలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో అటవీ శాఖ ఫారెస్ట్ కన్సర్వేషన్ యాక్ట్ కింద నోటీసులు జారీ చేసింది. అటవీ భూమిలో నాన్‌-ఫారెస్ట్ పనులు చేపట్టడానికి కన్సర్వేషన్ యాక్ట్ 2ం ప్రకారం కేంద్ర అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి అని నోటీసులో స్పష్టంగా పేర్కొనబడింది. అంతేకాకుండా, ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ కన్సర్వేషన్ యాక్ట్‌లోని 3ం మరియు 3ః సెక్షన్ల కింద ఈ నోటీసులు ఇవ్వబడ్డాయి. ఈ నోటీసులకు తగిన వివరణ ఇవ్వని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ ఆలయ అధికారులను హెచ్చరించింది. అయితే, ఇంతటి కీలకమైన అంశంపై ఎండోమెంట్, అటవీ శాఖ అధికారులు ఇద్దరూ మౌనం వహించడం, ఈ నోటీసుల గోప్యతపై పలు సందేహాలను మరియు అనుమానాలను పెంచుతోంది. శతాబ్దాల నాటి పురాతన ఆలయాన్ని ఇలా టార్గెట్ చేయడంపై భక్తులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టు అంజన్న సన్నిధిపై జరిగిన ఈ చర్యను భక్తులు విశ్వాసాలపై దాడిగా అభివర్ణిస్తూ మండిపడుతున్నారు. దేవాదాయ శాఖ వర్సెస్ అటవీ శాఖ మధ్య నెలకొన్న ఈ వివాదం, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో వార్డుల పునర్విభజనపై రచ్చ

- ఎంఐఎం-బీజేపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం
- గెజిట్ పత్రాలు చింపి మేయర్ పోడియం వద్దకు దూకుడు
- కౌన్సిల్ వాయిదా.. బయట బీజేపీ ఆందోళన



**హైదరాబాద్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** జిహెచ్‌ఎంసి ప్రత్యేక కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. ఈ సమావేశంలో ప్రధానంగా వార్డుల పునర్విభజన అంశంపై చర్చ కొనసాగింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇటీవల విలీనం చేసిన 27 మునిసిపాలిటీలతో పాటు, ప్రస్తుతం ఉన్న 150 వార్డులను 300 వరకు పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన డీలిమిటేషన్‌పై బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. చర్చల సమయంలో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. దారుస్సలంలో వార్డుల విభజన జరిగిందంటూ బీజేపీ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో ఎంఐఎం, బీజేపీ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీజేపీ కార్పొరేటర్లు గెజిటెడ్ పత్రాలను చింపి సభలో విసిరివేసి, మేయర్ పోడియం వైపు దూసుకెళ్లారు. దీనిపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గందరగోళం మధ్య పునర్విభజనపై కార్పొరేటర్ల నుంచి వచ్చిన అభిప్రాయాలు, అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని మేయర్ ప్రకటించారు. అనంతరం ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సభ వాయిదా అనంతరం బీజేపీ కార్పోరేటర్లు జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. రేవంత్ సర్కార్ ఎంఐఎంకు అనుకూలంగా వార్డుల విభజన చేపట్టిందని, జీహెచ్‌ఎంసీ విడుదల చేసిన మ్యాప్ తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడ భారీగా పోలీసు బలగాలను మోహరించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భాజపా కార్పొరేటర్లు నిరసన చేపట్టారు. డివిజన్ చోరీ జరిగిందంటూ ఆందోళన నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ విడుదల చేసిన మ్యాప్ తప్పులతడకగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ల పునర్విభజన గెజిట్ పత్రాలను చించేశారు. అంతకుముందు ఈ అంశంపై ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు మాట్లాడారు. డీలిమిటేషన్‌పై తమ అభ్యంతరాలను సభ దృష్టికి తీసుకెళ్లారు.

# మేడారం జాతరకు మెరుగైన రవాణా సౌకర్యం

- తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి



**ములుగు ప్రతినిధి -తాడ్వాయి, డిసెంబర్ 16(జనంసాక్షి) :** శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం, అధిక బస్సులను ఏర్పాటు చేయడమే లక్ష్యం అని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి ఐపీఎస్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి జాతరకు వచ్చే భక్తుల సౌకర్యాల దృష్ట్యా మేడారం ఆర్టీసీ బస్ స్టాండ్, బస్సుల ప్రాంగణం, ప్రయాణికుల వేచి ఉండే ప్రదేశాలు, శుభ్రత, తాగునీటి సౌకర్యాలు తదితర ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళికను పరిశీలించి ఆర్టీసీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడారం జాతర కోసం 28 ఎకరాల సువిశాల ప్రదేశంలో బస్టాండ్ ఏర్పాటు, క్యూలైన్స్, భక్తులు వేచి ఉండే గదులు, తదితర నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. జనవరి 25 తేదీ నుంచి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని, విధులలో డ్రైవర్లు కండక్టర్లు టెక్నికల్ అధికారులు ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా చూడాలని మెరుగైన రవాణా సేవలు అందించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత జాతరలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మేడారం వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం, బస్సుల ఏర్పాటు విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. తాడ్వాయి నుంచి మేడారం చేరుకునే అటవీ మార్గం మధ్యలో సిగ్నల్ సమస్య ఉండటంతో కమ్యూనికేషన్ కోసం ప్రతి కిలోమీటర్ కు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అనంతరం శ్రీ సమ్మక్క సారమ్మ వన దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఆర్టీసి ఈడిఎం మునిశేఖర్, ఈడి వెంకన్న, ఈడి సాల్మన్, ఆర్ఎం విజయ భాను, ఆర్ఎం రవి చంద్ర పాల్గొన్నారు.

# మంత్రుల తొలగింపు వార్తలు అబద్ధం

- చేరికలే తప్ప తొలగింపు ఉండదన్న పిసిసి చీఫ్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** తెలంగాణలో మంత్రిమండలి విస్తరణపై చాలా రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు త్వరలో తెరపడే అవకాశం ఉంది. జనవరిలో కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం మంత్రిమండలిలో మరో ఇద్దరు మంత్రులను తీసుకోవడానికి వీలుంది, అంటే రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న ఇద్దరు లేదా ముగ్గురిని తొలగిస్తారనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే, ఈ విషయంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ విస్తరణపై వస్తున్న ఊహాగానాలను మహేష్ గౌడ్ తోసిపుచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలను తప్పిస్తారనే ప్రచారం జరిగింది. దీనిపై మహేష్ గౌడ్ స్పందిస్తూ, ఆ ఇద్దరు మంత్రులు కేబినెట్‌లో కొనసాగుతారని స్పష్టత ఇచ్చారు. కేబినెట్‌లో తీసివేతలు ఉండవని, కేవలం చేరికలే ఉంటాయని ఆయన అన్న మాటలు కొందరికి ఊరట కలిగించాయి. కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చించిన తర్వాతే ఆయన ఈ ప్రకటన చేశారా లేదా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చలు జరిగాయా అనే చర్చ రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. కొంత మంది మంత్రులపై వివిధ రకాల ఆరోపణలు ఉన్నాయని, సొంత పార్టీ ఎమ్మెల్యేలు కూడా అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ, వారిని తొలగించే అవకాశం లేదని, శాఖల మార్పు మాత్రం ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ ఇండికేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. శాఖల మార్పులు చేసే విషయంలో కాంగ్రెస్ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుంది, ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డికి కూడా కొంత స్వేచ్ఛను ఇచ్చినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణలో ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయనేది ప్రధానంగా చర్చనీయాంశమైంది. ఈ పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటారా లేదంటే కేబినెట్‌లో ప్రాతినిధ్యం దక్కని జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. జనవరిలో జరగబోయే ఈ విస్తరణతో కేబినెట్ పూర్తిస్థాయిలో కొలువుదీరే అవకాశం ఉంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370